


# వుదయం




హైదరాబాద్ | ఆదివారం, డిసెంబర్ 7, 2025 | CIRCULATED SINCE 25 YEARS TELUGU DAILY Estd. 1999 | సంపుటి : 26 | సంచిక : 271 | వెల : రూ. 3.00 | పేజీలు : 12

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal www.voodayam.com Followus on Social Media: /voodayam

## రోల్ మోడల్‌గా గ్లోబల్ సమ్మిట్

- అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో సమావేశం



**వుదయం, హైదరాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ ప్రపంచంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి గారు శనివారం నాడు పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి అనేక రంగాల్లో విశేషగుర్తింపు పొందిన దిగ్గజాలను ఆహ్వానించడం జరిగిందన్నారు. గడచిన రెండు సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు 2037 విజన్, 2047 విజన్

మిగతా 12లో...

## పరిశ్రమ అవసరాలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

**మ్యానుఫాక్చరింగ్ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు**

12లో.. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణ దేవరాయలు

గ్లోబల్ టీపీఓ & హెచ్ఆర్ లీడర్షిప్ ఎక్సలెన్స్ సమిట్ 2025






# అంతర్జాతీయ విజన్

## రెండు రోజుల పాటు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు



**తరలిరానున్న దేశ విదేశాల ప్రముఖులు**

- రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించే దిశ
- 27 ప్రత్యేక సెషన్లు.. వివిధ రంగాలపై చర్చలు
- అంతర్జాతీయ స్థాయిలో వేడుకకు సిద్ధం

**వుదయం, హైదరాబాద్ ప్రతినిధి :**

భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 కు దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, విద్యావేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు తరలిరానున్నారు. రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించే దిశగా జరిగే ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రెండు రోజుల పాటు మొత్తం 27 ప్రత్యేక ప్యానెల్ చర్చలు జరుగుతాయి. ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, ఐటీ–సెమీకండక్టర్లు, హెల్త్, ఎడ్యుకేషన్, టూరిజం, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వ్యవసాయం, పరిశ్రమలు, మహిళా వ్యాపారవేత్తల ప్రోత్సాహం, గిగ్ ఎకానమీ, సామాజిక సంక్షేమం, స్టార్టప్‌లు వంటి విభిన్న రంగాలపై చర్చలు ఉంటాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, వరల్డ్ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యూనీసెఫ్ ప్రతినిధులతో పాటు తేరి, బీసీజీ, మైక్రాన్ ఇండియా, హిటాచీ ఎనర్జీ, ఓ2 ఎనర్జీ, గ్రీన్ కో, ఆపోలో హాస్పిటల్స్, ఐఐటీ హైదరాబాద్, నాస్కామ్, సాఫ్రాన్, డీఆర్డీఓ, స్కైరూట్, ధ్రువ స్పేస్, అమూల్, లారస్ ల్యాబ్, జీఎంఆర్, టాటా రియాలిటీ, కొటక్, గోల్డ్‌మాన్ సాచ్, బ్లాక్ స్టోన్, డెటాయిట్, కాపిటల్ లాండ్, స్విగ్గి, ఏడబ్ల్యూఎస్, రెడ్ హెల్త్, పీవీఆర్, ఐనాక్స్, శిఖా ఎంటర్‌టైన్‌మెంట్, తాజ్ హోటల్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. పివి సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపిచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా వంటి క్రీడా ప్రముఖులు 'ఓలింపిక్ గోల్డ్ క్వెస్ట్' సెషన్‌లో పాల్గొంటారు. రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గుణీత్ మోంగా, అనుపమా చోప్రా వంటి సినీ ప్రముఖులు 'క్రియేటీవ్ క్వెస్ట్ – సాఫ్ట్ పవర్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్' చర్చలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు, అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమ్మిట్

మిగతా 12లో...

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వానానికి కృతజ్ఞతలు

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వానానికి కృతజ్ఞతలు
- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ
- సమ్మిట్ ఘన విజయం సాధించాలని ఆకాంక్ష



**వుదయం, హైదరాబాద్ ప్రతినిధి :**

డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకుగాను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆహ్వానం అందుకోవడం ఎంతో గౌరవప్రదమైనదని పేర్కొన్నారు. అయితే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న తేదిల్లో తనకు ముందుగానే నిర్ణయించిన జిల్లా పర్యటనలు ఉండటం వల్ల, కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ గ్లోబల్ సమ్మిట్ సార్థక చర్చలకు వేదికగా నిలిచి, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశంగా మారాలని ఆమె ఆకాంక్షించారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" కార్యక్రమం ఘన విజయం సాధించాలని మమతా బెనర్జీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించే బాధ్యతను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు అప్పగించారు. దీనిలో భాగంగా మంత్రి సీతక్క, బెంగాల్ సీఎం మమతా బెనర్జీని సంప్రదించేందుకు ప్రయత్నించారు. అయితే జిల్లాల్లో జరుగుతున్న అధికారిక కార్యక్రమాల్లో మమతా బెనర్జీ బిజీగా ఉండటంతో, వ్యక్తిగతంగా కలవడం కష్టమని ఆమె ఆదేశాల మేరకు ఆహ్వాన పత్రాన్ని ఇ–మెయిల్ ద్వారా పంపించాలని మమతా బెనర్జీ కార్యాలయం సూచించింది. అనుగుణంగా మమతా బెనర్జీ కార్యాలయంతో సమన్వయం సాధించిన మంత్రి సీతక్క తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అధికారిక ఆహ్వాన పత్రికను ఇ–మెయిల్ ద్వారా పంపించారు.ఆహ్వాన పత్రిక అందుకున్న అనంతరం మమతా బెనర్జీ తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ లేఖ పంపారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమం ఘన విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

## గ్లోబల్ సమిట్‌లో మహిళా శక్తికి జేజేలు

**ప్రధాన ఆకర్షణగా ఇందిరా మహిళా శక్తి స్టాల్**

- ఆకట్టుకుంటున్న సంఘాలు సాధించిన విజయాల స్టాల్స్
- డాక్యుమెంటరీల ప్రదర్శన కోసం ప్రత్యేక స్క్రీన్ లను ఏర్పాటు




**వుదయం, హైదరాబాద్ ప్రతినిధి :**

భారత్ ఫ్యూచర్ [illegible]లో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్–2047లో మహిళా సాధికారతకు ప్రతీకగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రజాప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న విధానాలకు ఈ స్టాల్ అద్దం పడుతోంది. మహిళా స్వయం సహాయక సంఘాల శక్తి, సాధికారత, వ్యాపార నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల ముందు సమగ్రంగా ప్రదర్శించే వేదికగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ నిలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూళన సంస్థ (సెర్ప్), తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన అనేక వినూత్న కార్యక్రమాల నమూనాలు ప్రదర్శిస్తున్నారు. మహిళలే నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి పెట్రోలు బంకు, హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్, జిల్లాల వ్యాప్తంగా నిర్మితమైన ఇందిరా మహిళా శక్తి భవనాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు, అలాగే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ వంటి విభిన్న వ్యాపారాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధించిన విజయాలు ఈ స్టాల్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి.

గ్రామీణ స్థాయి నుంచి గ్లోబల్ వేదిక వరకు మహిళల ప్రయాణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన డాక్యుమెంటరీలను ప్రదర్శన కోసం ప్రత్యేక స్క్రీన్ లను ఏర్పాటు చేశారు. మహిళా స్వయం సహాయక బృందాలు ఎలా వ్యాపారవేత్తలుగా ఎదిగాయి, ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధి ఎలా సుస్థిర ఆదాయ మార్గాలుగా మారింది అనే అంశాలు ఈ డాక్యుమెంటరీల ద్వారా సందర్శకులు తెలుసుకోగలగుతారు. అలాగే మహిళా–శిశు సంక్షేమం కోసం ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన నూతన కార్యక్రమాల వివరాలను కూడా స్టాల్‌లో సమగ్రంగా ప్రదర్శిస్తున్నారు. ప్రజా ప్రభుత్వ...

మిగతా 12లో...

## స్థానిక 'సేవ'లో..

**మీసేవ కేంద్రాల్లో రికార్డు స్థాయి రద్దీ**

- సర్పంచ్ ఎన్నికలతో సర్టిఫికేట్ దరఖాస్తుల వెల్లువ
- రద్దీ ఉన్నప్పటికీ నిర్విరామంగా సేవలు
- భరోసా ఇస్తున్న సిబ్బంది సేవలు

**వుదయం, హైదరాబాద్ ప్రతినిధి :**

సర్పంచ్ ఎన్నికల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో ఆదాయం, కుల సర్టిఫికేట్‌ల కోసం అప్లికేషన్లు భారీగా పెరిగాయి. గత రెండు వారాల్లో మీసేవ ఈ ఏడాది అత్యధిక దరఖాస్తులను స్వీకరించినట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నవంబర్ 24 నుంచి డిసెంబర్ 5 వరకు మీసేవ మొత్తం 4,19,219 దరఖాస్తులు స్వీకరించింది. వీటిలో 1,67,779 ఆదాయ సర్టిఫికేట్‌లు, 1,61,601 కుల సర్టిఫికేట్‌లు, 2,185 ఆదాయ రీయిష్యూ, 87,654 కుల రీయిష్యూ దరఖాస్తులు ఉన్నాయి. భారీ రద్దీ ఉన్నప్పటికీ సేవల్లో పెద్దగా అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. కొన్ని కేంద్రాల్లో తలెత్తిన స్వల్ప సాంకేతిక సమస్యలను టెక్నికల్ టీములు వెంటనే పరిష్కరించాయి. రోజువారీ గణాంకాలు ఎన్నికల రద్దీని...

మిగతా 12లో...






# ప్రవాసీల హక్కుల రక్షణ ఏదీ

"దేశాల్లో భారతీయుల భద్రత, గౌరవం, జీవనోపాధి, రక్షణ వ్యవస్థలపై ఎటువంటి సందిగ్ధత లేకుండా చట్టం రూపొందించాలంటే ప్రస్తుత బిల్లును లోతుగా అధ్యయనం చేసి అవసరమైన సవరణలు చేయడం అత్యంత అవసరమని ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. వలస కార్మికుల హక్కులను కాపాడుతూ, దోపిడీని అరికట్టుతూ, రాష్ట్రాల సహకారంతో సమన్వయపూర్వక వ్యవస్థను ఏర్పాటు చేసే విధంగా బిల్లు రూపుదిద్దుకోవాలి."

ప్రవాసీ భారతీయుల హక్కులు, భద్రత, సంక్షేమం వంటి అత్యంత కీలకమైన అంశాలను ప్రభావితం చేసే ఓవర్సీస్ మొబిలిటీ (విదేశీ వలస) బిల్-2025 రూపకల్పన దశలో ఉన్న పరిస్థితుల్లో, ప్రవాసుల స్వరాన్ని నిజంగా ప్రతిబింబించేలా ఈ చట్టం ఉండాలని తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యుడు చెన్నమనేని శ్రీనివాసరావుతో కూడిన ప్రతినిధి బృందం ఢిల్లీలో గురువారం తెలంగాణకు చెందిన ఏడుగురు పార్లమెంటు సభ్యులను కలిసి వినతిపత్రాలు సమర్పించింది. నాలుగు దశాబ్దాలుగా అమలులో ఉన్న ఎమిగ్రేషన్ యాక్ట్-1983 స్థానంలో కేంద్ర ప్రభుత్వం సమగ్ర మార్పులు ప్రతిపాదిస్తున్న సందర్భంలో, విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే లక్షలాది మంది వలస కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగు పడేలా, వారి హక్కులు రక్షితంగా ఉండేలా బిల్లు వుండాలని ప్రతినిధులు స్పష్టం చేశారు. భారతీయ వలస కార్మికులు విదేశాల్లో గౌరవంగా, భద్రతతో, శ్రమ విలువ కను గుణంగా జీవించే అవకాశాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలని కోరారు.విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్థాండింగ్ కమిటీ సభ్యురాలు, బీజేపీ ఎంపీ డీకే అరుణ, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కెఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, సురేష్ షెట్కార్, డా. కడియం కావ్య, గడ్డం వంశీక్రిష్ణ, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ లతో జరిగిన చర్చల్లో బిల్లు రూపకల్పనలో తొలగింపబడిన అనేక రక్షణా నిబంధనలను వారు స్పష్టంగా ప్రస్తావించారు.

2021 ముసాయిదాలో ఉన్న అనేక హామీలు, రక్షణలు ప్రస్తుత ప్రతిపాదనలో లేవని, అధికారం కేంద్రీకృతమయ్యే విధానం వలస కార్మికులపై దోపిడీ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని భీంరెడ్డి, శ్రీనివాసరావులు వివరించారు. వలస కార్మికులు నేరుగా కోర్టులను ఆశ్రయించే హక్కు తొలగించడం, మహిళలు%-%పిల్లల రక్షణలకు ప్రత్యేక నిబంధనలను 'సున్నిత వర్గాలు' అంటూ అస్పష్టమైన శీర్షికలో విలీనం చేయడం, రిక్రూట్మెంట్ ఏజెన్సీలు వసూలు చేసే ఫీజుల వివరాలను వెల్లడించే నిబంధన తొలగించడంతో రుణబానిసత్వం పెరుగే ప్రమాదం, విదేశాలకు పంపించిన అనంతరం ఏజెన్సీల బాధ్యతను పరిమితం చేయడం, విదేశాలనుంచి తిరిగివచ్చిన వారికి ఉండే పునరేకీకరణ వ్యవస్థ బలహీనపడటం, ఆరు నెలల లోపు డిపోర్ట్ అయిన వారిని 'రిటర్నీలు'గా పరిగణించక పోవడం వంటి అంశాలు ప్రవాసుల హక్కులను గణనీయంగా బలహీన పరుస్తాయని వారు గుర్తుచేశారు. 'ఎమిగ్రంట్', 'ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్', 'లేబర్' వంటి కీలక పదాల నిర్వచనాల్లో విద్యార్థులు, ఆధారితులు, డిజిటల్ కార్మికులు వంటి వర్గాలను




బయటకు నెట్టడం, మానవ అక్రమ రవాణాకు స్పష్టమైన నిర్వచనం లేకపోవడం, కేంద్రీకృత పాలనా విధానంలో రాష్ట్రాలకు, కార్మిక సంఘాలకు, హక్కుల సంస్థలకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల సమస్యల పరిష్కారం దూరమవుతుందనే ఆందోళనలు ప్రతిపాదించారు.

ముఖ్యంగా ప్రతిపాదిత 'ఓవర్సీస్ మొబిలిటీ అండ్ వెల్ఫేర్ కౌన్సిల్'లో వలస కార్మికులను విదేశాలకు పంపే రాష్ట్రాలకు చోటు లేకపోవడం తీవ్రమైన లోపమని పేర్కొన్నారు. ఎమిగ్రేషన్ చెక్‌పోస్టులు రద్దు చేసినప్పటికీ ప్రత్యామ్నాయ నియంత్రణ వ్యవస్థ లేకపోవడం, ప్రయాణానికి ముందు శిక్షణా ప్రమాణాలు, విదేశాలలో అందించాల్సిన సహాయక సేవలు స్పష్టంగా లేకపోవడం, ఇంటిగ్రేటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ హక్కుల కంటే పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, 24/7 హెల్ప్‌లైన్‌లు, విమానాశ్రయం ఎంబసీ సహాయం తప్పనిసరి అంశాలుగా ప్రతిపాదించక పోవడం, శిక్షలు కేవలం రిక్రూట్మెంట్ ఏజెంట్లపైనే ఉండటం, విదేశీ యజమాన్యాలపై చర్యలేమీ లేకపోవడం, అక్రమ ఆన్‌లైన్ రిక్రూట్మెంట్, ట్రాఫికింగ్ నియంత్రణకు ప్రత్యేక నిబంధనలు లేకపోవడం, విధించే జరిమానాల్లో బాధితులకు పరిహారాన్ని కేటాయించక పోవడం వంటి అంశాలు కూడా వారి ప్రాతినిధ్యం వహించిన కోరల్లో భాగమయ్యాయి. ఇవన్నీ కలిపి చూస్తే బిల్లులో ప్రవాసీ కార్మికుల సంక్షేమం బలపడటానికి కాకుండా బలహీన పడే అవకాశం ఎక్కువగా ఉందని వారు ఎంపీల దృష్టికి తీసుకెళ్లారు. విదేశాల్లో భారతీయుల భద్రత, గౌరవం, జీవనోపాధి, రక్షణ వ్యవస్థలపై ఎటువంటి సందిగ్ధత లేకుండా చట్టం రూపొందించాలంటే ప్రస్తుత బిల్లును లోతుగా అధ్యయనం చేసి అవసరమైన సవరణలు చేయడం అత్యంత అవసరమని ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. వలస కార్మికుల హక్కులను కాపాడుతూ, దోపిడీని అరికట్టుతూ, రాష్ట్రాల సహకారంతో సమన్వయపూర్వక వ్యవస్థను ఏర్పాటు చేసే విధంగా బిల్లు రూపుదిద్దుకోవాలని వారు కోరారు.

# త్యాగమూర్తుల సేవలను గుర్తెరగాలి

దేశ మాతృ గౌరవాన్ని కాపాడటానికి, దేశరక్షణ కోసం, ప్రాణాలను ఫణంగా పెడుతూ, ధైర్యంగా పోరాటబాటలో పయనిస్తున్న సాయుధ యువత, అలాగే అమరవీరుల త్యాగాలను ఎలా విస్మరించగలం. విధి నిర్వహణలో అసువులు బాసిన వారి కుటుంబాలకు, యుద్ధ భూమిలో క్షతగాత్రులకు ఏ మిచ్చి రుణం తీర్చుకోగలం. భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన వెంటనే, ప్రభుత్వం తన రక్షణ సిబ్బంది సంక్షేమాన్ని నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించింది. ఆగష్టు 28, 1949 న, రక్షణ మంత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక కమిటీ ప్రతి సంవత్సరం డిసెంబర్ 7 న ఒక జెండా దినోత్సవాన్ని జరుపు కోవాలని నిర్ణయించింది. 1993 లో, భారత రక్షణ మంత్రిత్వ శాఖ సంబంధిత సంక్షేమ నిధులను ఒకే సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి (ఫ్లాగ్ డే ఫండ్)గా ఏకీకృతం చేసింది.జెండా దినోత్సవాన్ని పాటించడం ద్వారా పౌరులకు చిన్న జెండాలను పంపిణీ చేయడం, విరాళాలు సేకరించడం. దేశం కోసం పోరాడే సాయుధ దళాల సిబ్బంది సంబంధిత కుటుంబాలను, ఆధార పడిన వారిని జాగ్రత్తగా చూసుకోవడం భారత దేశ పౌర బాధ్యత అని భావించి నందున పతాక దినోత్సవం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గాయపడినవారికి పునరావాసము, కల్పించడం, మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబీకుల సంక్షేమము, పునర్నివాసము, కల్పించడం, సర్వీసులో గల సిబ్బంది, వారి కుటుంబీకుల సంక్షేమము ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. వారి సంరక్షణ, సంక్షేమం, పునరా వాసం జాతి బాధ్యత. అలాగే తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న మాజీ సైనికులు చికిత్స కోసం అధిక వ్యయాన్ని భరించలేని వారు ఉన్నారు. అందువల్ల, వారి సంక్షేమం గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం అనివార్యం. వారిపై ఆధారపడే వారిని చూసుకోవాల్సిన బాధ్యతను ఫ్లాగ్ డే తెరపైకి తెస్తుంది. అట్టి అవసరమైన వారికి సహాయాన్ని అందించడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ చర్యలు సరిపోవు. అందువల్ల, ప్రతి పౌరుడు వారి సంరక్షణ, మద్దతు, పునరావాసం కోసం ఆర్థిక సహాయాన్ని అందించడంలో స్వచ్ఛంద సహకారాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. అందుకే ఈరోజు సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని పాటించడం ద్వారా ఆర్మీ, నేవీ, వైమానిక దళం చేసిన సేవలు గుర్తుకు తెచ్చుకుని, అమరవీరుల, వికలాంగ సిబ్బందిపై ఆధారపడిన వారి పునరావాసం, సంక్షేమాన్ని పట్టించు కోవడం ప్రతి పౌరుడి విధి. రక్షణ మంత్రిత్వ శాఖలో భాగమైన కేంద్రీయ సైనిక్ బోర్డు స్థానిక అధికారుల ద్వారా ఈ నిధుల సేకరణను దేశ.వ్యాప్తంగా నిర్వహిస్తారు. సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ పరిపాలనకు కేంద్రీయ సైనిక్ బోర్డు బాధ్యత వహిస్తుంది. దీనిని మేనేజింగ్ కమిటీ నిర్వహిస్తుంది. కేంద్రంలో రక్షణ మంత్రి నేతృత్వంలో, రాష్ట్ర / కేంద్రం పాలితాలలో గవర్నర్ / లెఫ్టినెంట్ గవర్నర్ ఆధ్వర్యం వహిస్తారు. భారత ప్రభుత్వ అత్యున్నత సంస్థ అయిన కేంద్రీయ సైనిక్ బోర్డ్ 32 మంది సైనిక్ బోర్డులు, 392 జిల్లా సైనిక్ బోర్డుల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలకు సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ నుండి నిధులు సమ కూరుతాయి. కేంద్రంలోని కేంద్రీయ సైనిక్ బోర్డు మాదిరిగానే రాష్ట్ర, జిల్లా సైనిక బోర్డుకు... మాజీ సైనికులు, వితంతువులు మరియు ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాల్లో నివసిస్తున్న వారిపై పునరావాసం, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఆయా సైనిక్ బోర్డులు బాధ్యత వహిస్తాయి. భారత సాయుధ త్రివిధ దళాల...భారత సైన్యం, భారత వైమానిక దళం, భారత నావికాదళం మూడు సేవలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎరుపు, లోతైన నీలం, లేత నీలం రంగులలో చిన్న జెండాలు విరాళాలకు బదులుగా పంపిణీ చేయ బడతాయి. సేకరణ స్వచ్ఛంద సంస్థల ద్వారా అధికారిక, అనధికారిక మార్గాల ద్వారా నిర్వహించ బడుతుంది. దేశ ప్రజల ధన, ప్రాణ, మాన రక్షణకై అంకిత భావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తి స్తూ, విధి వంచితులుగా మారిన త్యాగ మూర్తులకు, వారిపై ఆధార పడిన కుటుంబీకులకు చేయూత అందించాల్సిన అవసరాన్ని, బాధ్యతను దేశ వాసులుగా అందరూ గుర్తించాలి.

# తెలుగు సినీ జగత్తు మహానటి

సినిమా హాల్లో తెర వెలిగిన క్షణం, కథ మొదలుకాకముందే మన హృదయాల్లో మొదట వెలిగేది సావిత్రి కళ్ల మెరుపే. ఆమె పాత్రలో నటించలేదు.. జీవించింది. నవ్వు, బాధ, అమాయకత్వం, బలహీనత.. ప్రతీ భావానికీ ఆమె కళ్లే అక్షరాలు. సినిమా ఆమెకు వృత్తి కాదు.. స్వయం ఆవిష్కరణ. తెర కరిగినా కాలం గడిచినా, సావిత్రి మాత్రం మన జ్ఞాపకాల అద్దంలో శాశ్వతంగా నిలిచిపోయిన శ్వాస. సినిమా హాలులో తెర వెలిగిందంటే మొదట వెలిగే మెరుపు సావిత్రి కళ్లది, కథ మొదలవక ముందే ఆమె కళ్లలోని నవ్వులు, వేదనలు మన గుండెల్లో చోటు చేసుకున్నాయి. పాత్రల్ని ఆమె ధరించలేదు, ఆమె ఆ పాత్రగా శ్వాసించింది. 'మాయాబజార్'లో చిరునవ్వు మన పండుగల దివిటీ. 'మిస్సమ్మ'లో నడక మన పెరట్లో మనం జారి పడకుండా మన చిన్నప్పుడు అమ్మ పట్టుకున్న చేయి. దుఃఖం ఆమెకు అలంకారం కాదు జీవితపు నిజం. ఆమె కళ్లలో ప్రతి నీడ స్త్రీ ఓర్పు, మౌనం, పగలు రాత్రి.. తెరకరిగిపోయినా, కాలం దూరమైనా, సావిత్రి ఇంకా మనలో ఉంది. సావిత్రి తెరపై కాదు, మన జ్ఞాపకాల అద్దంలో నిలిచిపోయిన శ్వాస. నాకయితే స్మీన్ ప్రజెన్స్‌లో స్మితాపాటిల్ తర్వాతి స్థానం సావిత్రిదే. నటిగా ఆమెది గొప్ప భావస్ఫోరకమయిన ముఖం.

పాత్రల భావాల్ని వ్యక్తీకరించడంలో ఆమె చూపిన ప్రతిభ స్మితాపాటిల్, మీనాకుమారి లాంటి కొద్దిమందికే సాధ్యమయింది. సావిత్రి తన కళ్లతో ప్రకటించిన భావాలు గులాబీలు విచ్చుకున్నంత సహజంగానూ, పరిమళాలు విస్తరించినంత హాయిగానూ ఉంటాయి. ఇక సావిత్రి మూతి విరుపులో ఆమె చూపిన విన్యాసం ఎన్నో భావాల్ని అలవోకగా ఆవిష్కరించేవి. నటించింది 80 పైచిలుకు సినిమాలే అయినప్పటికీ ఆనాటి తెలుగు తమిళ ప్రేక్షకుల్లో చిరస్థాయిగా సావిత్రి నిలిచిపోయింది. నటనే తన జీవితం అనుకుంది కానీ జీవితంలో నటించలేక సావిత్రి గెలిచి ఓడింది, ఓడి గెలిచింది.

ఓ పక్క నటిగా ఎదుగుతూనే దర్శకత్వ బాధ్యతల వైపునకు మొగ్గు చూపింది. దర్శకురాలిగా చిన్నారి పాపలు, కుళందై ఉళ్ళం (తమిళం), మాతృదేవత, చిరంజీవి, వింత సంసారం, ప్రాప్తం (తమిళం) సినిమాలను రూపొందించింది. తర్వాత నిర్మాతగా 'వింత సంసారం', ప్రాప్తం (తమిళం) సినిమాలు తీశారు. నటనను జీవితంగా చేసుకున్న సావిత్రి జీవితంలో నటించలేక వెళ్లిపోయింది. అలా ఒక మహా నటి, వ్యక్తిత్వమున్న మహామనిషి సెలవంటూ వెళ్లిపోయారు.



అందగత్తెగా రెండు భాషల ప్రేక్షకుల మనస్సులో సావిత్రి స్థానం సుస్థిరం. మహానటిగా ఆమె అభినయం అజరామరం. కొమ్మారెడ్డి సావిత్రిని ఏదో ఒక చిత్రం తోనో ఒక రకం పాత్రలతోనూ గుర్తుంచుకోలేం. తన పాత్రల నిర్వహణలో చూపిన వైవిధ్యం అద్భుతమైంది. భావి తరాల నటులకు ఆమె ఒక మోడల్. సంభాషణలు చెప్పడంలో ఆమె చూపిన సరళత్వం, భావ ప్రకటనలో కనిపించే సహజత్వం ఆమె సొంతం. మూతి విరిచినా, వెక్కిరించినా, సంతోషమైనా, దుఃఖమైనా, అమాయక పాత్ర అయినా, చలాకీ పాత్ర అయినా సావిత్రి, సావిత్రి అభినయం విస్మృతమయింది. పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేయడం ఆమె ప్రత్యేకత. అలవోకగా కనిపించడం నటిగా ఆమె సాధించిన విజయం. మిస్సమ్మ, బతుకుతెరువు, దేవదాసు, అర్ధాంగి, దొంగరాముడు, మాయాబజార్, మాంగల్య బలం, నర్తనశాల ఇట్లా సాంఘిక, పౌరాణిక ల్లాంటి అనేక జానర్లల్లో ఆమె ఒదిగిపోయింది.

సావిత్రి నిజానికి తన జీవితంలో ఎదుర్కొన్న సంక్లిష్టతలను దుఖాలను, స్వీకరించి వాటిని కళగా మార్చి నటిగా నిరూపించుకుంది. 1935 డిసెంబర్ ఆరో తేదీన సావిత్రి కృష్ణా జిల్లా చిర్రావూరులో జన్మించింది.

ఆర్థికంగా మెరుగైన కుటుంబంలో జన్మించిన సావిత్రి తన అక్షరాభ్యాసంతో పాటు నృత్యంలో కూడా ప్రవేశించింది. 1950లో గోపాలకృష్ణా పంపిణీ సంస్థకు చెందిన కృష్ణమూర్తి ప్రేరణతో సావిత్రి పెదనాన్న తోడుగా మద్రాస్ చేరుకొని సినిమాప్రయత్నాలు మొదలు పెట్టింది. సావిత్రి తన నటన ప్రతిభను నిరూపించుకోవడానికి నృత్యరూపకుడూ, దర్శకుడూ అయిన వేదాంతం రాఘవయ్య దర్శకత్వం వహించిన 'దేవదాసు' సినిమా సమున్నతంగా నిలిచింది. అదే సమయంలో 'పల్లెటూరు', 'మేనరికం', 'సంక్రాంతి', 'ప్రతిజ్ఞ', 'చంద్రహారం', 'బ్రతుకుదెరువు', 'జ్యోతి' తదితర సినిమాలు పరంపరగా వచ్చాయి. ఇక ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో మిస్సమ్మలో మొండితనం, వ్యక్తిత్వం వున్న మేరీ పాత్రతో సావిత్రి కెరీర్ వేగం పుంజుకుంది. నిజానికి 'మిస్సమ్మ'లో మొదట భానుమతి కథానాయిక. కొన్ని రోజులు షూటింగ్ జరుపుకున్న తర్వాత అనివార్యమైన కారణాల వల్ల ఆ పాత్ర సావిత్రికి లభించింది. సావిత్రి తొలి రోజుల్లోనే కన్యాశుల్కంలోని 'మధురవాణి, తర్వాత 'మిస్సమ్మ' లో మేరీ, 'మాయాబజార్'లో శశిరేఖ పాత్రలలో ఆమె నటన మకుటాయమానమైంది. 'సంసారం సినిమాలో పనికిరావని ప్రకటించిన సినిమా రంగం.. దేవదాసు, మిస్సమ్మ లాంటి సినిమాలతో ఆమెకు పెద్ద పేట వేసింది. అద్భుతమయిన సావిత్రి ఎదుగుదల తనకు తానే సాటి అన్నంతగా ఒక ఒరవడిగా నిలిచిపోయింది. సావిత్రి నటించిన 'చివరకు మిగిలేది', 'వెలుగు నీడలు', 'మూగమనసులు', పూజా ఫలం', 'డాక్టర్ చక్రవర్తి', 'నాదీ ఆడజన్మ', 'నవరాత్రి', 'రక్తసంబంధం', 'మనసే మందిరం', మంచి మనసులు', ' సుమంగళి' ... ఇలా ఎన్నో సినిమాలు ఆమె నటనకు గీటురాళ్ళగా మిగిలాయి. ఓ పక్క నటిగా ఎదుగుతూనే దర్శకత్వ బాధ్యతల వైపునకు మొగ్గు చూపింది. దర్శకురాలిగా చిన్నారి పాపలు, కుళందై ఉళ్ళం (తమిళం), మాతృదేవత, చిరంజీవి, వింత సంసారం, ప్రాప్తం (తమిళం) సినిమాలను రూపొందించింది. తర్వాత నిర్మాతగా 'వింత సంసారం', ప్రాప్తం (తమిళం) సినిమాలు తీశారు. నటనను జీవితంగా చేసుకున్న సావిత్రి జీవితంలో నటించలేక వెళ్లిపోయింది. అలా ఒక మహా నటి, వ్యక్తిత్వమున్న మహామనిషి సెలవంటూ వెళ్లిపోయారు.

## క్రమశిక్షణే..
# మా మతం?

సాధారణంగానే మిలిటరీ రూల్స్ కఠినంగానే ఉంటాయి. అందులోని మాన్యువల్స్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శిక్షలు కూడా నిర్దాక్షిణ్యంగా ఉంటాయి. దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి క్రమశిక్షణ ఉల్లంఘనలకు ఎలాంటి మన్నింపులు, మాఫీలు ఉండవు. సైన్యంలో చేరేముందే వీటన్నింటిని గురించి ఆలోచించుకోవాలి. సాధారణ పౌరుడికి లభించే స్వేచ్ఛ కూడా కొన్ని సందర్భాల్లో సైనికులకు నిరాకరించవచ్చు. కోర్టులు కూడా సైనికుడి వాదనను త్రోసిపుచ్చుతాయి. కవాతులో భాగంగా పరమత దేవాలయంలోకి వెళ్లి పూజను ఆచరించకున్నా క్రమశిక్షణ తప్పిన కిందికే లెక్క. క్రైస్తవ మతానికి చెందిన సైనిక అధికారి సామ్యూల్ కమలేశన్ తన రెజిమెంట్ పాటించే హిందూ మత ఆచారాలను పాటించనందుకు క్రమశిక్షణ చర్యగా 2021 లో తన ఉద్యోగం కోల్పోయాడు. ఆర్మీ చట్టంలోని సెక్షన్ 19, ఆర్మీ రూల్స్‌లోని రూల్ 14 ప్రకారం తమ చర్య సక్రమమే అని సైన్యం అంటోంది. తనను తిరిగి ఉద్యోగం లోకి తీసుకోవాలని ఆయన ఢిల్లీ హైకోర్టులో, ఆ తర్వాత సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్లు కూడా ఫలితం ఇవ్వలేదు. రెండు కోర్టులు సైన్యం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించాయి. పంజాబ్ లోని మూడవ కల్వరి రెజిమెంట్ లో సామ్యూల్ కమలేశన్ లెఫ్టినెంట్ కల్నల్ గా 2017 లో చేరాడు. ఆ యూనిట్‌లో హిందూ గుడి, గురుద్వారా మాత్రమే ఉన్నాయి. వారంలో ఒకసారి సైనికులంతా కవాతుగా వెళ్లి ఆ దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తుంటారు. వారితో గుడుల దాకా వెళ్లిన ఆయన హారతి సమయంలో బయటే ఉండిపోయేవాడు. ఈ ప్రవర్తన ఆర్మీ నిబంధనలకు విరుద్ధమని ఆయనకు పలుమార్లు చెప్పడం జరిగింది. ఆయన రెజిమెంటల్ పరేడ్‌లో పూర్తిగా పాల్గొన లేదని, ఆర్మీ చట్టంలోని సెక్షన్ 41 పై అధికారి ఆదేశాలను ఉల్లంఘించడం నేరమని కూడా పేర్కొంది. తన క్రైస్తవ విశ్వాసాలు ఇందుకు అనుమతించవని ఆయన అధికారులకు స్పష్టం చేశాడు. సుదీర్ఘ విచారణ తర్వాత అతను 2021 లో సర్వీస్ నుండి తొలగించబడ్డాడు. తన తొలగింపును సవాల్ చేస్తూ కమలేశన్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే మతపరమైన కవాతులో పాల్గొననందుకు ఆయనను సర్వీసు నుంచి తొలగించడాన్ని హైకోర్టు కూడా సమర్థించింది. మన సైన్యం అన్ని మతాలు, కులాలు, ప్రాంతాల ప్రజలతో రూపొందించబడింది, దీని ఏకైక లక్ష్యం దేశాన్ని రక్షించడం మాత్రమే. సైన్యం ఐక్యత వారి యూనిఫాం ద్వారా ఏర్పడుతుంది. కమలేశన్ ప్రవర్తన సైన్యం లౌకిక సూత్రాలకు విరుద్ధంగా ఉంది. తన రెజిమెంట్‌లో గుడి, గురుద్వారా ఉన్నాయని, అయితే అన్ని మతాలకు సంబంధించిన 'సర్వ ధర్మ స్థల్' లేదని, చర్చి కూడా లేదని కమలేశన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కొన్ని రెజిమెంట్ల పేర్లు లేదా సంప్రదాయాలు ఏదైనా మతం లేదా ప్రాంతంతో ముడిపడి ఉన్నప్పటికీ ఇది సైన్యం లౌకిక స్వభావాన్ని ప్రతిబింబిస్తుందని కోర్టు పేర్కొంది. అధికారి ప్రవర్తన రెజిమెంట్ ఐక్యత, క్రమశిక్షణ, లౌకిక విలువలకు హాని కలిగిస్తుందని హైకోర్టు అంగీకరించింది. యుద్ధ పరిస్థితుల్లో సైన్యంలో ఇటువంటి ప్రవర్తన హానికరమని, కమలేశన్ తన సీనియర్ అధికారుల ఆదేశాల కంటే తన మతానికి ప్రాధాన్యత ఇచ్చాడని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.

దేవాలయంలోకి అడుగు పెట్టడం క్రైస్తవ మతంలో ఎక్కడ నిషేధించబడింది అని ప్రశ్నించింది. ఇది భారత సైన్యం, ఇక్కడ సెక్యులరిజం అగ్రస్థానంలో ఉంటుంది. ఆయన తోటి సైనికుల మనోభావాలను గౌరవించలేదు. ఆయన వంద విషయాల్లో మంచివారు కావచ్చు, కానీ ఈ తప్పు చాలా పెద్దది. క్రమశిక్షణ విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వలేము. హైకోర్టు ఆదేశాలను కొనసాగిస్తాం అని సుప్రీం నిర్ణయించింది. వ్యక్తిగత మత విశ్వాసాలు పక్కన బెట్టి సైన్యం లౌకికతకి విలువనీయడం గొప్ప విషయమే. కానీ దాని వల్ల అన్ని మతాల వారికి సమాన అవకాశాలు లభించాలి.

చివరకు సుప్రీంకోర్టు కూడా కమలేశన్ తొలగింపుపై జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. సుప్రీం కోర్టులో పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలను ధర్మాసనం ఒప్పుకోలేదు. పూజ లేదా హారతి లాంటివి తన క్లయింట్ విశ్వాసానికి విరుద్ధం. రెజిమెంట్ వెంట తను వెళ్లేవాడు, కానీ లోపలికి వెళ్లి పూజలు చేయలేదు. అక్కడ 'సర్వ ధర్మ స్థల్' లేదు. దేవాలయాలు, గురుద్వారాలు మాత్రమే ఉన్నాయి. తనను ఏదైనా పూజ చేయిస్తారేమోనని భయపడ్డాడు అని న్యాయవాది వివరించగా కోర్టు ఆ మాటలని తోసిపుచ్చింది. సైనికుల మనోభావాలను మీ క్లయింట్ గౌరవించలేదు. ఆయనను ఎలాంటి పూజలు చేయమని ఎవరూ అడగలేదు. సైనికులతో కలిసి ఉండడం ఆయన విధి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రతి సెంటిమెంట్‌ను రక్షించదు. దేవాలయంలోకి అడుగు పెట్టడం క్రైస్తవ మతంలో ఎక్కడ నిషేధించబడింది అని ప్రశ్నించింది. ఇది భారత సైన్యం, ఇక్కడ సెక్యులరిజం అగ్రస్థానంలో ఉంటుంది. ఆయన తోటి సైనికుల మనోభావాలను గౌరవించలేదు. ఆయన వంద విషయాల్లో మంచివారు కావచ్చు, కానీ ఈ తప్పు చాలా పెద్దది. క్రమశిక్షణ విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వలేము. హైకోర్టు ఆదేశాలను కొనసాగిస్తాం అని సుప్రీం నిర్ణయించింది. వ్యక్తిగత మత విశ్వాసాలు పక్కన బెట్టి సైన్యం లౌకికతకి విలువనీయడం గొప్ప విషయమే. కానీ దాని వల్ల అన్ని మతాల వారికి సమాన అవకాశాలు లభించాలి. దేవాలయ సముదాయం ఒక్క ఆవరణలో ఉంటే సైనిక క్రమశిక్షణకు తప్పే అవసరం ఎవరికీ పడదు. ఇలా ఓ మైనారిటీ వర్గానికి చెందిన అధికారి మత విశ్వాస నమ్మిక వల్ల ఉద్యోగానికే ముప్పు వాటిల్లే పరిస్థితులు రావడం విచారకరమే. అయితే ఈ కేసు కొత్తగా ఒక రాజ్యాంగపరమైన ప్రశ్నను లేవనెత్తింది అనవచ్చు. ఆర్టికల్ 25 ప్రకారం ఒక మత విశ్వాసాన్ని ప్రకటించే, ఆచరించే హక్కు సైనిక క్రమశిక్షణకు లోబడి ఉందా అనే చర్చ అవసరం.



# హక్కులకు నోచుకోని పోలీసు వ్యవస్థ


1792లో డిసెంబర్ 7వ తేదీన భారతదేశంలో పోలీసు వ్యవస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టింది.1857 తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం,17 ఆగష్టు 1860 నాడు పోలీస్ కమీషన్ ఏర్పాటు చేసింది. పోలీస్ కమీషన్ తన, నివేదికను 3 అక్టోబర్ 1860, నాడు సమర్పించింది. భారతదేశం లోని పోలీసు సంస్థల గురించిన వివరాలను సేకరించడం, పోలీసు వ్యవస్థలో కొన్ని సంస్కరణలను చేయటం, ఉన్న వాటిని అభివృద్ధి చేయటం గురించి సలహాలు ఇవ్వటము ఈ పోలీసు కమీషన్ విధులు. 22వ మార్చి, 1861న పోలీసు నియంత్రణ కోసం ఒక చట్టం అలా ఏర్పడింది. దీని ఆధారంగానే, నేటికీ అమలులో ఉన్న పోలీస్ చట్టము 1861 ఏర్పడింది. శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరక్కుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ పోలీసు వ్యవస్థ. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేము, బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు పోలీసేనన్నది నగ్నసత్యం.. అత్యవసర సర్వీసుల చట్టం ప్రకారం క్రమశిక్షణతో పనిచేస్తూ, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు వ్యవస్థలో కానిస్టేబుళ్ళు కనీసం ప్రాథమిక హక్కులకు కూడా నోచుకోవడం లేదు. బ్రిటిష్ పరిపాలన అంతమై డెబ్బది ఏడు వసంతాలు దాటినా, వారు రూపొందించిన పోలీసు వ్యవస్థలో, ఆశించిన స్థాయిలో, అధునిక సమకాలీన సమాజ పరిస్థితుల కనుగుణంగా, మౌలికమార్పులు చోటుచేసుకోకపోవడం శోచనీయం. పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ఇన్నేళ్ళుగా జరుగుతున్న రిక్రూట్మెంట్ తర్వాత కూడా, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా తక్కువే. ఉన్న పోలీసు ఉద్యోగులు, వ్యయప్రయాసల కోర్చి అదనపు పనిగంటలలో శక్తికిమించి శ్రమిస్తున్నప్పటికీ, వీరి శ్రమకు తగిన ఫలితం లభించకపోగా, పడిన కష్టానికి కనీస గుర్తింపునకు సైతం నోచుకోవడం లేదు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులవలె, పోలీసు సిబ్బందికి కనీస సెలవులు, పండగ సెలవులు కూడా వర్తింపక పోవడాన్ని బట్టి వారి ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఈ శాఖ సిబ్బందికి కేవలం 15 క్యాజువల్ లీవులు, 15 ప్రత్యేక అనుమతి సెలవులు మాత్రమే ఉంటాయి. అయితే పై అధికారి దయాదాక్షిణ్యాలపై ఈ సెలవులను వాడుకునే అవకాశాలుంటాయి. పోలీసు శాఖ సామర్థ్యం, పనితీరు ఆ శాఖలోని క్రింది స్థాయి ఉద్యోగులైన కానిస్టేబుల్లు మరియు హెడ్ కానిస్టేబుల్స్ పైననే ఆధార పడి ఉంటుందనేది నగ్నసత్యం. విధి నిర్వహణలో, ప్రత్యక్షంగా ప్రజలకు అందుబాటులో ఉండేది వారు. ప్రజల నుండి ఎదురయ్యే ప్రతి ఘటనలు, ఛీత్కారాలు, విమర్శలు, ప్రమాదాలూ అనుభవించాల్సిందే వీరే. ఎప్పుడు ఏ విధి నిర్వహణ చేయాలో, తెలియని స్థితిలో, ఎక్కడికి వెళ్ళాలో, కనీసం కట్టుకున్న ఇల్లాలు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా వెళ్ళాల్సిన దుస్థితులు అను క్షణం ఎదురవుతూనే ఉంటాయి. ఎనిమిది గంటల పనిదినాలు ఈ శాఖ ఉద్యోగులకు ఏనాడు వర్తించవు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, రౌడీలు, గూండాలు, దొంగలు, సాయుధులైన అజ్ఞాతులతో ప్రాణాలకు తెగించి తలపడడం, రాత్రివేళల్లో ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో వీరు కర్తవ్య నిర్వహణలో భాగంగా మేల్కొని ఉండడం, గాలింపు చర్యల పేరిట అంధకారంలో, కీకారణ్యంలో, చెట్టూ, పుట్టా పట్టుకు తిరగడం అనూహ్య ప్రమాదాలకు గురికావడం పోలీసులకు నిత్య కృత్యమే అవుతున్నది. తమ ప్రాంతానికి ప్రముఖులెవరైనా వస్తే, మారుమూల గ్రామాలకు వారు వెళితే, బందోబస్తులో భాగంగా, గంటల కొద్దీ, ఒకోసారి రోజుల ముందే ఆ ప్రాంతానికి వెళ్ళి, వి.ఐ.పి.లు వచ్చి వెళ్ళే వరకూ, రాత్రి, పగలూ తేడా లేకుండా పడిగాపులు గాస్తూ, శ్రమకోర్చి, ఎండా, వానా, చలికి వెరవక ధర్మ నిష్ఠతో , కార్యదీక్షతో పనిచేసినా, అప్పుడప్పుడూ ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురి కాక తప్పని పరిస్థితులు ఎదురవడం బాధాకరం. ఇవన్నింటికి తోడు అధికారుల కనుసన్నలలో మెదులుతూ, వారికి అనుకూలంగా నడుచుకుంటూ స్వంత పనులు గాలికొదిలి, అధికారుల పనులను చేయక తప్పని దుస్థితులు వారికి చర్విత చర్వణాలే అవుతున్నాయి. ఇన్ని ఇబ్బందులను, సవాళ్ళను ఎదుర్కొని, చిత్తశుద్ధితో, కార్యదీక్షా దక్షతతో, అంకితభావంతో విధులను నిర్వర్తించినా, ప్రశంసలూ, అవార్డులు, పురస్కారాలూ, బహుమానాలూ, ఎక్కువగా అధికారులకే దక్కుతాయనేది నిర్వివాదాంశం. పోలీసు కానిస్టేబులుకు కచ్చితమైన పని గంటలుండాలని, ఎనిమిది గంటలకు మించి పని చేయిస్తే, ఆ శ్రమకు ప్రతిఫలం అందించాలని గతంలో ''ధర్మవీర కమిషన్'' సూచించారు. అది ఏనాడు అమలుకు నోచుకోక పోవడం విచారకరం. పోలీసు వ్యవస్థలో మార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కమిషన్లను వేసినా, వాటి సూచనల అమలులో, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయం. ''సమాజ రక్షణే ప్రథమ కర్తవ్యంగా, చట్ట పరిరక్షణే ధ్యేయంగా'', ప్రజా రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు ''స్వీయ రక్షణే'' నేటి పరిస్థితుల్లో కరువు కాగా, త్యాగశీలులైన రక్షక భటులు తీవ్రవాదులకు టార్గెట్లుగా మారుతూ, అనుక్షణం ప్రమాదం అంచున పయనిస్తూ, విధినిర్వహణలో మమేకమవుతున్నారు. గత తెలంగాణ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కొంత కృషి చేసింది. తాజా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శాంతి భద్రతల నిర్వహణ కోసం 350 కోట్ల రూపాయల నిధులను కేటాయించగా, పోలీసు స్టేషన్లకు పెద్ద మొత్తంలో కొత్త వాహనాలను సమకూర్చిన ఘనత కూడా టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్రంలో ప్రతి పోలీసు స్టేషన్‌కు అధునాతన సౌకర్యాలతో కూడిన వాహనాలు ఉండాలనే ఉద్దేశ్యంతోనే మొత్తం 600 టాటా సుమోలు, 1600 ఇన్నోవాకార్లు, 1500 మోటారు సైకిల్ కొనుగోలుతోపాటు, ప్రతి నెల పోలీస్ స్టేషన్ నిర్వహణకు, కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషను 75 వేలు, జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషను 50 వేలు, పట్టణ మండల పోలీసు స్టేషన్లకు 25 వేల చొప్పున నిధులను సమకూర్చి పోలీసు వ్యవస్థను పటిష్టం పరిచారు. ఇటీవల 'హోంగార్డు'లకు జీతభత్యాలను కూడా పెంచింది. పోలీసులకు, వారాంతరపు సెలవులను ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆచరణపై దృష్టి సారించ లేక పోయింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే పోలీస్ రిక్రూట్మెంట్ చేపట్టింది. ప్రధానంగా 'మీ వెంటే మేమున్నాం' అంటూ వారికి అన్ని విధాలా అభయహస్తం అందిస్తూ, ''మీ సంక్షేమమే మాకు ముఖ్యం'' అనే భరోసా కలిగిస్తూ, పోలీసుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొనేలా నూతన రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.



– రామ కిష్టయ్య సంగన భట్ల,
+919440595494

# ఆర్థికాభివృద్ధిలో విమానయాన రంగం పాత్ర

ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న ప్రపంచ దేశాలన్నీ అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం జరుపుకుంటాయి. ఈ రోజున ప్రపంచ దేశాల్లో పౌర విమానయాన రంగం, విమాన రవాణా, ప్రపంచ అభివృద్ధిలో విమానరంగం పాత్ర వంటి అంశాలపై అవగాహనా కార్యక్రమాలు జరుపుతారు. ఐతే... చాలా మందికి ఇలాంటి రోజు ఒకటి ఉంటుందని తెలియదు. ముఖ్యంగా భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో పౌర విమానయాన దినంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అంతంత మాత్రమే. విద్యార్థులు, ప్రజలకు ఈ రోజుకు చరిత్రలో ఉన్న ప్రాధాన్యం ఎందుకే తెలిసే అవకాశం ఉండడం లేదు. అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవాన్ని ఏటా డిసెంబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, ఆర్థికాభివృద్ధి కొరకు పౌర విమాన యానం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేయాలనే లక్ష్యంతో జరుపుకుంటారు. వాయు రవాణా భద్రత, సమర్థతను ప్రోత్సహించడానికి, వాయు రవాణాలో అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ యొక్క పాత్రగురించి అవగాహన కల్పించడానికి అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం జరుపుకుంటారు. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసిఏఓ) ఇంటర్నేషనల్ ఫర్ ఏవియేషన్ సేఫ్టీ ప్రమాణాలను అభివృద్ధి చేసే బాధ్యత ఐక్యరాజ్య సమితిపై ఉంది. పౌర విమానయానంలో అంతర్జాతీయ సహకారం, ఏకరూప తను సాధించడానికి అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ 1947 ఏప్రిల్ 4 న ఏర్పాటైంది. దీని ప్రధాన కార్యాలయం కెనడా లో ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ కన్నా ముందు ఇంటర్నేషనల్ కమిషన్ ఫర్ ఎయిర్ నావిగేషన్ (%×చీ%) ఉండేది. దీని మొదటి సదస్సు 1903లో జర్మని దేశ రాజదాని బెర్లిన్లో జరిగింది. ఆ సమావేశానికి కేవలం 8 దేశాలు మాత్రమే హాజరయ్యాయి. హాజరైన ఎనిమిది దేశాలలో ఎటువంటి ఒప్పందాలు కుదర లేదు. 1906లో బెర్లిన్‌లో జరిగిన రెండవ సదస్సులో 27 దేశాలు హాజరయ్యాయి. 1912లో లండన్‌లో జరిగిన మూడవ సదస్సులో విమానాల ఉపయోగం కోసం మొదటి రేడియో కాల్ సైన్ లను కేటాయించింది. 1944 డిసెంబర్ 7 న చికాగోలో జరిగిన సదస్సులో అంతర్జాతీయ పౌర విమానయాన ఒప్పందం కుదిరి, చికాగో సదస్సు ఒప్పందంపై 52 దేశాలు సంతకం చేశాయి.26వ దేశం 1947 మార్చి 5 న సదస్సును ఆమోదించింది. దీని ఫలితంగా పిఐసిఎఓ స్థానంలో 1947 ఏప్రిల్ 4 న ఐసిఎఓ శాశ్వత సంస్థగా స్థాపించబడింది. 26 దేశాలు ఈ సమావేశాన్ని ఆమోదించి నప్పుడు శాశ్వత సంస్థ ఏర్పడుతుందనే ఒప్పందం ప్రకారం 1945 జూన్ 6న ఐసిఎఓ స్థానంలో పిఐసిఎఓ పని చేయడం ప్రారంభించింది. 1994లో తొలి సారిగా అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం జరిపారు. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ, 50వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. వైమానిక భద్రత విషయంలో ఐసిఎఓ నాయకత్వ పాత్ర పోషిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా వైమానిక భద్రతను పెంపొందించడం ఈ సంస్థ పూర్తి స్థాయి లక్ష్యం. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ప్రపంచ వాతావరణ సంస్థ, ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్స్ యూనియన్, యూనివర్సల్ పోస్టల్ యూనియన్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మరియు ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ తో సహా ఇతర యుఎన్ సభ్యులతో కలిసి పని చేస్తుంది. 2020నుండి 2023 వరకు: ప్రపంచ పౌర విమానయాన రంగ అభివృద్ధికి సరికొత్త కల్పనను జోడించడం ప్రధాన థీమ్ గా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ దేశాలన్నీ విమాన రంగం, విమాన రవాణా వల్ల కలుగుతున్న సేవల్ని గుర్తుచేసుకుంటూ, విమానరంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను తీర్మానించుకుంటాయి. విమానయాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానంగా మొదటి విమానం ఎగిరినప్పటినుంచి విమాన రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులపై విద్యార్థులకు అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టాలి. విద్యా ర్థులకు వైమానిక రంగంపై ఆసక్తిని కలిగించాలి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరుట, విమాన పైలెట్, ఎయిర్ హోస్టెస్ కావడం, క్యాబిన్ క్రూ, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీర్స్, ఏరోనాటికల్ ఇంజినీర్స్ వంటి అనేకరకాల ఉద్యోగాలను పొందే అవకాశాల వంటి ఆలోచనలు పెంపొందించే, అవగాహన విద్యార్థులకు కలిగించాలి.



– రామ కిష్టయ్య సంగన భట్ల,
+919440595494

# మస్క్ ‘ఎక్స్’పై భారీ జరిమానా విధించిన ఇయు




ఎలన్ మస్క్‌కి చెందిన సోషల్ మీడియా ‘ఎక్స్’పై యూరోపియన్ యూనియన్ (ఇయు) నియంత్రణ సంస్థ భారీ జరిమానా విధించింది. సోషల్ మీడియా చట్టాన్ని ఉల్లంఘించినందున 120 మిలియన్ యూరోలు(సుమారు 12వేలకోట్లకు పైగా) జరిమానా విధించినట్లు ఇయు శుక్రవారం తెలిపింది. 27 దేశాల కూటమికి చెందిన డిజిటల్ సర్వీసెస్ చట్టం ప్రకారం రెండేళ్ల క్రితం దర్యాప్తు ప్రారంభించిన యూరోపియన కమిషన్ నేడు తన తీర్పు వెల్లడించింది. డిఎస్ఎ చట్టంను అనుసరించి ఎక్స్ మూడు వేర్వేరు ఉల్లంఘనలకు పాల్పడినందున జరిమానా విధించినట్లు యూరోపియన్ కమిషన్ తెలిపింది.డిజిటల్ సర్వీస్ యాక్ట్ (డిఎస్ఎ) ప్రకారం.. యూరోపియన్ విని యోగదారులకు భద్రత కల్పించడం, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లకు భారీ జరిమానా విధిస్తామనే బెదిరింపులతో సహా వినియోగదారుల ప్లాట్‌ఫామ్‌లలో హానికర మైన లేదా చట్టవిరుద్ధమైన కంటెంట్, వాటి ఉత్పత్తులను తొలగించేందుకు బాధ్యత వహిస్తుంది. ఎక్స్ నీలిరంగు చెక్ మార్కులు వాటి మోసపూరిత డిజైన్ నిబంధనలను ఉల్లంఘించాయని, ఇది విని యోగదారులను మోసగిస్తోందని, తారుమారు చేస్తుందని ఇయు తెలిపింది. ఎక్స్ ప్రకటన డేటా బేస్ అవసరాలను కూడా తీర్చలేకపో యిందని, పరిశోధకుల పబ్లిక్ డేటాను యాక్సెస్ చేసేందుకు వీలు కల్పించిందని ప్రకటించింది.

# హార్వర్డ్ ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేసిన అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు


హార్వర్డ్ లా స్కూల్ విజిటింగ్ ప్రొఫెసర్ కార్లోస్ పోర్చుగల్ గౌవేయాను అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేసినట్లు యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ గురువారం తెలిపింది. మసాచుసెట్స్‌లోని యూదుల ప్రార్థనా మందిరం వెలుపల పెల్లెట్ తుపాకీని వినియోగించినట్లు ఆయన నేరాన్ని అంగీకరించిన అనంతరం ఈ అరెస్ట్ జరిగినట్లు వెల్లడించింది. బ్రెజిలియన్‌కి చెందిన కార్లోస్ పోర్చుగల్ గౌవేయాను బుధవారం అమెరికా ఇమ్మిగ్రేషన్ మరియు కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అరెస్ట్ చేసినట్లు యుఎస్ ఇమ్మిగ్రే షన్ అధికారులు తెలిపారు. ఆయన తాత్కాలిక నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాను అమెరికా విదేశాంగ రద్దు చేసినట్లు వెల్లడించారు. సావోపాలో యూనివర్శిటీ న్యాయ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచే స్తున్న గౌవేయా, హార్వర్డ్‌లో సెమిస్టర్ బోధన కోసం నియమితులయ్యా రని, ఆయన దేశం విడిచి వెళ్లేందుకు అంగీకరించారని హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. యూదుల సెలవుదినం యోమ్ కిప్పుర్ సందర్భంగా బెత్ జియాన్ సమీపంలో ఒక వ్యక్తి తుపాకీతో తిరుగుతున్నట్లు సమాచారం వచ్చిందని, అక్టోబర్1న గౌవేయాను అరెస్ట్ చేసినట్లు మసాచుసెట్స్‌లోని బ్రూక్‌లైన్‌లోని పోలీసులు తెలిపారు. అయితే ఆసమయంలో గౌవేయా నేరాన్ని అంగీకరించేం దుకు నిరాకరించడంతో ఆయనపై పలు అభియోగాలు నమోదయ్యా యని అన్నారు. పెల్లెట్ గన్‌ను చట్టవిరుద్ధంగా ప్రయోగించిన నేరాన్ని అంగీకరిస్తున్నట్లు గత నెల ఆయన పోలీసులకు తెలిపారు. ఆరు నెలల ముందస్తు విచారణకు కూడా ఆమోదం తెలిపారు. దీంతో ఒప్పందంలో భాగంగా ఆయనపై గతంలో నమోదు చేసిన అభియో గాలను కొట్టివేసినట్లు పోలీసులు తెలిపారు.

# నటుడు విజయ్‌తో కాంగ్రెస్ నేత ప్రవీణ్ చక్రవర్తి రహస్య భేటీ



చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసు కుంది. అధికార డీఎంకేతో పొత్తు చర్చలు జరుపుతున్న కాంగ్రెస్ పార్టీ, మరోవైపు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం పార్టీతో మంతనాలు జరపడం కలకలం రేపుతోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన ప్రవీణ్ చక్రవర్తి.. శుక్రవారం చెన్నైలో విజయ్‌తో రహస్యంగా భేటీ అయ్యారు. డీఎంకేతో సీట్ల పంపకంపై కాంగ్రెస్ కమిటీ చర్చలు జరిపిన 48 గంటల్లోనే ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం తమకు 40 స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే, 20 నుంచి 25 సీట్లకు మించి ఇచ్చేందుకు డీఎంకే అధినేత, సీఎం ఎంకే స్టాలిన్ సుముఖంగా లేరని సమాచారం. ఈ నేపథ్యంలో డీఎంకేపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ ఈ భేటీని తెరపైకి తెచ్చిందనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి.చెన్నైలోని టీవీకే కార్యాల యంలో విజయ్, ప్రవీణ్ చక్రవర్తి మధ్య గంటకు పైగా ఈ సమావేశం జరిగింది. అయితే, ఈ భేటీ గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని తమిళనాడు కాంగ్రెస్ నేతలు చెప్పడం గమనార్హం. పార్టీ అధిష్ఠానం అనుమతి లేకుండా ప్రవీణ్ ఈ సమావేశం నిర్వహించా రని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామం మిత్రపక్షమైన డీఎంకేలోనూ అసంతృప్తికి కారణ మైంది. ఒకవేళ డీఎంకేతో సీట్ల సర్దుబాటు కుదరకపోతే, విజయ్‌తో కలిసి కొత్త కూటమి ఏర్పాటు చేసే అవకాశాలను కూడా కాంగ్రెస్ పరి శీలిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# నితీశ్‌కు అభినందన లేఖ పంపిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ



పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి, జనతాదళ్ అధినేత నితీశ్ కుమార్ అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో, ఆయన పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి, తమ జాబితాలో చేర్చింది. ఈ మేరకు సదరు సంస్థ నితీశ్ కుమార్‌కు ప్రత్యేకంగా అభి నందన లేఖను పంపింది.ఒకే వ్యక్తి ఒక రాష్ట్రాన్ని పదిసార్లు పాలించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అరుదైన ఘనత అని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తన లేఖలో పేర్కొంది. “1947 నుంచి 2025 మధ్య కాలంలో పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తొలి వ్యక్తిగా నిలవడం భారతదేశానికి గర్వకారణం. ఇది మీ అంకితభావానికి, దార్శనిక నాయకత్వానికి నిదర్శనం. బీహార్ ప్రజలు మీపై ఉంచిన విశ్వాసానికి ఈ అసాధారణ విజయం తార్కాణం’’ అని ప్రశంసించింది.సుపరిపా లన, అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం నితీశ్ కుమార్ చేస్తున్న కృషి ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఆ సంస్థ కొనియాడింది. ఆయన నాయకత్వ పటిమ వల్లే పదేపదే ప్రజల మన్ననలు పొందుతు న్నారని వివరించింది. ఈ అరుదైన గౌరవం దక్కడంతో నితీశ్ కుమార్‌కు పలువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# అటువంటి వ్యాఖ్యలు తగవు!



న్యూఢిల్లీ : రోహింగ్యాల గురించి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయ నిపుణులు చీఫ్ జస్టిస్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. రోహింగ్యా శర ణార్థులు కొంతమంది భారత్‌లో పోలీసుల కస్టడీలో వుండగా అదృశ్య మవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన హక్కుల కార్యకర్త రీటా మన్‌చందా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సిజెఐ వ్యాఖ్యలు చేశారు. రోహింగ్యా శరణార్థుల హోదాను జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ‘దేశంలోకి చట్ట విరుద్ధంగా చొరబడిన వారికి రెడ్ కార్పెట్ పరవాలా?’ అంటూ వ్యాఖ్యలు చేశారు. ''హింస, వేధింపులను భరించలేక పారిపోతున్న వారిపై వారి గౌరవానికి విరు ద్ధమైన రీతిలో వ్యాఖ్యలు చేయడం మన రాజ్యాంగ ప్రాథమిక విలువ లకు ముప్పుగా పరిణమిస్తాయి. పైగా ఆశ్రయం కోరుతూ న్యాయస్థా నాలను ఆశ్రయించడం పట్ల ప్రజలకు గల నమ్మకం కూడా దెబ్బతిం టుంది.'' అని ఆ లేఖలో న్యాయ నిపుణులు పేర్కొన్నారు. న్యాయస్థా నాల్లో, జ్యుడీషియల్ తీర్పుల్లో వ్యాఖ్యలు చేసేటప్పుడు, అలాగే బహిరం గంగా ప్రకటనలు చేసేటప్పుడు మూలాలతో నిమిత్తం లేకుండా అందరి పట్ల న్యాయం, గౌరవం ప్రాతిపదికకు, రాజ్యాంగ నైతికతకు కట్టుబడాలని ఆ లేఖలో వారు పునరుద్ఘాటించారు. ‘మీరెన్ని తీర్పులు ఇచ్చారు, లేదా పాలనాపరమైన చర్యలేం తీసుకున్నారనే దానిపై సుప్రీంకోర్టు, మీ కార్యాలయం ఘనత, గౌరవం ఆధారపడదు, మీరెంత మానవీయతతో తీర్పులు ఇచ్చారనేదే పరిగణనలోకి వస్తుంది.’ అని జస్టిస్ సూర్యకాంత్‌ను ఉద్దేశిస్తూ ఆ లేఖ పేర్కొంది. పేదలు, సమాజంలో వెనుకబడినవారు, అణచివేతకు గురయ్యేవారి హక్కుల సంరక్షకదారుగా సుప్రీంకోర్టు వ్యవహరించాలని ఆ లేఖ నొక్కిచె ప్పింది. ''మీ మాటలు న్యాయస్థానంలోనే కాదు, దేశ ప్రజల మనస్సా క్షిలోనూ ప్రభావం చూపుతాయి. హైకోర్టులు, దిగువ న్యాయస్థానాలు, ఇతర ప్రభుత్వ అధికార యంత్రాంగంపైనా ప్రభావం చూపుతాయని పేర్కొంది. రోహింగ్యాలు భారతదేశంలో నివసించే మరే ఇతర వ్యక్తిలానే 21వ అధికరణ కింద అన్ని రక్షణలకూ అర్హులు. ఈ ప్రాథమిక హక్కు దేశ పౌరుడికే కాదు, ఈ దేశంలో నివసించే ఎవరి కైనా అందుబాటులో వుంటుందని ఆ లేఖ పేర్కొంది. దేశభద్రతా ప్రయోజనాలను, పౌరుల ఆందోళనలను గమనంలోకి తీసుకుంటూనే వివిధ ప్రాంతాలకు చెందిన శరణార్థులకు ఆశ్రయం ఇవ్వడం, వారికి మానవతాపరమైన రక్షణ కల్పించిన రికార్డు భారతదేశానికి వుందని ఆ లేఖ గుర్తు చేసింది. టిబెటన్లు, శ్రీలంక జాతీయులకు ప్రత్యేక పత్రాలు జారీచేసిన ప్రభుత్వం వారిని శరణార్థులుగా గుర్తించిందని, వారికి మౌలిక సామాజిక, ఆర్థిక హక్కులు కూడా కల్పించిందని గుర్తు చేశారు.

# టేకాఫ్ వుతుండగా ఎయిర్‌బస్

## ఏ320లో ఒక్కసారిగా మంటలు


టేకాఫ్‌కి రెడీ అవుతుండగా లాటమ్ సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఏ320లో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన బ్రెజిల్‌లోని గ్వాయ్ ల్హోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. లాటమ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం 180 మంది ప్రయాణికు లతో టేకాఫ్ అయ్యేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. ప్రయాణికులను కిందకు దించేశారు. ఈ క్రమంలో విమానం నుంచి పెద్దఎత్తున మంటలు, పొగ వెలువడ్డాయి. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఎయిర్‌పోర్టు అధికారులు ధ్రువీక రించారు. ఈ ఘటనపై లాటమ్ విమాన యాన సంస్థ స్పందించింది. విమానంలో ఎలాంటి మంటలు చెలరేగలేదని.. లగేజీ ఎక్కించే లోడర్‌లో అగ్ని ప్రమాదం జరిగిం దని తెలిపింది. సిబ్బంది అప్రమత్తమై.. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించేశారని వెల్లడించింది.

# కరేబియన్ తీరంలో అమెరికా దాడి

వెనిజులా లక్ష్యంగా అమెరికా కరేబి యన్ సముద్రతీర ప్రాంతంలో దాడులను కొనసాగిస్తుంది.. మాదకద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్నదన్న నెపంతో ఒక పడవపై అమెరికా వైమానికి దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మృతి చెందారని పెంటగాన్ వెల్లడించింది.. ఉగ్రవాదసంస్థ అంతర్జాతీయ జలాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్న పడవపై దాడి చేశామని యూఎస్ రక్షణ శాఖ కార్యదర్శి పీట్ హెగ్సేట్ ఎక్స్‌లో తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెనిజులా గగనతలాన్ని మూసేసిన అనంతరం ఈ దాడి జరగటం గమనార్హం. ట్రంప్ ప్రభుత్వంపై వెనిజులాపై దాడుల నేపథ్యంలో అమెరికన్లు తీవ్రంగా విమర్శిస్తు న్నారు. రక్షణశాఖ ఆదేశాల మేరకే ఈ దాడులు జరిగాయని యూఎస్ సదరన్ కమాండ్ ధృవీకరించింది. కాగా యూఎస్ జరుపుతున్న వరుస దాడులపై అంతర్జా తీయ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్త మవుతున్నా అమెరికా ఖాతరు చేయడం లేదు. ఇటీవల మదురోతో ఫోన్‌లో మాట్లా డానని స్వయంగా ట్రంప్ వెల్లడించారు. అయితే ఏం మాట్లాడానో చెప్పనని మీడియా ఎదుట వాపోయారు. అనంతరం వెనిజులా తీరాలకు సమీపంలో అమెరికా భారీ సైనిక వనరులను మోహరించటం వేగవంతం చేసింది. త్వరలో మిలిటరీ దాడులు జరిగే అవకాశం ఉన్నదని పలువురు హెచ్చరిస్తు న్నారు. అయితే వెనిజులా మాత్రం అమెరికా చర్యలను ఖండించింది. ధీటుగా సమాధాన మిస్తున్నది. అమెరికా చర్యలు తమ ప్రభు త్వాన్ని కూల్చివేయడానికి చేస్తున్న ప్రయత్నా లను సాగనీయమని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు.

# ప్రధాని మోదీతో తనది సన్నిహిత

## వ్యక్తిగత సంబంధం అని వెల్లడి



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల భారత పర్యటన ఫలవం తంగా ముగిసింది. శుక్రవారం సాయంత్రం ఢిల్లీ నుంచి తిరుగుపయనం అయ్యే ముం దు, తాను బస చేసిన హోటల్‌లోని సిబ్బంది తో ఆయన ఫోటో దిగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ అరుదైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. హోటల్ సిబ్బంది అభ్యర్థనను మన్నించి, వారితో కలిసి పుతిన్ గ్రూప్ ఫోటోకు నవ్వుతూ ఫోజులివ్వడం విశేషం. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను రష్యాకు చెందిన ఓ జర్నలిస్ట్ తన టెలిగ్రామ్ ఛానల్‌లో పోస్ట్ చేయగా, దీనిపై రష్యా అధి కారిక వార్తా సంస్థ ‘టాస్’ ఒక కథనాన్ని ప్రచురించింది. ఫోటో సెషన్ ముగిసిన తర్వాత సిబ్బంది కృతజ్ఞతలు తెలుపగా, పుతిన్ వారికి చిరునవ్వుతో వీడ్కోలు పలి కారు. అనంతరం సిబ్బంది తాము దిగిన ఫోటోలను కెమెరాల్లో ఎంతో ఆసక్తిగా చూసుకున్నారు. పర్యటనలో భాగంగా పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీతో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. హైదరా బాద్ హౌస్‌లో జరిగిన 23వ భారత్–రష్యా వార్షిక సదస్సులో ఇరు దేశాల మధ్య ద్వైపా క్షిక సంబంధాలపై లోతుగా చర్చించారు. చర్చల అనంతరం పుతిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో తనకు అత్యంత సన్నిహిత మైన, వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని తెలిపారు.''భారత ప్రతినిధులతో జరిపిన చర్చలు చాలా ఫలవంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయి. అంతకు ముందు రోజు రాత్రి ప్రధాని మోదీ తన నివాసంలో ఇచ్చిన విందులో ఏకాంతంగా సమావేశమయ్యాం. ఆ ఆత్మీయతకు నేను మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నాను. మా చర్చలు భారత్–రష్యా మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించాయి'' అని పుతిన్ వ్యాఖ్యానిం చారు.ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఎస్ సీవో సదస్సులో కూడా మోదీతో సమావేశ మయ్యామని, తాము తరచుగా ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉంటామని పుతిన్ తెలిపారు.

# యూరోవిజన్ పోటీని బహిష్కరిస్తున్నాం

వచ్చే ఏడాది జరగబోయే యూరోవిజన్ పాటల పోటీని ఐర్లాండ్, నెదర్లాండ్స్, స్లోవేనియా, స్పెయిన్ దేశాలు బహిష్కరించాయి. ఈ పోటీలో ఇజ్రాయిల్‌ను చేర్చటంపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇజ్రాయిల్‌ను పోటీ నుంచి తొలగించాలని చేసిన అభ్యర్థనలను తిరస్క రించిన యూరోపియన్ బ్రాడ్‌కాస్టింగ్ యూనియన్ (ఈబీయూ) నిర్ణయంతో అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఈ మేరకు పాటల పోటీని బారుకాట్ చేస్తున్నట్టు ఆ నాలుగు దేశాలు ప్రకటించాయి. ఈ నాలుగు దేశాలు ఇజ్రాయిల్ గాజాలో జరుపుతున్న నరమేధ యుద్ధం, భారీ ప్రాణ నష్టం, మానవతా సంక్షోభం వంటి కారణాలను చూపిస్తూ పోటీకి దూరంగా ఉంటామని తెలిపాయి. కాగా ఈబీయూ నిర్ణయాన్ని ఇజ్రాయిల్ అధ్యక్షులు ఇసాక్ హెర్జోగ్ స్వాగతించారు. యూరోవిజన్ 2026 పోటీ వచ్చే ఏడాది ఆస్ట్రియాలోని వియన్నాలో జరగనున్నది. గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తోన్న యుద్ధంపై అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. 2023 అక్టోబర్ నుంచి ఇజ్రాయిల్ ఈ దాడులను జరుపుతోంది.

అమాయకపు పాలస్తీనా పౌరుల ప్రాణాలను బలిగొంటున్నది. ఈ ఏడాది అక్టోబర్‌లో కాల్పుల విరమణ ఒప్పందం జరిగినప్పటికీ.. ఇజ్రాయిల్ దానిని విస్మరిస్తున్నది. గాజాపై కాల్పులకు తెగబడుతుంది. ఇలాంటి తరుణంలోనే యూరోవిజన్ పోటీ నుంచి నాలుగు దేశాలు తప్పుకోవడం చర్చకు దారి తీసింది.

# అఫ్ఘాన్–పాక్ సరిహద్దుల్లో మళ్లీ ఉద్రిక్తతలు.. కాల్పులతో ఘర్షణలు తీవ్రమవుతున్నాయి



పాకిస్తాన్ మరియు అఫ్ఘానిస్తాన్ మధ్య సరిహద్దు ప్రాంతాల్లో ఇటీవల మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి. రెండు దేశాల మధ్య సీమా వివాదాలు ఎప్పటికీ ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఇటువంటి ఘటనలు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పుగా మారుతున్నాయి. ఈ ఉద్రి క్తతలు రెండు దేశాల మధ్య ఉండే భౌగోళిక, రాజకీయ సంబంధాల నేపథ్యంలో మరింత తీవ్రత కలిగించుతున్నాయి. ప్రజల జీవితాలు మరియు ఆర్థిక కార్యకలాపాలు ఈ ఘర్షణల వల్ల గణనీయంగా ప్రభా వితమవుతున్నాయి. ఇటువంటి సంఘటనలు ప్రపంచ దృష్టిని ఈ ప్రాంతంపై మళ్లీ ఆకర్షిస్తున్నాయి. నిన్న రాత్రి స్పిన్ బోల్డక్ జిల్లాలో పాకిస్తాన్ దళాలు అఫ్ఘానిస్తాన్ సైన్యంపై దాడులు చేశాయని అఫ్ఘాన్ అధికారులు ఆరోపించారు. ఈ దాడుల వల్ల స్థానికులు భయభ్రాంతులతో ఇళ్ల నుంచి బయటకు పరిగెత్తారు. అఫ్ఘాన్ సైన్యం తమ రక్షణ కోసం తగిన చర్యలు తీసుకుందని, ఈ ఘటనలో కొంతమంది గాయపడ్డారని అధికారికవర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ వైపు చమన్ సరిహద్దులో అఫ్ఘాన్ దళాలు ముందుగా కాల్పులు జరిపాయని మరో వైపు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ పరస్పర ఆరోపణలు రెండు దేశాల మధ్య విశ్వాస లోపాన్ని మరింత లోతుగా చేస్తున్నాయి. ఈ ఘటనలు రెండు దేశాల మధ్య ఇటీవల జరిగిన శాంతి చర్చలు ఫలవంతం కాకపోవడం వల్లే జరిగాయని నిపుణులు అభిప్రా యపడుతున్నారు. శాంతి చర్చలు పురోగతి లేకుండా ముగిసిన నేపథ్యంలో, సరిహద్దు దాడులు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ చర్చల్లో సరిహద్దు రక్షణ, వలసలు, మరియు ఉగ్రవాద వ్యవహారాలు ముఖ్య అంశాలుగా చర్చించబడ్డాయి. అయితే, రెండు వైపులా వాటికి ఏకాభిప్రాయం ఏర్పడలేదు. ఇటువంటి చర్చల అవసరం మరింత పెరిగిన ఈ సమయంలో, అంతర్జాతీయ మధ్యవర్తిత్వం అవసరమవు తోందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

# పుతిన్ భారత సందర్శన.. చైనా మీడియా ద్వారా ప్రపంచవ్యాప్త సందేశం



భారతదేశానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల చేసిన అధికారిక పర్యటన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య జరిగిన చర్చలు, ఒప్పందాలు భారత–రష్యా సంబంధాల బలాన్ని మరింత పటిష్ఠం చేశాయి. చైనా మీడియా ఈ సంఘటనను పాజిటివ్‌గా చూస్తూ, అంతర్జాతీయ రాజకీ యాల్లో దాని ప్రాముఖ్యతను హైలైట్ చేసింది. ముఖ్యంగా, గ్లోబల్ టైమ్స్ వంటి ప్రముఖ వార్తాపత్రికలు ఈ పర్యటనను ఒక ముఖ్యమైన డెవలప్‌మెంట్‌గా వర్ణించాయి. ఈ సందర్భంలో, ప్రపంచ శక్తుల మధ్య ఏర్పడుతున్న కొత్త సమీకరణాలు గురించి విశ్లేష ణలు కూడా జోరుగా సాగుతున్నాయి. చైనా మీడియా ప్రకారం, పుతిన్ పర్యటన భారత్–రష్యా మధ్య ఉన్న దృఢమైన బంధాలకు ఒక స్పష్టమైన సంకేతం. గ్లోబల్ టైమ్స్ ఎడిటోరియల్‌లో, ఈ రెండు దేశాలు ప్రపంచంలో ఒంటరిగా లేవని, ఇతర దేశాలతో కలిసి ముందుకు సాగు తున్నాయని స్పష్టం చేసింది. ఈ పర్యటన ద్వారా పంపబ డిన సందేశం అంతర్జాతీయ సమాజానికి ఒక బలమైన మెసేజ్‌గా పరిగణించబడుతోంది. మరోవైపు, ఈ సంఘటన ఆధారంగా, ఆసియా మహాదేశంలో ఏర్పడు తున్న జియోపొలిటికల్ డైనమిక్స్ గురించి చర్చలు జరు గుతున్నాయి. చైనా వర్గాలు ఈ సంబంధాన్ని తమ విదేశాంగ విధానంలో కూడా ఒక ముఖ్య అంశంగా చూస్తున్నట్లు తెలుస్తోంది. భారత్ మరియు రష్యా ఈ పర్యటన ద్వారా తమ స్వయం సమృద్ధి మార్గాలను మరింత బలోపేతం చేసుకోవాలనే నిర్ణయాన్ని తీసుకు న్నట్లు కనిపిస్తోంది. రెండు దేశాల మధ్య జరిగిన సమన్వయం మరియు సహకారం ఈ దిశగా ఒక మంచి నిదర్శనంగా నిలిచాయి. ఆర్థిక, సైనిక, సాంకేతిక క్షేత్రాల్లో కొత్త ఒప్పందాలు రూపొందడం ద్వారా, ఈ రెండు దేశాలు పరస్పరం ఆధారపడకుండా ముందుకు సాగాలని కోరుకుంటున్నాయి. ఈ సహకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొత్త అవకాశాలను సృష్టిస్తుందని నిపుణులు అభిప్రా యపడుతున్నారు. అంతేకాకుండా, ఈ మార్గం ద్వారా రెండు దేశాలు తమ జాతీయ లక్ష్యాలను సాధించడంలో మరింత ఆత్మవిశ్వాసం పొందుతాయని విశ్లేషకులు చెబుతున్నారు.





## 13న అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్


**కర్నూలు డిసెంబర్ 6వుదయం న్యూస్ ప్రతినిధి :**జిల్లా స్థాయిలో స్థానిక జిల్లా కోర్టు హాల్ నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి/జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, ఇన్సూరెన్స్ న్యాయవాదులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ కర్నూలు డిపో మేనేజర్స్, బ్యాంక్, ఇన్సూరెన్స్, చిట్ ఫండ్, భూసేకరణ ఇతర సంబంధిత అధికారుల తో జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో పెండింగ్ ఉన్న మోటార్ ఆక్సిడెంట్, సివిల్ కేసులను, భూ సేకరణ కేసులు, బ్యాంక్ మరియు చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులను త్వరితగతిన పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ను డిసెంబర్ 13 వ తేదిన నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో ఎక్కువ కేసులు పరి ష్కరించేల ప్రత్యేక దృష్టి సారించి ఈ లోక్ అదాలత్ ను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్స్, ఎపియస్ఆర్టీసి రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, డిపో మేనేజర్ సుధా రాణి , ఇన్సూరెన్స్ న్యాయ వాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, బ్యాంకుల లీడ్ డివిజనల్ మేనేజర్ రామచంద్ర రావు, బ్యాంక్ మేనేజర్స్, చిట్ ఫండ్ అధికారులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**అధికారులకు డీఎస్పీ చెంచుబాబు సూచన**

**నాయుడుపేట, డిసెంబర్ 6, వుదయంప్రతినిధి:** జాతీయ రహదారులపై జరిగే ప్రమా దాలను నివారణకై పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు డి ఎస్ పి చెంచుబాబు సూచించారు. శనివారం తిరుపతి జిల్లా నాయుడుపేట సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో జాతీయ రహదారుల శాఖ అధికారులు మరియు పోలీస్ శాఖ అధికారు లతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేట నుంచి తిరుపతి వెళ్ళే జాతీయ రహదారి మరియు చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్ళే జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రమా దాలను అరికట్టే ప్రక్రియలో అధికారులు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. జాతీయ రహ దారిపై సూచిక బోర్డులను తప్పనిసరిగా వాహనదారులు గుర్తించేలా ఏర్పాటు చేయాల న్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు స్పష్టంగా గుర్తించేలా రేడియం సూచిక బోర్డులతో పాటు స్టిక్కర్లను ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులు నిర్దిష్టమైన వేగంతో వెళ్ళేలా వేగ నిరోధక సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలో వాహనదారులు వాహనాల వేగాన్ని నియంత్రించుకునేలా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. కూడలి ప్రాంతాలలో వాహనదారులు నిర్దిష్టమైన మార్గాలలో నిర్దిష్టమైన వేగంతో వెళ్ళేలా చర్యలు చేపడితే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ రహదారులపై మలుపులు ఉన్న ప్రాంతాలలో నిర్దిష్ట మైన సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను అరికట్టువచ్చని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల పరిధిలో ఆవులు, గేదెలు, మేకలు మరియు గొర్రెలు జాతీయ రహదారు లపై రాకుండా ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ రహదారులు మరమ్మత్తులు జరిగే ప్రాంతాలలో నిర్దిష్టమైన సూచిక పోటీలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాలను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావే శంలో నాయుడుపేట అర్బన్ సిఐ బాబి, గ్రామీణ సిఐ సంగమేశ్వరరావు మరియు జాతీయ రహదారుల శాఖ అధికారులు పాల్గొన్నారు.



## కేవికే ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం

**చింతకొమ్మదిన్న, డిసెంబర్ 06, (వుదయం ప్రతినిధి)** ఇప్పపెంట గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం (కే.వి.కే) ఉటుకూరు వారి ఆధ్వర్యంలో, రాష్ట్రీయ కెమికల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్.సి.ఎఫ్) సంస్థ సహకారంతో ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కే.వి.కే పశు విజ్ఞాన శాస్త్రవేత్త డా. సురేష్ కుమార్ రెడ్డి సమన్వయం చేశారు. ప్రారంభ కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె మండల సహాయక సంచాలకులు డా. శ్రీధర్ లింగారెడ్డి పాల్గొని రైతులకు పశువుల ఆరోగ్యంపై అవగాహన పెంపు అవసరాన్ని వివరిం చారు. పశువైద్య అధికారి డా. శివరామి రెడ్డి గ్రామంలోని పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సుమారు 90 పశువులకు వివిధ వ్యాధులపై చికిత్స, ఖనిజ మిశ్రమాల పంపిణీ, డీ–వార్మింగ్, చర్మవ్యాధుల నిర్ధారణ వంటి సేవలు అందించారు. పాల ఉత్పత్తి తగ్గుదల, పాదవ్యాధులు, జీర్ణ సమస్యలు వంటి సమస్యలకు తక్షణ చికిత్స చేశారు. పశువుల రిప్రొడ క్షన్ మేనేజ్‌మెంట్‌ను మెరుగుపరచేందుకు కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని నిపుణుల బృందం నిర్వహించింది. హీట్ డిటెక్షన్, పోషకాహార నిర్వహణ, ఖనిజాల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్.సి.ఎఫ్ డెప్యూటీ మేనేజర్ రాకేష్ రైతులకు పశువుల పోషణలో ఖనిజాల పాత్ర, ఉత్పాదకత పెంపుకు తీసుకోవాల్సిన చర్యలు, సంస్థ చేపడుతున్న సామాజిక బాధ్యత కార్యక్రమాల గురించి వివరణ ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఇలాంటి శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా. సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ——పశువుల ఆరోగ్యం గ్రామీణ పశుపోషకుల ఆదాయ వృద్ధిలో కీలక మని కే.వి.కే తరఫున ఇటువంటి శిబిరాలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్ర మంలో ఇప్పపెంట గ్రామ సచివాలయ సిబ్బంది నరేష్, రఫీతో పాటు రైతులు, మహిళా రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనంతసాగరం మండలం ప్రభుత్వ ఖాజీముస్లిం పురోహితులుగా సయ్యద్ తన్వీర్ అహ్మద్ నియామకం

**ఆత్మకూరు రూరల్ అనంతసాగరం డిసెంబర్ 6 (వుదయం ప్రతినిధి)** అనంతసా గరం హజరత్ మష్ కూర్ బాబ వారి మనవలు అనంతసాగరం దర్గా పీఠాధిపతి సాని సాహెబ్ కుమారులు సయ్యద్ తన్వీర్ అహ్మద్ అనంతసా గరం మండలం ప్రభుత్వ ఖాజీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించారు..ఈ సందర్భంగా తనను నియ మించినందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి వీరు ధన్యవాదాలు తెలిపారు.



# అద్భుత సంగీత ప్రపంచానికి నీరాజనం అందిద్దాం

- మంత్రి కందుల దుర్గేష్
- విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ప్రారంభం
- ఏపీకి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేటాయించాలని, ఇప్పటికే ప్రతిపాదనలు పంపించినట్లు కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ కు వెల్లడి
- రాష్ట్ర విభజన కారణంగా కోల్పోయిన శిక్షణా సంస్థలతోపాటు ఏపీకి సంగీత, నాటక, నృత్య శిక్షణ సంస్థ కేటాయించాలని కేంద్రానికి ప్రతిపాదనలు
- నేటి తరానికి కళారూపాల ఆవశ్యకతను వివరించి వాటిపై అనురక్తి కలిగించే బాధ్యతను తీసుకుందామని పిలుపు



**విజయవాడ డిసెంబర్ 6 వుదయం ప్రతినిధి** అద్భుత సంగీత ప్రపంచానికి నీరాజనం అందిద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. సంగీత పర్యాట కాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు (సంగీత నాటక అకాడమీ), రాష్ట్ర సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 6,7 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో జరిగే కృష్ణవేణి సంగీత నీరాజనం వేడుకలు మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీద ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ను కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డే ఘనంగా సత్కరించారు.. బొబ్బిలి వీణ ను బహుమ తిగా అందించారు. ఈ సందర్భంగా ఏపీకి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేటాయించాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు ప్రతి పాదనలు అందించినట్లు కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ జనరల్ కు వెల్లడించారు. సంబంధిత అంశాన్ని ఫాలో అప్ చేయాల్సిందిగా కోరారు. అదేవిధంగా రాష్ట్ర విభజన కారణంగా కోల్పోయిన అనేక కళా సంస్థలు ఏపీకి రావాల్సిన అవసరం ఉందని, ప్రత్యేకించి సంగీత, నాటక, నృత్య శిక్షణ సంస్థ కేటాయించాల్సిందిగా కేంద్రానికి ప్రతి పాదనలు అందించామని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ గుర్తు చేశారు. కళారూపాలపై నేటి తరంలో అనురక్తి కలిగించాలని, కూటమి ప్రభుత్వం కళా రూపాలను ముందుకు తీసుకెళ్లాలని ఆలోచిస్తుందని ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు.





అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు, శ్యామశాస్త్రి తదితర తెలుగు వాగ్గేయకారులను స్మరించుకున్నారు.

**కళా సంస్కృతిక వైభవానికి ఆంధ్రప్రదేశ్ చిరునామ**

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ మూడోసారి కృష్ణా నది తీరాన జరుగుతున్న కృష్ణవేణి సంగీత నీరాజనం వేడుకలు విజయవంతం అవ్వాలని ఆకాంక్షించారు. ఇదొక అద్భుతమైన ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమం అని అభివర్ణించారు. కృష్ణవేణి తరంగాల మధ్య జరుగుతున్న కృష్ణవేణి సంగీత నీరాజనం సంగీత ధ్వని అని, సంగీత ఝరి అని పేర్కొన్నారు. అజరామర మైన సంగీత ప్రవాహానికి, కళా సంస్కృతిక వైభవానికి ఆంధ్రప్రదేశ్ చిరునామ అన్నారు. సంగీతం, నాట్యం, నటన తదితర కళారూపాల్లో నిష్ణాతులైన కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది ఉన్నారని గుర్తు చేసారు.సం గీత ప్రవాహాన్ని ముందుకు తీసుకెళ్లటానికి మేము సైతం అంటూ అనునిత్యం కళారూపాలని ప్రదర్శించేటువంటి కళాకారులకు, పాల్గొని విజయవంతం చేసే సంగీత ప్రియులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్ర మాల ద్వారా కళలను ప్రోత్సహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, సీఎం చంద్రబాబు నాయుడు, స్వయాన కళాకారుడైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మంత్రి దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర సంగీత విధానాలు, కళా సాంస్కృతిక రూపాలు ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివ రించారు. వివిధ రంగాల్లో మారుతున్న విలువలను దృష్టిలో పెట్టుకొని ఆధునిక పరంపరలో కొట్టుకుపోతున్న నేటి యువతరానికి కళారూపాల ప్రాశస్త్యాన్ని తెలపా ల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి కళా, సంస్కృతిక రంగాల్లో మూలాలను వివరించాల్సిన ఆవశ్యకతను వివ రించారు. నిత్యం విమర్శ, ప్రతి విమర్శలతో రగిలే రాజకీయ నాయకులకు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రజాసేవకి పునరంకితమయ్యేందుకు ప్రేరణగా ఉంటాయన్నారు. కుల, మతాలు లేని సంగీతా నికి, కళారూపాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతని స్తోందని తెలిపారు. ప్రభుత్వం పరంగా తెలుగు జానపద కళారూపాలైన తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ తదితర కళారూపాలను నేటి తరానికి అందిస్తామన్నారు. ఆయా కళారూపాల మాధుర్యాన్ని నేటి తరానికి తెలియచె ప్పితే ప్రపంచం చెంతకు రాయబారులుగా తీసుకెళ్తారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఇది రెండు రోజులు కార్యక్రమం అయినప్పటికీ కూడా దీన్ని మనం నిరంతరా యంగా కొనసాగించుకునే విధంగా కార్యక్రమాలు ఉండా లన్నారు. ఏ రంగాల్లో ఉన్నప్పటికీ మన ఆచారాలు, సంప్ర దాయాలు, కళా రీతుల్ని పిల్లలకు నేర్పించటాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం కేవలం విజయవాడలోనే కాకుండా గోదావరి తీరం రాజమండ్రి, శ్రీశైలం, మంగళగిరి, శ్రీకాళహస్తి మొవ్వ తదితర ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి కందుల దుర్గేష్ ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకట రామన్ హెగ్డే, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, ప్రముఖ సంగీత విద్వాంసులు మల్లాది రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



**కర్నూలు , డిసెంబర్ 6 వుదయం న్యూస్ ప్రతినిధి :** కర్నూలు ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కర్నూలు స్మార్ట్ సిటీ అంశంపై మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని కర్నూలు ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేలా ప్రణాళి కలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిరంతర త్రాగు నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్, పార్కులు, ఔటర్ రింగ్ రోడ్, ఫ్లై ఓవర్లు, రవాణా వ్యవస్థ, తదితర మౌలిక సదుపాయాలను ప్రణాళికలో చేర్చాలన్నారు. వీటిని ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలైన జల శక్తి, అమృత్, పీఎం గతి శక్తి, స్వచ్ఛ భారత్ మిషన్, స్వదేశీ దర్శన్, నేషనల్ గ్రీన్ ఎయిర్ తదితర పథకాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవా లని కలెక్టర్ ఆదేశించారు.. అందుకనుగుణంగా డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ లు తయారుచేసి, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించి నిధులు విడుదల అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా నిరంతర త్రాగు నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం ఏర్పాటుకు అత్యంత ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. అలాగే నగరం లో పచ్చదనం పెంపు, స్వచ్ఛమైన గాలి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుంగభద్ర, హంద్రీ నది, కేసీ కెనాల్ లను పరిశుభ్రంగా ఉండే విధంగా కూడా చర్యలు ఉండాల న్నారు. జగన్నాథ గట్టుపై ఒక మంచి పార్క్, నగరంలో మూడు పార్కులు ఉండేలాగా ప్రణాళికలు ఉండాలన్నారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చి నెలాఖరు లోపు డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ లు తయారుచేసి, సంబంధిత శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, తద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్రణాళికల రూపకల్పన లో మంత్రి టీజీ భరత్, ఇంచార్జి మంత్రి, పార్లమెంటు సభ్యులు బస్తి పాటి నాగరాజు ల సలహాలు కూడా తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, ఇన్చార్జి సిటీ ప్లానర్ వెంకటరమణ, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అంజాద్ బాషా, డీఈలు గిరిరాజ్ పవన్ , కుమార్ రెడ్డి , శ్రీనివాసన్, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**అన్న క్యాంటీన్లను కమిషనర్ పి.విశ్వనాథ్ ఆకస్మిక తనిఖీ**



**కర్నూలు డిసెంబర్ 6 వుదయం న్యూస్ ప్రతినిధి :** నగరంలోని అన్న క్యాంటీన్లలో అహార నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ నిర్వాహకులకు ఆదేశించారు. శనివారం ఆయన కొండారెడ్డి బురుజు, కలెక్టరేట్ అన్న క్యాంటీన్లను అకస్మి కంగా తనిఖీ చేశారు. ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, నీటి వసతి, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, వినియోగించే పదార్థాల నిల్వ విధానాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేసి రిమార్క్స్ నమోదు చేశారు. ఆహార నాణ్యతను ప్రతిరోజు పరిశీలించి తన దృష్టికి తీసు కోరావాలని నోడల్ అధికారులను ఆదేశించారు. సంబంధిత పారిశుద్ధ్య తనిఖీదారుడు ప్రతి రోజూ విధిగా స్వచ్ఛత పనులు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్ల లోఎఫ్‌యస్‌యస్ఏఐ నియమాలు తప్పనిసరిగా అమలు చేయాలని కమిష నర్ సూచించారు. రోజువారీ వంట ప్రక్రియలో ఉపయోగించే ముడి పదార్థాలు తాజాగా ఉండాలని, పాతవి వెంటనే తొలగించాలని తెలిపారు. వంటశాలలో పాత్రలు, వంటసామగ్రి, ప్లేట్లు, గ్లాసులు ప్రతి వాడుకకు ముందు మరియు తరువాత సమగ్రంగా శుభ్రం చేయడం అనివార్యమని పేర్కొన్నారు. శుద్ధి చేసిన నీటినే వంటకు, తాగడానికి ఉపయోగించాలని, నీటి నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. సిబ్బంది చేతి పరిశుభ్రత, గ్లౌవ్స్, క్యాప్, హెయిర్‌నెట్ వంటి భద్రతా ప్రమా ణాలను విధిగా పాటించాలన్నారు. వినియోగదారుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కూర్చునే సౌకర్యాలు, నీటి సదుపాయాలు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మెనూలో పోషకాహార ప్రాధాన్యత ఉన్న పదా ర్థాలను మాత్రమే అందించడంపై క్యాంటీన్ నిర్వాహకులు దృష్టి పెట్టాలని కమిషనర్ సూచించారు.




## ర్యాగింగ్ నిరోధంపై అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి**

**కర్నూలు డిసెంబర్ 6 వుదయం న్యూస్ ప్రతినిధి :**ఈ కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ర్యాగింగ్ నిరోధంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ర్యాగింగ్ యొక్క దుష్ప్రభావాల గురించి, విద్యా సంస్థలలో ర్యాగింగ్ నిషేధానికి సంబంధించిన శిక్షాపరమైన నిబంధనలు గురించి వివరించారు. ర్యాగింగ్ కు పాల్పడిన వ్యక్తుల పై భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం వారికి జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించబడతాయని తెలిపారు. నేరం యొక్క తీవ్రతను బట్టి శిక్ష పరిమాణం మారుతుంది అని తెలియజేశారు. ముఖ్యంగా విద్యార్థులు ర్యాగింగులో పాల్గొన్న అందుకు ప్రోత్సహించిన వారికి శిక్ష విధించబడుతుందని, దీని వల్ల విద్యార్థులకు భవిష్యత్ లో సమస్యలు ఏర్పడుతాయని తెలిపారు. అలాగే విద్యార్థులందరికీ ప్రాథమిక హక్కులు స్వేచ్ఛ ల గురించి అవగాహన కలిగించారు. సమానత్వము, న్యాయము, మానవ గౌరవం,మానవ హక్కుల కోసం మరియు రక్షణ కోసం యువత నిలబడాలని కోరారు. విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్ కు గురైతే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేస్తే వారికి తక్షణ న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ సెక్రటరీ సుబ్బారెడ్డి,మేనేజింగ్ ట్రస్టీ రాఘవరెడ్డి, ట్రస్టీ ఏకంభర రెడ్డి,డైరెక్టర్ వై.మురళిధర రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ నాగలక్ష్మి రెడ్డి, డెంటల్ డాక్టర్ పావని,కాలేజీ లెక్చరర్స్,విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రేపు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

**కర్నూలు , డిసెంబర్ 6 వుదయం న్యూస్ ప్రతినిధి :**– ఈ నెల డిసెంబర్ 8 వ తేదీ సోమవారం ఉదయం 9–30 గంటలకు కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీక రించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రక టనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, ముని సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్ సైట్లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.



## 10వ తరగతి విద్యార్థులకు అల్పాహార వితరణ

**ఆత్మకూర్ రూరల్ ఏఎస్పేట డిసెంబర్ 6వ తేదీ ( వుదయం ప్రతినిధి)** ఏఎస్ పేట మండలం కావలి యడవల్లి. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులుకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ సందర్భంగా పాఠశాల సిబ్బంది అల్పాహార వితరణ చేయడం జరిగింది. ప్రతి రోజు సాయంత్రం పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు అల్పాహా రాన్ని అందించడం జరుగుతుంది.ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు శ్రీమతి యం.శైలజ మాట్లాడుతూ పదవ తరగతి చదువు తున్న విద్యార్థిని విద్యార్థులకు అదనపు క్లాసులు నిర్వహించడం జరుగు తుందని వంద రోజులు జరిగే కార్యక్రమంలో ప్రతి సబ్జెక్టులో వాళ్ళు రాణించే ఎక్కువ మార్కులు సాధించడానికి పాఠశాల ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుందని పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు సాయంత్ర ములలో పౌష్టికాహారం అందించడం శుభ పరిణామని ప్రభుత్వ పాఠశా లలో పదవ తరగతి పరీక్షా ఫలితాలల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తుందని అందులో భాగంగానే నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించ డానికి మా పాఠశాల కృషి చేస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమం పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాండురంగారావు , గ్రామ సర్పంచ్ శ్రీమతి ధనమ్మ , గ్రామ పెద్దలు శ్రీ ఏలూరి మాల్యాద్రి నాయుడు , శ్రీ యం. మోహన్ రావు , పాల్గొన్నారు.

## కమ్మేసిన పొగ మంచు

**తొండూరు, డిసెంబర్ 06, (వుదయం ప్రతినిధి)** మండలంలో దట్టమైన పొగ మంచు ఆవరించింది. వేకువ జామున భారీగా పొగ మంచు కురవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మండల కేంద్రంలో పలు గ్రామాలలో కనుచూపుమేరలో పొగ మంచు నెలకొంది. ముందు వెళ్తున్న వాహనాలు కనింపకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు,దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ముందుకు సాగారు.. ఇళ్ల మధ్యలో సైతం మంచు కమ్మేసింది. ఈ సంవత్సరం చలికా లంలో పొగ మంచు కురవడం ఇదే మొదటి రోజు. శనివారం ఉదయం నుంచే గ్రామాల్లో పొగ మంచు కప్పి ఉండడంతో ఇంట్లో నుండి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నిత్యం ఉదయం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేవారు,పాడి పశువుల నుండి పాలు పితికే వారి పరిస్థితి మాత్రం చెప్పనక్కరలేదు. పక్కిల్లు కూడా కూడా కనిపించని పరిస్థితి పొగమంచు గ్రామాలను కమ్మేసింది.



## 21 సర్పంచ్లకు 163 మంది నామినేషన్లు 184 వార్డు సభ్యులకు 599 మంది నామినేషన్లు

**మండల ఎన్నికల అసిస్టెంట్ అధికారి ఎంపీడీవో వనపర్తి అద్వైత**



ఖానాపురం, డిసెంబర్ 6 (వుదయం ప్రతినిధి):మండలంలోని 21 గ్రామపంచాయతీ పరిధిలోని 21 మంది సర్పంచ్ అభ్యర్థులకుగాను 163 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని, 184 మంది వార్డు సభ్యులగాను 599 మంది నామినేషన్లు వేశారని మండల ఎన్నికల అసిస్టెంట్ అధికారి ఎంపీడీవో వనపర్తి అద్వైత తెలిపారు.

## వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అమలు చేయాలి – డీఎంహెచ్ఓ ఏ అప్పయ్య



హనుమకొండ, డిసెంబర్ 06 (వుదయం ప్రతినిధి) :వ్యాధి నిరోదక టీకాలు సక్రమంగా అమలు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్ ఏ అప్పయ్య అన్నారు. శనివారం రోజున హసన్ పర్తి పీహెచ్సి పరిధిలోని సీతంపేట ఆరోగ్యఉప కేంద్రం లో నిర్వహిస్తున్నటువంటి వ్యాధి నిరోదక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. వ్యాక్సినేషన్ కోసం ఉన్నటువంటి ద్యూ లిస్టును, అలాగే అందులో ఎంత మందికి వ్యాక్సినేషన్ చేశారనీ ఆయన పరిశీలించారు. గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి వారికి అన్ని జాగ్రత్తలు వివరించాలని అన్నారు. స్థానిక అంగన్వాడి కార్యకర్తలతో సమన్వయంగా పనిచేయాలని ఆయన సూచించారు.

## భారత రాజ్యాంగ రూపకర్తకు ప్రజాసంఘాల ఘన నివాళి



భూపాలపల్లి డిసెంబర్ 6 వుదయం ప్రతినిధి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలో డా బి ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక భారతదేశ చరిత్రలో అంబేద్కర్కు అత్యంత ప్రాముఖ్యం ఉంది. దేశ జనాభాలో పది శాతం ఉన్న అగ్రవర్ణాల వారు, తొంభైశాతం ఉన్న అణగారిన వర్గాల ప్రజల మెడలకు బానిస సంకెళ్ళు వేసి తరతరాలుగా వారితో వెట్టిచాకిరీ చేయించుకున్నా రు. స్వాతంత్ర్యానంతరం ఇలాంటి పరిస్థితులను రూపుమాపి, దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను సరిసమానం చేసేందుకు కృషి చేసిన వ్యక్తి డా. బీఆర్ అంబేద్కర్. వర్ధంతి సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించి, ఎన్నో కష్టాలు పడి, పోరాటాలు, త్యాగాలు చేసి భారత రాజ్యాంగం అనే గ్రంథాన్ని రచించిన ఒక విశిష్ట సంఘ సంస్కర్త'గా మాత్రమే నేటి పాలకులు అంబేద్కర్ను పరిమితం చేశారు.కానీ, అణగారిన వర్గాలకు ఏ లక్ష్యాలను సాధించుకో వాలని చెప్పాడో వాటిని నేటి పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం దేశ అగ్రవర్ణ పాలకుల స్వార్థబుద్ధికి నిదర్శనంభారత ప్రజలందరి మధ్యా 'స్వేచ్ఛ, సమానత్వం, సోద రభావం, ప్రజాస్వామ్య, గణతంత్ర' భావాలు విరజిల్లాలని కలలుగని, ఆయా అంశాలను రాజ్యాం గంలో పొందుపరిచాడు. ఒకపక్క బ్రిటిష్ పాలకులపై రాజీపడని స్వాతంత్ర్య పోరాటం సాగిస్తూనే, మరోపక్క నాటి అగ్రవర్ణ నాయకులతోనూ అంతే స్థాయిలో తీవ్ర పోరాటం చేశాడు. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు పీక కిరణ్. జాతీయ మాల మహానాడు మంతిని నియోజకవర్గ ఇంచార్జి కందుగుల రాజన్న. అల్ ఇండియా అంబేద్కర్ యువజన మండల అధ్యక్షులు రామగిరి రాజు, మండల ప్రధాన కార్యదర్శి లింగమళ్ళ శంకర్ బోట్ల నరేష్ పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసి చూపిస్తా ఆశీర్వదించండి



రాయపర్తి, డిసెంబర్ 6 (వుదయం ప్రతినిధి); జేతురాం తండ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుగులోత్ స్వప్నవిజయ్ అన్నారు.శనివారం జేతురాం తండ గ్రామంలో ఎన్నికల ప్రచారం లో పాల్గొని ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో తనను సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు.గత బిఆర్ఎస్ పాలనలో గ్రామం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు.గ్రామానికి సేవా చేయాలనే ఉద్దేశంతో రాజకీయాలలోకి వచనాన్ని అన్నారు.పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి ల సహకారంతో గ్రామానికి అధిక నిధులు తీసుకువచ్చి గ్రామ అభివృద్ధికి పాటుపడుతాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏకగ్రీవ వార్డు మెంబర్ గుగులోత్ రవి, గుగులోత్ లాలు, నేతావత్ వీరు, జాటోత్ బద్రు, గుగులోత్ సుకుని, గుగులోత్ యాకూబ్, నేతావత్ బద్రు,జాటోత్ వీరన్న, జాటోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలి అసిస్టెంట్ అధికారి పి జ్యోతి



రాయపర్తి డిసెంబర్ 6 (వుదయం ప్రతినిధి):స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు శనివారం స్థానిక రైతు వేదికలో అవగాహన సదస్సు అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ పి జీవనజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేసేతప్పనిసరిగా అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలని అన్నారు. మండలంలోని 40 గ్రామాల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులను పిలిపించి ఎన్నిక నియమాలు ఖర్చుల వివరాలను నమోదు ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలు పాటించాలని, గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయి వరకు సమయం పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

## పలిమెల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీలో చేరిక



జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 06(వుదయం ప్రతినిధి): మంథని నియోజకవర్గం పలిమెల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పలిమెల బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి జవ్వాజి తిరుపతి – పుష్పలత దంపతులు శనివారం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబు సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ లో చేరినట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే జీఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరు ప్రజాపాలన ప్రభుత్వంకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీతో ఎన్నో కుటుంబాలకు ప్రయోజనం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ చేరిక కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటక్కం అశోక్, తోపాటు తదితరులు పాల్గొనట్లు ప్రకటనలో తెలిపారు.

# ప్రజలకు గ్రామానికి సేవ చేసే వ్యక్తినె ఓటేసి ఎన్నుకోవాలి



ఖానాపురం, డిసెంబర్ 6 (వుదయం ప్రతినిధి):గ్రామపంచాయతీ ఎన్నికలలో నిలబడే అభ్యర్థులు గ్రామాన్ని అభివృద్ధి పదంలో తీసుకు వెళ్లే అభ్యర్థి ప్రజలకు సేవ చేసే అభ్యర్థిని 18 సంవత్సరాల పైబడిన యువతి యువకులు ప్రజలు ఏలాంటి ప్రలోభావాలకు లొంగిపోకుండా స్వచ్ఛందంగా సేవ చేసే అభ్యర్థికి ఓటు వేసి గెలిపించుకోవాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్ యువతకు ప్రజలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ఎన్నికల అసిస్టెంట్ అధికారి ఎంపీడీవో వనపర్తి అద్వైత, స్థానిక ఎస్ఐ రఘుపతి ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్య పరిచే కడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల అసిస్టెంట్ అధికారి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలలో నిలబడే అభ్యర్థులు గ్రామానికి సేవ చేసే వ్యక్తి అయి ఉండాలి ప్రజలకు సేవలు అందించే వ్యక్తి అయి ఉన్న అభ్యర్థిని నిర్ణయించుకొని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలోభావాలకు తలగకుండా ఓటు హక్కును తమ తమ కేంద్రాల్లో వినియోగించుకోవాలని మండల ఓటర్స్ కు మండల ఎన్నికల అసిస్టెంట్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీల్ కుమార్ రాజ్, మండల వినియోగదారుల కన్వినర్ లక్ష్మయ్య, జిల్లా ఫుడ్ అడ్వైసర్ కమిటీ మెంబెర్, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, ఎస్సి, ఎస్టీ వినియోగదారుల కన్వినర్ బోయిని వెంకటస్వామి, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ వసంత, వెంకట్రాంనరసయ్య, వనమ్మ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులకు భయపడేది లేదు.. టిఆర్పి జిల్లా అధ్యక్షులు రవి పటేల్



భూపాలపల్లి డిసెంబర్ 6 వుదయం ప్రతినిధి జయశంకర్ భూపాలపల్లి జిల్లాతెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ నాయకత్వంలో, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న అక్రమ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తూ భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డును దిగ్బంధించారు.నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ రవి పటేల్ బీసీల రిజర్వేషన్ 42%, విద్య, ఉపాధి, రాజకీయ హక్కుల కోసం అలుపెరగక పోరాడుతున్న తీన్మార్ మల్లన్న ని పోలీసులు గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు నామరూపాలేనన్నట్లు ఉందని, దీనిని తెలంగాణ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని పేర్కొన్నారు.నిన్న జరిగిన సాయి ఈశ్వర చారి మరణం అనంతరం, అంత్యక్రియలకు తీన్మార్ మల్లన్న వెళ్లకుండా ప్రభుత్వం మరియు ఆధిపత్య కులాలు ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం అంగీకారయోగ్యం కాదని, ఇది బీసీ ఉద్యమాన్ని బలహీనపరచే ప్రయత్నమని అన్నారు.సాయి ఈశ్వర చారి "నా మరణంతోనే అయినా బీసీలకు రాజ్యాధికారం రావాలి" అని చెప్పి ప్రాణత్యాగం చేసిన విషయం గుర్తుచేసిన రవి పటేల్తీన్మార్ మల్లన్న తప్ప మిగతా అన్ని రాజకీయ నేతలకు అంత్యక్రియల్లో పాల్గొనే అనుమతి ఇవ్వడం, మల్లన్నను మాత్రమే నిర్బంధించడం అత్యంత హేయమైన చర్య అని, ప్రజలు ఈ వ్యవహారాన్ని గమనిస్తున్నారని అన్నారు.బీసీల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న బయటకు వస్తే ఉద్యమం మరింత బలపడుతుందని, అందుకే అగ్రవర్ణ పార్టీల నాయకులు కుట్రపూర్వకంగా పోలీసులను ఉపయోగించి నిర్బంధించారని రవి పటేల్ ఆరోపించారు. ఇకపై బీసీ ఉద్యమంలో మరణాలు జరగకూడదని, బీసీల రాజకీయ సాధికారతకోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ తీన్మార్ మల్లన్న నేతృత్వంలో పెద్దఎత్తున ప్రజాపోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వాలు తమ అన్యాయ చర్యలను వెంటనే ఆపాలని, లేకపోతే మరింత పెద్దస్థాయిలో ఉద్యమాలు చేపడతామని రవి పటేల్ హెచ్చరిక జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రణయ్ రాజ్, కరుణాకర్, సురేందర్, సునీల్, శ్రీలత, సంపత్, శ్రీను, నరసయ్య, ప్రణీత్, శ్రీకాంత్,శ్రీనివాస్,జినుకలశ్రీను, కృష్ణ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం స్వతంత్ర అభ్యర్థి అజ్మీర రాజునాయక్



ఖానాపురం, డిసెంబర్ 6 (వుదయం ప్రతినిధి):గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటూ గ్రామ ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యంగా ముందుకు వెళ్తానని గ్రామ ప్రజలకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన సర్పంచ్ అభ్యర్థి అజ్మీర రాజునాయక్ గ్రామ ప్రజలకు తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామ సర్పంచి పదవి రిజర్వేషన్లో భాగంగా ఎస్ టికి కేటాయించడంతో సొంత పార్టీ నుంచి టికెట్ రాకపోవడంతో గ్రామ ప్రజల మనోభావాలకు అనుగుణంగా గ్రామ ప్రజల విశ్వాసంతో గ్రామస్తుల నమ్మకంతో గ్రామానికి ప్రజలకు సేవ చేయడానికి గ్రామస్తుల సహకారంతో స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచిగా పోటీ చేస్తున్నట్లు అభ్యర్థి అజ్మీర రాజనాయక్ తెలుపుతూ ఈ నెల 17న మన గ్రామంలో నిర్వహించే గ్రామపంచాయతీ ఎన్నికలలో ప్రజలందరూ కలిసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళే విధంగా గ్రామ ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని గ్రామ ప్రజలందరిని కోరుతున్నట్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి రాజునాయక్ తెలిపారు.

## ఈశ్వర చారి త్యాగం మరువలేనిది



జన్నారం, డిసెంబర్ 6(వుదయం విలేకరి) ఈశ్వర చారి త్యాగం మరువలేనిదని మంచిర్యాల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్ అన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ గత గురువారం రోజున హైదరాబాదులోని తీన్మార్ మల్లన్న ఆఫీసు ముందు ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు.శనివారం రోజున విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. స్వచ్ఛందంగా తమ వ్యాపార సంస్థలను బంద్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ కోసం శ్రీకాంతాచారి నేడు బిసి రిజర్వేషన్ల కోసం ఈశ్వర చారి ప్రాణ త్యాగాలు చేశారని ఇప్పటికైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేయికండ్ల రవి చారి, ఉపాధ్యక్షులు శ్రీరాముల వెంకటేష్, నాయకులు బండోజు లక్ష్మీ నరసయ్య, మన్మధ చారి,తోగిటి శోభన్, కృష్ణ కాంత్, సుమన్, వెంకటేష్, శ్రీధర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు ఘన నివాళులు



జన్నారం, డిసెంబర్ 6(వుదయం విలేకరి) భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేద్కర్ అని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని జన్నారం పట్టణంలో గల అంబేద్కర్ విగ్రహానికి మండల అంబేద్కర్ సంఘం, మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేరు వేరుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడు అయన అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజఫర్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, పోనకల్ తాజా మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, వర్తక సంఘం అధ్యక్షుడు వోజ్జల వామన్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజన్న యాదవ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్,రాగుల శంకర్, ఇసాక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్



రాయపర్తి డిసెంబర్ 6(వుదయం ప్రతినిధి ): తెలంగాణ రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు–2025 సంబంధించి రాయపర్తి మండలానికి కేటాయించిన ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం రాయపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందునిర్వహించనైనది .ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అధికారులు 365 మంది అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని గౌరవ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి ఎన్నికలు సజావుగా జరుగుటకు సూచనలు చేశారు . ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో రామ్ రెడ్డి , తాసిల్దార్ ఎం .శ్రీనివాస్, ఎంపీడీవో జి.కిషన్ , TOT లు సుధీర్ బాబు, నాగేశ్వరరావు, పరమేశ్వర్, ఆచార్యులు మరియు పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి తల్లి మృతి

**మృతదేహానికి శ్రద్ధాంజలి మండల పార్టీ అధ్యక్షుడు, నెక్కొండ బ్లాక్ అధ్యక్షుడు**



ఖానాపురం, డిసెంబర్ 6 (వుదయం ప్రతినిధి):మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి కోరే రాములు తల్లి కోరే కొమరమ్మ(65) అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహాన్ని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్ మోహన్ రెడ్డి సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆరే సంపత్ కుమార్, సర్పంచ్ అభ్యర్థి జాటోత్ వినోద్ కుమార్, నాయకులు వల్లే రవి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీ



జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 06(వుదయం ప్రతినిధి):రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ శుక్రవారం మొగుళ్లపల్లి మండలంలోని మొగుళ్లపల్లి, ఇస్సిపేట, రంగాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుతున్న సౌకర్యాలు, తూకపు యంత్రాల పని తీరు, తేమ శాతం కొలిచే పరికరాల పనితీరు, ధాన్యం రవాణా ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరగాలని సంబంధిత అధికారులకు సూచించారు.రైతుల నుండి నేరుగా ధాన్యం స్వీకరణ, చెల్లింపుల ప్రక్రియ వేగవంతం, రద్దీ నివారణ, కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తేమ శాతం కారణంగా కొనుగోలులో ఆలస్యం కాకుండా రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని అధికారులులకు సూచించారు. ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా రైతులకు అనుకూలంగా, ఎలాంటి ఇబ్బందులు రాకుండా సాగాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలనే మనందరికి సమాన హక్కులు లభిస్తున్నాయి ఎమ్మెల్యే జారె



దమ్మపేట డిసెంబర్ 6 (వుదయం ప్రతినిధి) సమాజంలోని ప్రతి వ్యక్తి సమానత్వం న్యాయం విద్య అభివృద్ధి పొందాలన్న మహోన్నత లక్ష్యంతో భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహానుభావుడు డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ గారి వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆది నారాయణ గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం విద్య ఉపాధి ఆర్థికస్వావలంబన హక్కుల పరిరక్షణ కోసం అంబేద్కర్ రచించిన రాజ్యాంగం భారతదేశానికి దిశానిర్దేశం చేస్తుందన్నారు అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ నిర్మాణ శంకుస్థాపన



కోదాడ డిసెంబర్ 6(వుదయం)కోదాడ మండల పరిధిలోని స్తానిక కొమరబండ కోదాడ రోడ్ డివైడర్ ప్రహరీలో రాజ్యాంగ నిర్మాత న్యాయకోవిదుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహ నిర్మాణ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కొమరబండ గ్రామ మత్స్య శాఖ సొసైటీ చైర్మన్ దేవపంగు వెంకటి, వైస్ చైర్మన్ మత్తయ్య, పెద్ద మాదిగ ధనమూర్తి,తమలపాకుల కోటి తదితరులు పాల్గొన్నారు.

## పశుఔషధ బ్యాంక్ కు విరాళం



కోదాడ డిసెంబర్ 6 (వుదయం)కోదాడ పట్టణం లోని స్తానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పశు ఔషధ బ్యాంక్ సేవలను గమనించిన ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చలిమెళ్ల వెంకటలక్ష్మారెడ్డి శనివారం ఐదువేల రూపాయల విరాళం జిల్లా పశు వైద్యాధికారి దామరచర్ల శ్రీనివాసరావు చేతులమీదుగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య కి అందించారు. ఈ సందర్భంగా దాతలను జిల్లా పశు వైద్య అధికారి అభినందించారు.ఈ కార్యక్రమంలో రామాపురం పశు వైద్యాధికారి డాక్టర్ బి శ్రీనివాస్, సిబ్బంది సాయికృష్ణ,రాజు ,చంద్రకళ,హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదరించండి అభివృద్ధి చేస్తా: పొనకల్ సర్పంచ్ అభ్యర్థి జక్కు సుష్మ భూమేష్

జన్నారం, డిసెంబర్ 6(వుదయం విలేకరి) ప్రజలు ఆదరించి ఆశీర్వదిస్తే పోనకల్ పట్టణాన్ని కనీ విని ఎరగని రీతిలో అభివృద్ధి చేస్తానని పోనకల్ సర్పంచ్ అభ్యర్థి జక్కు సుష్మ భూమేష్ అన్నారు.శనివారం రోజున వారు తమను సర్పంచ్ గా గెలిపించాలని కోరుతూ పలు వార్డులలో పర్యటించి ప్రచారం నిర్వహించారు.సర్పంచిగా గెలిపించినట్లయితే పోనకల్ పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దుతామని అలాగే వార్డులో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ముఖ్యంగా జన్నారం పట్టణంలో సెంట్రల్ లైటింగ్, మురుగు కాలువల నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.కోతుల బెడదకు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.అలాగే కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థిగా తను పోటీలో ఉన్నానని,కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ సకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పేద ప్రజల సంక్షేమమే కృషిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.ఈ సందర్భంగా అభ్యర్థి జక్కు సుష్మ మాట్లాడుతూ తన భర్త భూమేష్ గతంలో పోనకల్ సర్పంచ్ గా ఎంతోమంది నిరుపేదలకు అండగా నిలిచి, కరోనా సమయంలో, వరదల సమయంలో పలు కుటుంబాలకు అండగా నిలిచి అన్నదానం చేశారని గుర్తు చేశారు.అలాగే తమ కుటుంబం సమాజ సేవకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని అలాంటి కుటుంబం నుండి వచ్చిన నన్ను ప్రజలందరూ దీవించాలని కోరారు.

## జిపి ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**నారాయణపేట టౌన్, (వుదయం ప్రతినిధి):**

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రెండో విడత ఎన్నికల పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతా లక్ష్మీ సమక్షంలో శనివారం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు.ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 95 గ్రామ పంచాయతీల సర్పంచ్, 900 వార్డుల స్థానాలకు, 904 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, ఓ.పీ.ఓల ర్యాండమైజేషన్ జరిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, డీపీఓ సుధాకర్ రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, డీపీఆర్ ఓ రషీద్ పాల్గొన్నారు.

# సేవే నా రాజకీయానికి పునాది

- నన్ను ఆశీర్వదిస్తే అభివృద్ధిని కాగితాల మీద కాదు
- ప్రతి ఇంటి ముందు కనిపించేలా చేసి చూపుతా
- నీర్నెముల గ్రామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కందిమల్ల గోపాల్ రెడ్డి



**నకిరేకల్, (వుదయం ప్రతినిధి ):**

గ్రామం సమగ్ర అభివృద్దే తన లక్ష్యమని నీర్నెముల గ్రామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కందిమల్ల గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామ ప్రజల ఆశలు, అవసరాలు తీర్చేందుకు పగలు రేయి తేడా లేకుండా కష్టపడతానని అన్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం, ప్రతి కుటుంబం అభి వృద్ధే అసలు ధ్యేయమనీ కందిమల్ల గోపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీర్నెముల గ్రామం ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరిస్తా అని,ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా కార్యక్రమాలు చేపడతా" అని తెలిపారు. యువత, మహిళలకు ప్రత్యేక ప్రణాళికలు ఉపాధినైపుణ్య శిక్షణలు అందచేయనున్న గోపాల్ రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు స్వయం సహాయక బృందాల బలోపేతం, వృద్ధులు, రైతులకు సకాలంలో ప్రభుత్వం పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ప్రజలు తనను ఆశీర్వదిస్తారని, నమ్మకం "సేవే నా రాజకీయానికి పునాది" అని కందిమల్ల గోపాల్ రెడ్డి అన్నారు. తనను ఆశీర్వదిస్తే, అభివృద్ధిని కాగితాల మీదకాదు... ప్రతి ఇంటి ముందు కనిపించేలా చేసి చూపుతా"అని కందిమల్ల గోపాల్ రెడ్డి ప్రజల్ని కోరారు.

# అంబేద్కర్ వర్ధంతి వేడుక !



**హనుమకొండ, (వుదయం ప్రతినిధి) :**

హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో భారత రాజ్యాంగ నిర్మాత, సమానత్వ సమాజానికి శిల్పి, మహానుభావుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి అధ్యక్షతన ఈ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో ప్రారంభంగా ప్రొఫెసర్ జ్యోతి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆధునిక భారతానికి బాటలు వేసిన మహోన్నత నాయకుడని, ఆయన చూపించిన బౌద్ధిక స్ఫూర్తి యువతకు మార్గదర్శకమంటూ పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి సమాన హక్కులు సంపాదించిపెట్టడానికి జీవితమంతా పోరాడిన దృఢ సంకల్పం అంబేద్కర్‌దేనని, ఆయన రాజ్యాంగ నిర్మాణంలో ప్రదర్శించిన దూరదృష్టి ప్రపంచానికి ఆదర్శమని ఆమె అన్నారు. విద్య మాత్రమే వ్యక్తిని శక్తివంతం చేసే సాధనమని అంబేద్కర్ విశ్వసించారని, ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని ప్రొఫెసర్ జ్యోతి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ



**గద్వాల, (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల లోని మల్దకల్ మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి (తిమ్మప్ప) బ్రహ్మోత్సవాలలో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ పాల్గొన్నారు. ఎంపీ డీకే అరుణమ్మకి ఆలయ అర్చకులు, ఈఓ సత్యచంద్ర రెడ్డి, ఆలయ ధర్మకర్తలు ప్రహ్లాద్ రావు, అరవింద్ రావులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వయంభూ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి (తిమ్మప్ప) వారిని ఎంపి డీకే అరుణమ్మ, గద్వాల జిల్లా బీజేపీ యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండి వృద్ధి సాధించాలని కోరుకున్నాను. ఆలయ అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం ప్రసాద్ స్కీం కింద ప్రపోజల్ పంపాలని ఎండోమెంట్ అధికారులకు గతంలో సూచించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఎండోమెంట్ అధికారులు ఉత్తర్వులు పంపమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రపోజల్ పంపాల్సి ఉందని అన్నారు. కేంద్రానికి ప్రపోజల్ అందగానే, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆలయాభివృద్ధికి నిధులు అందేలా తప్పక కృషి చేస్తానని తెలిపారు. మరోసారి గద్వాల ప్రజలకు తిమ్మప్ప బ్రహ్మోత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు సుఖసంతోషంగా ఉండి, ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ అన్ని రంగాలలో రాణించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బండల పద్మావతి వెంకట రాములు, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్రరెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ దామ నాగరాజు, బిజెపి సీనియర్ నాయకులు కృష్ణం రాజు, మల్లెం దొడ్డి వెంకటేశ్వర రెడ్డి, రఘు గౌడ్,దామ వెంకటేష్, రెడ్డప్ప, లక్ష్మీ నారాయణ, నరసింహులు, వీరన్న గౌడ్, మల్దకల్ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలు

- ఏకగ్రీవ గ్రామాల్లోనూ అమలులో ఎన్నికల కోడ్
- జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ, (వుదయం జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం తెలిపారు. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నందున, చివరి దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఏకగ్రీవ గ్రామపంచాయతీల్లోను ఎన్నికల కోడ్ యథాతదంగా అమల్లోనే ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చివరి దశ ఎన్నికల ప్రక్రియ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటున్నందున ఎవరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించవద్దని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు చివరి దశ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించకుండా ఉండేలా ఎన్నికల విధులను నిర్వర్తిస్తున్న అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, చివరి దశ ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల కోడ్ ను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. ఈనెల 11, 14, 17 తేదీల్లో జిల్లాలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

## ఐజేయూ నేతలను సత్కరించిన ప్రెస్ క్లబ్ బాధ్యులు



**హనుమకొండ, (వుదయం జిల్లా ప్రతినిధి) :**

నూతనంగా ఎన్నికైన ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యులు, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా సత్కరించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇటీవల ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ మెంబర్లుగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టులు గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ,తోట సుధాకర్,సంగోజు రవి, టియుడబ్ల్యూజె ఐజెయు వరంగల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులుగా ఎన్నికైన శ్రీరాం రాంచందర్,మట్ట దుర్గాప్రసాద్ లను శాలువాలతో సత్కరించి మెమోంటోలు అందించి సన్మానించారు. యూనియన్ కు విశేష సేవలందించి నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా పదవీకాలం పూర్తి చేసుకున్న నల్లాల బుచ్చిరెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్యలు మాట్లాడుతూ యూనియన్ బలోపేతం కోసం పనిచేస్తున్న నేతలకు పదవులు రావటం అభినందనీయమని అన్నారు. ఐజేయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కే విరహత్ అలీ, రాం నారాయణ ల నాయకత్వంలో రాష్ట్రంలో జర్నలిస్టుల అభ్యున్నతి కోసం కోసం పనిచేస్తున్న యూనియన్ టియుడబ్ల్యూజె ఐజెయు మాత్రమేనని అన్నారు. క్లబ్ లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బొల్ల అమర్,ఉపాధ్యక్షుడు కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీలు వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్,కార్యవర్గ సభ్యులు ఎండీ నయీంపాషా, విజయరాజ్, ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, నేతలు సోమనర్సయ్య,రాజేంద్రప్రసాద్,సంపత్ రావు,పాషా,తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వరాచారి మృతి బాధాకరం

**బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు నూనె హరిబాబు**



**సత్తుపల్లి ,(వుదయం ప్రతినిధి);**

బీసీ రిజర్వేషన్స్ పెంపుదల విషయంలో పాలక వర్గాలు అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు నూనే హరిబాబు యాదవ్ అన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఈశ్వరాచారి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక ప్రాణత్యాగం చేసిన అమరవీరుడని తన సంతాప సందేశంలో నూనె హరిబాబు యాదవ్ పేర్కొన్నారు.ఈశ్వరాచారి అకాల మరణం పట్ల సంతాపం వెలిబుచ్చారు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈవిధంగా ఆత్మ బలిదానాలకు పాల్పడకుండా మన న్యాయమైన హక్కులు, రాజ్యాధికారంలో సముచితమైన వాటా కోసం మరింత పోరు బాట లో ముందుకు సాగుదామని బీసీలందరికి పిలుపునిచ్చారు.ఇలాంటి అవాంఛనీయ దుర్ఘటనలు చోటు చేసుకోకుండా అటు కేంద్రంలో అధికారంలో బీజేపీ, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ వెంటనే ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని నూనె హరిబాబు యాదవ్ డిమాండ్ చేశారు. స్వర్గీయ ఈశ్వరాచారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన భగవంతున్ని ప్రార్థించారు,సముచిత రీతిలో నష్టపరిహారం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అన్ని దానల్లో కెల్లా అన్న ధానం గొప్పది



**– ప్రముఖ ఇంజనీర్, లయన్ కొంగ మోహన్**

**హనుమకొండ, (వుదయం ప్రతినిధి) :**

హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్ లోని స్పందన దివ్యాంగుల కేంద్రంలో శనివారం వరంగల్ ఇంజనీర్స్ అసోసియేషన్ సెక్రటరీ లయన్ కొంగ మోహన్ మనువరాలు కొంగ మహాశ్రీ జన్మదిన సందర్భంగా అన్నదానం చేశారు. లయన్ కొంగ మోహన్ మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామి ఇచ్చారు. అన్ని దానల్లో కెల్లా అన్న దానం గొప్పదన్నారు. దివ్యాంగులను సమాజములో చిన్న చూపు చుడొద్దని కోరారు. లైన్స్ క్లబ్ అఫ్ హనమకొండ కార్యదర్శి వివేకానంద, పూర్వ అధ్యక్షులు జి. సత్యనారాయణ రావు, లయన్ ఇమ్మడి క్రిష్ణమూర్తి,స్పందన నిర్వాహకులు సుచరిత రెడ్డి పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు ఘన నివాళులు – అర్పించిన ఎమ్మెల్యే నాయిని



- డిసిసి అధ్యక్షులు ఇనగాల
- డిసిసి భవన్,అంబేద్కర్ కూడలి వద్ద నివాళులు ఘటించి, రాజ్యాంగ ప్రతిజ్ఞ చేసిన ఎమ్మెల్యే లు, డిసిసి అధ్యక్షులు

**హనుమకొండ, (వుదయం జిల్లా ప్రతినిధి) :**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి సందర్భంగా ఈ రోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యులు కేఆర్ నాగరాజు, కూడా చైర్మన్,డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి లతో కలిసి హనుమకొండ డీసీసీ భవన్ లో అంబేద్కర్ చిత్రానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే అంబేద్కర్ జీవిత పోరాటం ప్రతి పౌరుడికి మార్గదర్శకం. ఆయన రచించిన రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలను దేశానికి అందించింది. ఈ విలువలను కాపాడడం మనందరి బాధ్యత. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా పని చేయడం అంబేద్కర్ చూపిన దారిలో నడిచే నిజమైన గౌరవం అని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ ప్రతిజ్ఞా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ,కార్పొరేటర్లు విజయశ్రీ రాజాలీ ,మామిండ్ల రాజు ఇతర ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు .

## గ్రామాల అభివృద్ధి చేస్తుంది..చేసింది కేంద్ర ప్రభుత్వమే..



- కాంగ్రెస్ కి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదు
- మహబూబ్ నగర్ ఎంపీ డి. కె.అరుణ

**గద్వాల, (వుదయం ప్రతినిధి);**

ఆరు గ్యారంటీలతో ప్రజలను నిండా మోసం చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకుంటుందని ఎంపీ డి.కె.అరుణ అన్నారు.గ్రామాల్లో అభివృద్ధి జరిగింది అంటే.. కేవలం కేంద్రం నిధులతో తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పైసా నిధులు రాలేదని తెలిపారు. గత ప్రభుత్వం సర్పంచ్ లతో పనులు చేయించి బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా ఆ బిల్లులు చెల్లించలేదు. ఇంకా అధికారుల చుట్టూ సర్పంచులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా రూపాయి కూడా విడుదల చేయలేదు. స్వయాన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిధులు లేక లక్ష రూపాయల పనికూడా చేయలేక పోతున్నాం అంటున్నారు.అందుకే గ్రామాల అభివృద్ధికి నిధులు ఇచ్చేది మోదీ సర్కార్.గ్రామాల్లో రోడ్లు గుంతలు పడి ఉన్న పట్టించుకోవడం లేదు. అభివృద్ధి కోసం అధికార పార్టీలోకి వెళ్ళామని ఎమ్మెల్యే అంటున్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం అధికార పార్టీకి వెళ్లారా..? సొంత ప్రయోజ

# పారదర్శక నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలి



- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ
- జయశంకర్ భూపాలపల్లి,

**(వుదయం జిల్లా ప్రతినిధి):**

పారదర్శక, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు శనివారం గణపురం మండలంలోని రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులు, స్టేజి 2 అధికారులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహణలో ఏమైనా సందేహాలుంటే సిబ్బంది శిక్షణా తరగతుల్లో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు నిర్వహణలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి చిన్న పొరపాటుకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. 10 వ తేదీన పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తదుపరి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు అదేరోజు చేరుకుని 11వ తేదీన పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఓటు హక్కు వినియోగం రహస్య పద్ధతిలో జరుగుతుందని, బయటికి కనిపించకుండా కంపార్ట్ మెంట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. 11వ తేదీన ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాల్సి ఉంటుందని ముందుగానే అన్ని ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ ప్రారంబానికి ముందు ముగిసిన తదుపరి ఏజెంట్లు సంతకాలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ వంటి గంట వరకు ముగుస్తుందని అప్పటికే ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగానికి వేచి ఉన్నట్టుయితే క్యూ లైన్ వెనుక నుండి ముందు వరకు సీరియల్ నంబర్ల స్లిప్పులు జారీ చేయాలని తెలిపారు. పోలింగ్ ముగిసిన తదుపరి 2 గంటలకు ఓట్లు లెక్కింపు ప్రారంభం కావాలని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డా కుమారస్వామి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ భాస్కర్, మాస్టర్ ట్రైనర్లు ఎస్ శ్రీధర్, బి.రఘునాధ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## విశ్వబ్రాహ్మణ బిడ్డ ఈశ్వర్ చారి గారికి ఘన నివాళులు



**నిర్మల్ జిల్లా ,(వుదయం ప్రతినిధి);**

ఈరోజు మన విశ్వబ్రాహ్మణ బిడ్డ అయినటువంటి సాయి ఈశ్వర్ చారి గారు 42%బీసీ రిజర్వేషన్ కొరకు ఆత్మ బలిదానం చేసుకున్నందువలన మన విశ్వబ్రాహ్మణ సహోదరునకు శోక త ప్త హృదయాలతో నివాళులు అర్పించడం జరిగినది.ఈ విషయంలో అధ్యక్షులు శ్రీ రామోజీ నరేష్ గారు మాట్లాడుతూ ఇకనైనా ఈ బలిదానాలు ఆగాలని రాష్ట్రప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించని ఎడల ఇకపై బీసీ రిజర్వేషన్ ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొండాజి,శ్రావణ్, సుముకవార్ అన్వేష్, మక్తల నర్సింహాచారి,కట్ట నర్సింహాచారి,వంగల అశోక్, దేవరాశెట్టి గణేష్, సుద్దాల సత్యనారాయణ, కట్కోజుల అనిల్,కొండాజీ నవీన్, తదితరులు పాల్గొన్నారు. జై విశ్వకర్మ జై జై విశ్వకర్మ

# అంబేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకం




- గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కే రాజు

**గద్వాల డి.(వుదయం ప్రతినిధి);**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల గద్వాల, వీరాపురం నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వర్ధంతి సభలో పాఠశాల ప్రిన్సిపల్ కే రాజు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమన్నారు. అంబేద్కర్ జీవిత పర్యంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికై కృషి చేశారని ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి శ్రీనివాసులు, శశిధర్, ప్రేమ్ కుమార్, బంగారు తేజ, విజయలక్ష్మి, భీమేష్, రాజేశ్వరి, శ్యామ్, శీను, నాగరాజు, రాజశేఖర్ మసూద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థిగా నాగ మహాలక్ష్మి



**వేంసూర్ ,(వుదయ ప్రతినిధి) ;**

వేంసూరు మండల పరిధిలోని చౌడవరంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నాగ నాగ మహాలక్ష్మి వార్డ్ నెంబర్లు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కలిసి ఎర్రగుంటపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ వేశారు. తనను ఆదరించి గెలిపిస్తే గ్రామాభివృద్ధి చేస్తారని, గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తారని, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చేస్తానని తెలిపారు.

# గద్వాలలో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

**గద్వాల ,(వుదయం ప్రతినిధి):**



అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి బి.రంగారావు మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి మాత్రమే కాదు, స్వతంత్ర భారత దేశ అభివృద్ధి, పురోగతికి పునాది వేసిన మహనీయుడన్నారు. కొంతమంది ఆయనను రిజర్వేషన్ల ఉద్యమకారుడిగా వ్యవహరిస్తారు. ఇది కొంతవరకు నిజమే అయినా, అంతకన్నా ముఖ్యంగా ఆయన దేశంలో రాజ్యాంగం, పాలనాపరిరక్షణ ఆధారిత న్యాయవ్యవస్థకు తండ్రి. అంబేద్కర్ మానవతను పీడించిన జాతి వ్యవస్థపై నిరంతర పోరాటం చేయకపోయింటే భారతదేశం ఇవాళ మనుష్యుల నీతులను లోబడి ఉండేది—అది సమానత్వానికి పూర్తిగా వ్యతిరేకం. ఆయన దూరదృష్టి వల్ల, సామాజిక వెనుకబాటుతనం గణనీయంగా తగ్గింది. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, చమురు, సహజ వనరులు, బొగ్గు, ఉక్కు వంటి ప్రజా రంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణిస్తూ వాటి పునాది వేసిన వాడిగా అంబేద్కర్ గుర్తింపు పొందారు. భారత ఆర్థిక వ్యవస్థ ఇవాళ దృఢంగా నిలబడటానికి ఆయన ఆలోచనల ఆధారంగా రూపొందిన విధానాలే కారణం. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, తన ప్రగతిశీల దృష్టితో, భారతదేశానికి రాజ్యాంగం తయారు చేయడంలో అంబేద్కర్ ని ప్రోత్సహించారు. ఆ బాధ్యతను అంబేద్కర్ అపూర్వ విజయం సాధించారు. ఈరోజు అంబేద్కర్ మరణవార్షికోత్సవాన్ని జరుపుకుంటూ, ప్రజారంగ సంస్థలను బలపరచడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించాలి. తన కాలంలో ఆర్ఎస్ఎస్ ప్రచారం చేసిన కమ్యూనల్ భావజాలం గురించి ఆయన దేశాన్ని హెచ్చరించారు. ప్రస్తుత దేశంలో పెరుగుతున్న మతవిభజన అంబేద్కర్ సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధం. మహిళలు, కార్మికులు ఇవాళ కూడా వివక్షకు, దోపిడీకి గురవుతూనే ఉన్నారు. అయితే అంబేద్కర్ మహిళలు, కార్మికుల హక్కుల కోసం అహర్నిశలు పోరాడారు. మానవ విముక్తికి ఆయన చూపిన స్ఫూర్తిదాయక విలువలను నిజమైన మార్గదర్శకులుగా తీసుకొని, సామరస్యభరితమైన, సమానతతో కూడిన, మతసౌహార్ద భారతదేశ నిర్మాణం కోసం మనం కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో రంగారావు, భూషణ్, వాల్మీకి ఆంజనేయులు, బి కృష్ణ, మస్తాన, మునుస్వామి, శేఖర్, మొదలైన వారు పాల్గొన్నారు

# విద్య కే తొలి ప్రాధాన్యత



- ♦ **ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్,(వుదయం ప్రతినిధి):**

విద్య రంగానికే తాను అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని టిడి గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు తన స్వంత నిధులతో ప్రత్యేకంగా తయారు చేయించిన క్యూ ఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను పొందాలనే లక్ష్యంతోనే ఈ డిజిటల్ స్టడీ మెటీరియల్ ను ఏర్పాటు చేశామని, భవిష్యత్తు కోసం విద్యార్థులు బలమైన పునాదులు నిర్మించుకోవాలని, అందుకోసం నా వంతు సహకారం ఎల్లప్పుడూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ గ్రామీణ వైద్యులు పాఠశాల పూర్వ విద్యార్థి సురేందర్ లక్ష రూపాయల విరాళాన్ని విద్యా నిధికి ఇచ్చి, తాను చదివిన పాఠశాల అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని ఆయన కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సురేందర్ కోరిక మేరకు ఆయన ఇచ్చిన విరాళం తోపాటు అవసరమైతే మరింత నిధులు కేటాయించి టిడి గుట్ట పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, మౌలిక వసతులు, గదుల సదుపాయాలు, స్మార్ట్ లెర్నింగ్ పరికరాలు, అన్నీ కల్పిస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఈ పాఠశాలకు డిజిటల్ బోర్డులను అందించామని,ఆ డిజిటల్ బోర్డుల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా కంటెంట్ నింపించామని, కొత్త పద్ధతుల్లో పాఠ్యాంశాలు అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులు మంచి స్థాయిలో నేర్చుకుంటున్నారు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ, మాకు కార్పొరేట్ స్థాయిలో డిజిటల్ కంటెంట్, మెటీరియల్స్ అందించడం పట్ల చాలా ఆనందంగా ఉందని, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ఇలాంటి అవకాశాలు అరుదు అని అన్నారు. ఎమ్మెల్యే ఇచ్చే సదుపాయాలను ఉపయోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని ఎమ్మెల్యే కి రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం" అని వారు తెలిపారు. ఎమ్మెల్యే మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న శతశాతం విద్యా కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించబడుతోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకై ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవ పట్ల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, మహబూబ్ నగర్ ఫస్ట్ సభ్యులు గుండా మనోహర్,నాయకులు మునీర్, చిన్న ఫక్కు, చంద్రమోహన్, గ్రామీణ వైద్యులు సురేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మజీరాం రాథోడ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ టి చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన కలెక్టర్



**హనుమకొండ, (వుదయం జిల్లా ప్రతినిధి) :**

పున్నేలు క్రాస్ వద్ద ఉన్న స్టాటిక్ సర్వైలెన్స్ టీం (ఎస్ ఎస్ టి) చెక్ పోస్ట్ ను శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు, ఎంసీసీ అమలు, వాహనాల పర్యవేక్షణ, అనుమానాస్పద రవాణా నివారణపై అధికారులు సక్రమంగా పర్యవేక్షణ నిర్వహిస్తున్నారో లేదో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఎస్ ఎస్ టి చెక్పోస్ట్ కు సంబంధించిన రికార్డును పరిశీలించారు. ఎంతమంది సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారని, ప్రతిరోజు వాహన తనిఖీలు చేపడుతున్నారా అని కలెక్టర్ అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, నియమావళి ప్రకారం ప్రతి వాహనాన్ని నిఖార్సుగా తనిఖీ చేసి ఎలాంటి అనుమానాస్పద రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# నేను బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించండి

- ♦ **గ్రామాభివృద్ధి కి తోడ్పడండి**
- ♦ **ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

**గద్వాల , (వుదయం ప్రతినిధి)**



గద్వాల నియోజకవర్గం స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా గట్టు మండల పరిధిలోని చమన్ ఖాన్ దొడ్డి, ఇందువాసి, బోయలగూడెం, చిన్నోనిపల్లి ఆర్ & ఆర్ సెంటర్, మిట్టదొడ్డి గ్రామాలలో తాను బలపరిచిన సర్పంచి అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో అభివృద్ధి చెందాలంటే మా తరపున బలపరిచిన అభ్యర్థులకు గెలిపించాలని కోరారు. అదేవిధంగా గ్రామాలలోని వాల్మీకి మహర్షి, కనకదాసు విగ్రహాలకు పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గట్టు మండలంలో బోయలగూడెం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ సర్పంచులు మనవాళ్లు గెలవాలని అన్నారు. గట్టు మండలంలోని గ్రామాలను గతంలో నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రాంతంలోని ప్రజలు వివిధ ప్రాంతాలకు వలసలుగా వెళ్లేవారు ఇక్కడ కరువు కాటకాలకు నిలయంగా గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే అభివృద్ధికి నోచుకోలేకపోయాయని పేర్కొన్నారు. నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి గట్టు మండల అభివృద్ధికి కృషి చేయడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో వచ్చిన హామీల భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంటు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఐదు లక్షల రూపాయలను మంజూరు చేయించి ఇవ్వడం జరిగింది. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం అందించడం జరిగిందని అన్నారు. భవిష్యత్తులో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు. మీ మీ గ్రామాలలో మేము బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మీ అమూల్యమైన ఓటును నెల 11122025 రోజున ఓటు వేసి వేయించి అత్యధికమైన భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, సింగల్ విండో డైరెక్టర్ మహేష్ రెడ్డి, నాయకులు రామాంజనేయులు, కురుమన్న, బసవరాజ్ గౌడ్, రమేష్, వీరేష్ గౌడ్, షేడ్రిక్ నర్సింహులు, నాగరాజ, తిమ్మప్ప, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు



- ♦ **ఆర్ టి ఓ ఆఫీస్ క్రాస్ నుండి బెస్తం చెరువు మధ్య నిర్మాణాల తొలగింపు**

**వరంగల్, (వుదయం జిల్లా ప్రతినిధి) :**

వరంగల్ పరిధి ఆర్ టి ఓ ఆఫీస్ కూడలి నుండి బెస్తం చెరువు మధ్య అక్రమం గా రోడ్డు కు ఇరువైపుల నిర్మించిన అక్రమ నిర్మాణాలను బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు.

ఈ సందర్భం గా అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఖలీలోద్దిన్ మాట్లాడుతూ ఆర్ టి ఓ క్రాస్ రోడ్ నుండి బెస్తం చెరువు ప్రాంతం లో అక్రమ నిర్మాణాల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్,బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అక్రమంగా నిర్మించిన షెడ్ లను తొలగించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమం లో టి పి ఎస్ అవినాష్,టి పి బి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ కి నివాళులర్పించిన



- ♦ **పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాస్టర్ మధు కుమార్**

**అలంపూర్,(వుదయం ప్రతినిధి);**

జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచం మేధావి, న్యాయ శాస్త్ర కోవిదులు, మానవతా వాది గొప్ప సంఘ సంస్కర్త, స్వాతంత్ర్యం, సమానత్వం, సామాజిక న్యాయాన్ని అందించిన గొప్ప దార్శనికులు బహుముఖ ప్రజ్ఞాశాలి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఐజ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాస్టర్ మధు కుమార్ అ మహనీయుని స్మరిస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పుర ప్రముఖులు, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం ద్వారానే ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు

- ♦ **ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్,( వుదయం ప్రతినిధి);**




భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా మహబూబ్ నగర్ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ,అంబేద్కర్ రాజ్యాంగ దృష్టి లేకపోతే నేటి ప్రజాస్వామ్యానికి ఉన్న బలమైన పునాదులు ఏర్పడేవి కాదు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్య-ఉపాధుల్లో హక్కులు వంటి విలువలను ఆయన భారతదేశ ఆత్మలో నాటారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం, ప్రతి అభివృద్ధి కార్యక్రమం అంబేద్కర్ చూపిన మార్గానికే అనుసరణ అని తెలిపారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి మార్గం సుగమం చేసిన ఆర్టికల్ 3 ను రాజ్యాంగంలో పొందుపరిచిన అంబేద్కర్ దూరదృష్టిని ఎమ్మెల్యే విశేషంగా ప్రస్తావించారు. మహబూబ్ నగర్‌లో పేద, వెనుకబడిన, అణగారిన వర్గాల సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను మరింత వేగవంతం చేస్తున్నాం. విద్య, వైద్యం, సామాజిక భద్రత ఈ మూడు ప్రధాన రంగాల్లో బలమైన అడుగులు వేయడం ద్వారా సమానత్వ సమాజం నిర్మాణం అంబేద్కర్ కలను సాకారం చేయడం మా లక్ష్యం అని ఆయన అన్నారు.తరువాత డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తో కలిసి డిసిసి అధ్యక్షులు ఎం.సంజీవ్ ముదిరాజ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రాజ్యాంగమే మన హక్కుల రక్షకుడు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతఅని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్.పి. వెంకటేష్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం ఇన్‌చార్జ్ గోనెల శ్రీనివాసులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అవేజ్, మీడియా ఇన్‌చార్జ్ సిజే బెనహర్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, ఐఎన్టీయూసీ రాములు యాదవ్, శాంతన్న యాదవ్, గోపాల్ యాదవ్, నవనీత, ఏర్పుల నాగరాజు, అజ్మత్ అలి, ఫయాజ్, జహీర్, ప్రవీణ్ కుమార్, ముహమ్మద్ రియాజుద్దీన్, అబ్దుల్ హక్, ఫైసల్, చంద్రమోహన్, మోయిజ్, చర్ల శ్రీనివాసులు, పులిజాల రవికిరణ్, వేణుగోపాల్, వెంకటలక్ష్మి, అలీం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియలో అంతరాయాలు లేకుండా ఏర్పాట్లు చేయాలి



- ♦ **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి,(వుదయం జిల్లా ప్రతినిధి):**

రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా, శనివారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల మరియు పలిమెల మండలాలకు సంబంధించి రెండవ దశ ర్యాండమైజేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విధులు కేటాయించిన పోలింగ్ సిబ్బందికి సకాలంలో నియామక ఉత్తర్వులు అందేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అంతరాయాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 9వ తేదీన అన్ని మండలాలలో పోలింగ్ విధులు నిర్వహించే పిఓ, ఓపిఓలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో శిక్షణ ఎంతో కీలకమైందని, శిక్షణా తరగతులకు హాజరు కావడం తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లి 26 సర్పంచ్, 216 వార్డులు, చిట్యాల 26, 218, పలిమెల 8, 62, టేకుమట్ల 25, 198 మొత్తం 85 గ్రామ పంచాయతిలకు, 694 వార్డులకు కలిపి 20 శాతం రిజర్వ్ సిబ్బందితో కలిపి 833 పిఓలకు, 924 ఓపిఓలకు, మొత్తం 1757 మందికి రాష్ట్ర ఎన్నికల సంగం పోర్టల్ నందు ర్యాన్డ మైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ శ్రీలత, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హోం గార్డులు సేవలు అందిస్తూ పోలీసు శాఖకు అండగా నిలుస్తున్నారు



- ♦ **జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**జయశంకర్ భూపాలపల్లి, (వుదయం జిల్లా ప్రతినిధి):**

భూపాలపల్లి జిల్లాలో మొత్తం 104 మంది హోం గార్డులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు బలమైన అండగా నిలుస్తున్నారని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు భూపాలపల్లి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 63వ హోం గార్డ్ రైజింగ్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లాలో మొత్తం 104 మంది హోం గార్డులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు బలమైన అండగా నిలుస్తున్నారు. మన దేశంలో 1946లో బాంబేలో ఏర్పాటు చేసిన హోం గార్డ్ వ్యవస్థ దేశవ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు అత్యవసర పరిస్థితులలో స్పందన, బందోబస్తు విధులు, ప్రజా రక్షణ చర్యల్లో హోం గార్డుల సేవలు అమూల్యం" అని పేర్కొన్నారు. తనిఖీలు, చట్టం సరళి నిర్వహణ, బందోబస్తు విధుల్లో ప్రతిభ కనబరిచిన 10 మంది హోం గార్డులను ఎస్పీ ప్రశంసపత్రాలతో అభినందించారు.అలాగే, ఇటీవల మరణించిన హోం గార్డ్ శంకర్ కుటుంబానికి ₹15,000/ రూపాయల చెక్కును అందజేశారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వాలీబాల్ మరియు ఇతర క్రీడా పోటీల్లో విజయం సాధించిన సిబ్బందికి ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేశారు. క్రీడా కార్యక్రమాలు హోం గార్డులలో శారీరక సామర్థ్యం మానసిక ఉల్లాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు.ఈ వేడుకల కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డిఎస్పీ సంపత్ రావు, డిఎస్పీ సూర్యనారాయణ, సిఐ నరేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, వెల్ఫేర్ & హోం గార్డ్స్ ఆర్ఐ పూర్ణచందర్, ఆపరేషన్ ఆర్ఐ కాశీరాం, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సంఘం ప్రతినిధి మర్కాల యాదిరెడ్డి, హోం గార్డ్ సిబ్బంది మరియు ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల మాకు డ్రిల్

- ♦ **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట టౌన్,( వుదయం ప్రతినిధి);**



నారాయణపేట జిల్లా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ,అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో నారాయణపేట సర్కిల్ పరిధిలోని పోలీసులకు ప్రత్యేక సాయుధ బలగాలతో కలిసి విస్తృత స్థాయిలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, పోలీసు సిబ్బందికి మాబ్ కంట్రోల్ లో అనుసరించాల్సిన విధానాలు, కార్యాచరణ ప్రణాళికలు, గందరగోళ లేదా అత్యవసర పరిస్థితులు నెలకొన్నప్పుడు తక్షణ స్పందన సామర్థ్యం, ప్రజల ప్రాణ రక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వబడిందని ఆయన పేర్కొన్నారు. మాక్ డ్రిల్ లో భాగంగా ఫుట్ ఫార్మేషన్, టీమ్ కోఆర్డినేషన్, హెచ్చరిక విధానాలు, చట్టపరమైన చర్యల అమలు పద్ధతులు వంటి అంశాలను సిబ్బంది ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. ఈ శిక్షణ ద్వారా పోలీసులు అత్యవసర పరిస్థితుల్లో మరింత చాకచక్యంగా, సురక్షితంగా ఎలా స్పందించాలో అవగాహన పొందారని ఎస్పీ తెలిపారు.ప్రజల భద్రత పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, ప్రొఫెషనలిజం, సేవాభావంతో మాబ్ కంట్రోల్ నిర్వహించగలగాలి అని తెలిపారు. ఇలాంటి మాక్ డ్రిల్లులు క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా సిబ్బంది స్పందనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు స్మోక్ గన్స్ మాబ్ పై ఫైర్ చేశారు మరియు ఫైర్ ఇంజన్ ద్వారా మాబ్ పై వాటర్ ను ఎలా ఫైర్ చేయాలి, అనంతరం వేపెన్స్ తో ఫైర్, ఎలాంటి పరిస్థితుల్లో ఏ విధమైన ఫైర్ వాడాలి అనే అంశాలను లైవ్ గా డెమో చేసి చూపించారు. దీనితో పోలీసు సిబ్బంది అనుభవం మరింత పెరిగిందని అధికారులు తెలిపారు.ఈ మాక్ డ్రిల్ లో అదనపు ఎస్పి రియాజ్ హూల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివ శంకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, రాముడు, నరేష్, సునీత, ఆర్ఎస్ఐ లు శివశంకర్, మద్దయ్య, కానిస్టేబుళ్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిలో భాగస్వామ్యం కావడమే మా దినచర్య



- ♦ **ఎమ్మెల్యే నాయిని**
- ♦ **31వ డివిజన్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని, కార్పొరేటర్ మామిండ్ల రాజు**

**హనుమకొండ, (వుదయం ప్రతినిధి) :**

హంటర్ రోడ్ హనుమకొండ.అభివృద్ధి పనుల్లో భాగంగ ఈ రోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ డివిజన్ హంటర్ రోడ్ మహింద్ర షోరూం వద్దగల కాలనీలో సిసి రోడ్లు, సిసి డ్రైన్ల నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతు నియోజకవర్గంలోని ప్రతి వాడా ప్రతి గల్లి అభివృద్ధి చేసే విషయంలో కట్టుబడిఉన్నామని అన్నారు,గతంలో ఏ ఎమ్మెల్యే ఈ వాడలకు వచ్చిన దాఖాలాలు లేవని ఎవ్వరు ఇక్కడి ప్రజలను పట్టించుకోలేదని అన్నారు.ప్రజాపాలనలో అభివృద్ధి విషయంలో మేము అలాంటి నిర్లక్ష్యం చెయ్యమని దానికి ఈ రోజు నలభై లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చెయ్యడమే సాక్ష్యం అని అన్నారు, ప్రతీ రోజు అభివృద్ధిలో భాగాస్వామ్యం కావడమే మా దినచర్య అని తెలియజేశారు,కాలని వాసులందరు సహకరించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,కాలనీ ప్రజలు,అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి

**జయశంకర్ భూపాలపల్లి,(వుదయం జిల్లా ప్రతినిధి):**



మహదేవపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం ముందు శనివారం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, మహాదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం వల్లనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు అగ్రవర్ణ పేదలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు అలాగే ఈ దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి సమాజానికి దిశా నిర్దేశం చూపిన మహనీయులని కొనియాడారు ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మాజీ కోప్షన్ షైబొద్దీన్, మీర్జా అక్తర్ అహ్మద్ బెగ్, సాగర్ల రాజు. దళిత సంఘ నాయకులు నల్లబుగ సమ్మయ్య. ఆతుకూరి సారయ్య. కన్నూరి గట్టయ్య. కన్నూరి శ్రీనివాస్. నల్లబుగ దేవరాజు.రాసపల్లి లక్ష్మణ్ . బాన్సోడ మోహన్ తదితరులు పాల్గొన్నారు

# చలి తీవ్రతతో వృద్ధులు చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు అవసరము

- హనుమకొండ డిఎంహెచ్ఓ ఏ అప్పయ్య

**హనుమకొండ, (వుదయం జిల్లా ప్రతినిధి) :**

పెరుగుతున్న చలి తీవ్రత వలన, వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. చలి తీవ్రత క్రమంగా పెరగడం, ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.



డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

**చలికాలంలో వచ్చే వ్యాధులు:**

దగ్గు, ముక్కు కారడం, శ్వాస సంబంధిత సమస్యలు, గొంతునొప్పి, తుమ్ములు వస్తాయి. చిన్నారుల ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడే నిమోనియా బారిన పడే అవకాశం ఉంది. వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్, ప్రోటో జోవన్ల వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. గాలి ద్వారా సూక్ష్మజీవులు శరీరంలో ప్రవేశించి తెల్ల రక్త కణాలను నిర్వీర్యం చేయడంతో రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. పిల్లలు, వృద్ధులు, శ్వాస కోశ సంబంధిత వ్యాధికి గురై ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది.

**పాటించాల్సిన జాగ్రత్తలు:**

చిన్నపిల్లలకు స్వెటర్లు, చెవులకు టోపీ, కాళ్లు, చేతులకు సాక్సులు, గ్లౌసులు వేయాలి. నెల వయసుగల చిన్నారులను తల్లి పొత్తిళ్లలో పడుకో పెట్టాలి. ఉదయం పూట ఎండలో కాసేపు పట్టుకొని ఉండాలి. వృద్ధులు ఉదయం మరియు రాత్రి ప్రయాణాలు చేయొద్దు. పిల్లలకు అవసరమైన టీకాలు ఇప్పించాలి. పిల్లలు చలిలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఆటలు ఆడనీయరాదు. ముఖ్యంగా ఆస్తమా వ్యాధి ఉన్న వారు చలి గాలిలో గల తేమకు గురి కాకుండా జాగ్రత్త పడాలి. రాత్రి వేళలో చల్లగాలి రాకుండా ఇంట్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. వాకింగ్ కు వెళ్ళే వారు చలి ఎక్కువగా ఉన్నప్పుడు చెవులను కప్పి ఉంచేలా తలకు మంకీ క్యాప్ లేదా మఫ్లర్ లాంటివి వాడాలి. ద్విచక్ర వాహనదారులు చలి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణం చేసినట్లైతే చేతులకు గ్లౌసులు, హెల్మెట్, స్వెటర్లు ధరించాలి. మూడు పూటలు వేడి వేడి ఆహారం తీసుకోవాలి.



# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

**రాయపర్తి , (వుదయం ప్రతినిధి) :**

భారత రాజ్యాంగ నిర్మాత, సమానత్వ సమాజానికి శిల్పి, మహానుభావుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69 వర్ధంతి ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలో బిఆర్ అంబేద్కర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల కమిటీ అధ్యక్షులు దళితరత్న అయిత మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దళితరత్న అయిత యాకయ్య విచ్చేసి భారత రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆధునిక భారతానికి బాటలు వేసిన మహోన్నత నాయకుడని, ఆయన చూపించిన బౌద్ధిక స్ఫూర్తి యువతకు మార్గదర్శకమంటూ పేర్కొన్నారు.సమాజంలోని ప్రతి వ్యక్తికి సమాన హక్కులు సంపాదించిపెట్టడానికి జీవితమంతా పోరాడిన దృఢ సంకల్పం అంబేద్కర్దేనని, ఆయన రాజ్యాంగ నిర్మాణంలో ప్రదర్శించిన దూరదృష్టి ప్రపంచానికి ఆదర్శమని ఆమె అన్నారు. విద్య మాత్రమే వ్యక్తిని శక్తివంతం చేసే సాధనమని అంబేద్కర్ విశ్వసించారని, ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని ప్రొఫెసర్ జ్యోతి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జిల్లా సభ్యులు జర్నలిస్ట్ మాచర్ల పరమేష్ మాదిగ జర్నలిస్టుల మండల అధ్యక్షులు గిద్దే ఎల్లయ్య, మెప్మా మెప్మా మండల అధ్యక్షులు సోడపు శ్రీనివాస్, మైనార్టీ మండల అధ్యక్షులు ఎండి అఫ్రోజ్ ఖాన్, ఎండి పేరోజ్ ఖాన్, వెటర్నరీ అధికారి చిలుమల్ల కృష్ణ, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ గారె నరేష్, మైస మహేందర్, చెడుపాక నాగేష్, గిద్దె రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

# పింగిళి కళాశాలకు క్రికెట్ కిట్ అందజేత



**హనుమకొండ, (వుదయం ప్రతినిధి) :**

వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు క్రికెట్ కిట్ ను కళాశాల గణిత శాస్త్ర విభాగాధిపతి సాహసి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా. బి.మాధవి అందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి విద్యార్థుల కోసం క్రికెట్ కిట్ ను అందించిన డా. బి.మాధవి కి అభినందనలు తెలుపుతూ , విద్యార్థినిలు చదువులోనూ, క్రీడలలోనూ రాణించాలని, ఉత్తములుగా ఎదుగుతూ కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ బాధ్యులు శివ శంకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక దృఢత్వాన్ని కలుగజేస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ఫిజికల్ డైరెక్టర్ జి. జ్యోతి, అకాడమిక్ కో ఆర్డినేటర్ డా. ఎం.అరుణ , లయన్ కవితక్రీడా విభాగం సభ్యులు ఎస్.మధు, డా. పి.పద్మ,డా.యుగంధర్, కళాశాలఅధ్యాపకులు, శ్రీనివాస్ రెడ్డి,కృష్ణ, రాజ్ కుమార్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి క్వింటా బియ్యం పంపిణీ



**మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్ కుమార్.**

**ఖానాపురం, (వుదయం ప్రతినిధి):**

మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన నారగాని సతీష్ ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందగా మృతుని కుటుంబాన్ని మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ బృందంతో కలిసి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి మృతుని కుటుంబానికి సొసైటీ పిఏసి చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్ పంపించిన క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు యాకూబ్ పాషా, నాయకులు ఎస్.కె మౌలానా, లాదినేని ఎల్లయ్య, పసునూరి రాములు, నారగాని వెంకటేశం, వేల్పుల లింగయ్య, చేవల సత్యం, నారగాని పరమేష్, పురుషోత్తం, వేణు, జానీ, రాజు, రమేష్, ప్రభాకర్, శ్రీను, ఐలయ్య, ఇక్బాల్, సంజీవ, పాక ఐలయ్య, వీరేందర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# జిపి ఎన్నికలను సజావుగా నిర్వహించాలి



- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, (వుదయం ప్రతినిధి) :**

రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా ప్రశాంతమైన వాతావరణం నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారుల ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం కాజీపేట ఏసీపీ కార్యాలయంలో తనిఖీ చేశారు. ఈరోజు ఉదయం కార్యాలయానికి చేరుకున్న పోలీస్ కమిషనర్ కు కార్యాలయ సిబ్బంది అధికారులు పూల మొక్కను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ స్పెషల్ గ్రేవ్,ఎస్టీ. ఎస్సీ, పెండింగ్ కేసులతో పాటు, కార్యాలయం సంబంధించిన పలు రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. చివరగా కాజిపేట్ కాజీపేట డివిజన్ పోలీస్ అధికారులతో సిపి మాట్లాడుతూ రాబోవు ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల నిబంధనలను అతిక్రమించే వారిపై అలసత్వం వహించవద్దని వరంగల్ సిపి అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, కాజీపేట ఏసీబీ ప్రశాంత్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు పుల్యాల కిషన్, సుధాకర్ రెడ్డి, చేరాలు, శ్రీధర్ రావు, పులి రమేష్ పాల్గొన్నారు.

# ఏబివిపి ఆధ్వర్యంలో సామాజిక సమరసత్త దివాస్



**నారాయణపేట ,(వుదయం ప్రతినిధి);**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని ద్వారక హై స్కూల్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో సామాజిక సమరసత దివాస్ సెమినార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్త తపస్సు జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నవ నిర్మాత,భారతదేశ ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత కీర్తి శిఖరం డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ అన్నారు.భారతదేశంలో అంటరానితనం, సామాజిక అసమానతల నిర్మూలనకు తన జీవితాన్ని అంకితం చేసిన యోధుడు భారత స్వతంత్ర సమరయోధుడు రాజ్యాంగ పితామహుడు అన్నారు. చిన్నతనం నుండి అనేక అవమానాలు పడుతూ ఈ దేశంలో కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్యం ఉండాలని ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు సమానమైన భావించిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన జీవిత చరిత్ర విద్యార్థులకు మరోసారి గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ నరేష్, నగర కార్యదర్శి సతీష్, ఇంతియాజ్, చరణ్ రెడ్డి, ఓంకార్,కళాశాల అధ్యక్షులు, తరుణ్, అరుణ్, సంతోష్, ఆదర్శ్,ఏబీవీపీ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ముఖ్య విన్నపం

- బి ఆర్ ఎస్ పార్టీ కి సహరించండి. కట్రం స్వామిదొర

**అశ్వారావుపేట,( వుదయం ప్రతినిధి );**

అశ్వారావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు తెలియజేయనైనది. ఏమనగా. స్థానిక ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ప్రతి గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కట్రం స్వామి దొర పిలుపు మేరకు బి ఆర్ ఎస్. పార్టీ బలపరిచిన సర్పంచ్ మెంబర్లకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది.ప్రతి టిడిపి కార్యకర్త సహకరించవలసిందిగా పార్టీ ఇంచార్జ్ ప్రకటించడం జరిగింది.



# ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళి

**దమ్మపేట, (వుదయం ప్రతినిధి ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండల మందలపల్లి రింగ్ సెంటర్ లో (శనివారం)భారత స్వాతంత్ర సమరయోధుడు, రాజ్యాంగ నిర్మాత,దళిత బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత భారతరత్న గౌరవ శ్రీ,బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించిన ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాల నాయకులు.ఈ కార్యక్రమంలో తంబళ్ల రవి,కొలికపొగు కాంతారావు,బండారి సూర్యనారాయణ, చెన్నారావు,ప్రసాద్,వేణు తదితరులు పాల్గొన్నారు.



# 63వ సివిల్ డిఫెన్స్ రైజింగ్ డే

SCR సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ & DGM(G) శ్రీ ఉదయనాథ్ కోట్లా గారికి ప్రతిష్టాత్మక డైరెక్టర్ జనరల్ డిస్క్ (బ్రాంజ్) పురస్కారంసౌత్ సెంట్రల్ రైల్వే సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ గర్వంగా ప్రకటిస్తోంది సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ మరియు డిప్యూటీ జనరల్ మేనేజర్ (G) అయిన శ్రీ ఉదయనాథ్ కోట్లా గారు*, 63వ సివిల్ డిఫెన్స్ రైజింగ్ డే సందర్భంగా గృహ మంత్రిత్వ శాఖ (MHA) ప్రదానం చేసే *డైరెక్టర్ జనరల్ డిస్క్ పురస్కారం అందుకున్నారు.జోన్ వ్యాప్తంగా సివిల్ డిఫెన్స్ సిద్ధత, సమన్వయం, మరియు విపత్తు నిర్వహణలో ఆయన చూపిన అసాధారణ నాయకత్వం మరియు అంకితభావం కారణంగా ఈ అవార్డు లభించింది. ఆయన మార్గదర్శకత్వంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, రిఫ్రెషర్ మరియు బేసిక్ ట్రైనింగ్ సెషన్స్, భద్రతా ప్రదర్శనలు వంటి విస్తృత కార్యక్రమాలు నిర్వహించబడగా, ఇవి SCR మరియు IRIDM/SBCలో 18,000కుపైగా రైల్వే సిబ్బందికి ప్రయోజనం చేకూర్చాయి.జోన్‌లోని కీలక కేంద్రాల్లో 10వ బెటాలియన్ NDRF, BD టీములు, RPF, మరియు వైద్య విభాగాలతో కలిసి విశాల స్థాయి మాక్ డ్రిల్లులను సమర్థవంతంగా సమన్వయం*చేయడంతో పాటు, తెలంగాణ OCTOPUS నిర్వహించిన కౌంటర్‌టెర్రర్ డ్రిల్లులు, అలాగే కాచిగూడ, రాయచూర్, ఔరంగాబాద్ లలో నిర్వహించిన ఆపరేషన్ షీల్డ్ (సిందూర్) వంటి కీలక వ్యాయామాలలో SCR చురుకైన భాగస్వామ్యాన్ని ఆయన నిర్ధారించారు. వీటితో సంక్షోభ పరిస్థితుల్లో ప్రతిస్పందన సామర్థ్యం గణనీయంగా పెరిగింది.

శ్రీ కోట్లా గారు సివిల్ డిఫెన్స్ రంగంలో అనేక నూతన కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. ఆయన ఆధ్వర్యంలో మొదటి జోనల్ సివిల్ డిఫెన్స్ కాన్ఫరెన్స్ విజయవంతంగా నిర్వహించబడింది. అంతేకాక, *SCR Civil Defence Web Portal* ప్రారంభించి డిజిటల్ సమన్వయాన్ని, విభాగాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేశారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు మరియు ట్రైనింగ్ సెంటర్లలో అగ్ని మాపక శిక్షణ, ఫస్ట్ ఎయిడ్, CPR అవగాహన కార్యక్రమాల ద్వారా అత్యవసర స్పందన సామర్థ్యాలను గణనీయంగా పెంచారు. అతని దూరదృష్టి నాయకత్వం, సృజనాత్మకత, మరియు నిబద్ధత సివిల్ డిఫెన్స్ వాలంటీర్లకు ప్రేరణగా నిలుస్తూ, రైల్వే భద్రతా రంగంలో SCR స్థాయిని మరింత ఎత్తుకు తీసుకెళ్లింది.



**శ్రీ ఉదయనాథ్ కోట్లా గారి సందేశం:**

"ఈ గౌరవం SCR సివిల్ డిఫెన్స్ టీమ్ మొత్తం కృషికి ప్రతిబింబం. సమాజ సేవ మరియు సిద్ధతను మరింత బలోపేతం చేయడానికి మా ప్రయత్నాలు కొనసాగుతాయి." SCR సివిల్ డిఫెన్స్, జాతీయ భద్రత మరియు రెసిలియెన్స్‌ను మరింత బలోపేతం చేయడంలో తన కట్టుబాటును పునరుద్ఘాటిస్తోంది.

సౌత్ సెంట్రల్ రైల్వే సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్

# ఎన్నికల నిర్వహణపై శిక్షణ



**తుంగతుర్తి( శాలిగౌరారం),(వుదయం ప్రతినిధి):**

ఈనెల 11వ తేదీన జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కొరకు శాలిగౌరారం మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్లో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.... ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల నియమావళిని ప్రిసైడింగ్ అధికారులకు వివరించారు. ప్రిసైడింగ్ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలతో పాటు తగు సూచనలను చేయడం జరిగిందని, అనంతరం టిఓటిలు గోపి, చంద్రారెడ్డి తదుపరి శిక్షణా కార్యక్రమాన్ని కొనసాగించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మందుల సైదులు, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.



# గౌతమ్ బుద్ధ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదకు అంతక్రియలు



**దమ్మపేట ,(వుదయం ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన నిరుపేద సుంకెల్లి వెంకటేశ్వర రావు (50) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా , దమ్మపేట మండలానికి చెందిన గౌతమ్ బుద్ధ సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాలడుగు అబ్బులు మాట్లాడుతూ మందలపల్లికి చెందిన అజీమ్ తన జీవన భృతి కోసం ఏర్పాటు చేసుకున్న చికెన్ షెడ్ లో అనాదలకు ,నిరుపేదలకు అంత్యక్రియలు చేయడానికి అవసరమైన సామాగ్రి , ఫ్రీజర్ బాక్స్ లను సిద్ధంగా ఉంచారని తెలిపారు. అదేవిధంగా వాటికి తన చికెన్ షెడ్ లో ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు. అంత్యక్రియలు అనంతరం అవసరమైన భోజన సదుపాయాలు దాతలు దేవరపల్లి అజయ్ కుమార్ ,మందలపల్లికి చెందిన ఆటో యూనియన్ సభ్యులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఎవరైనా దాతలు స్వచ్ఛందంగా సేవచేయాలనుకునే వారు సంస్థ సభ్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు షేక్ అజీమ్ ,రొయ్యల కుమార్ ,గంగాధర శ్రీనివాస్ , షేక్ బుడే , తిమోతి ,జాను ,తెలంగాణ శ్రీను ,తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి



**కోదాడ ,(వుదయం);**

కోదాడ పట్టణం లో భారత రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి పాల్గొని వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు , వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బషీర్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిలు కాంపాటి శ్రీను, పిడతల శ్రీను, మాజీ కౌన్సిలర్ గంధం యాదగిరి, కుడుముల లక్ష్మీనారాయణ, గంధం పాండు ,పంది తిరుపతయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు చింతాబాబు, గుండెపంగు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పీఓ లకు ఒక్కరోజు శిక్షణ




**జన్నారం, (వుదయం విలేకరి);**

జన్నారం మండల ఎన్నికల అధికారులు పీవోలకు ఒక్క రోజు శిక్షణను ఇచ్చారు.గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శనివారం రోజున స్థానిక పైడిపల్లి గార్డెన్ లో ఎంపీడీవో ఉమర్ షరీఫ్ ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు.డిసెంబర్ 11న అన్ని గ్రామాలలో జరిగే స్థానిక ఎన్నికలలో సర్పంచ్ , వార్డ్ మెంబర్ బ్యాలెట్ పత్రాలను అందించడంలో జాగ్రత్తగా ఉండాలని అలాగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్,ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

# ఓటు హక్కును స్వేచ్ఛ గా వినియోగించుకోవాలి



**జన్నారం, (వుదయం విలేకరి ) ;**

ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని మంచిర్యాల డిసిపి ఎగిడి భాస్కర్, ఏసీపీ ప్రకాష్ లు సూచించారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలో శనివారం రోజున పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును స్వేచ్ఛగా తమకు నచ్చిన అభ్యర్థికి వేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజల్లో భయం పోగొట్టి ధైర్యాన్ని నింపెందుకే ఈ కవాతు నిర్వహించామని ఎవరి ప్రలోభాలకు తలగకుండా ఓటు వేయాలని ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట సిఐ డి. రమణమూర్తి,జన్నారం,దండేపల్లి ఎస్సైలు గొల్లపెల్లి అనూష,తహిసనోద్దీన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ఖాళీ కడుపుతో అరటిపండు తింటే ఏమవుతుంది..?



ఉదయం ఖాళీ కడుపుతో అరటిపండు తింటే ఏమవుతుంది..? అరటిపండులో ఉండే శక్తి, ఫైబర్, ముఖ్యమైన పొటాషియం వల్ల అది గుండెకు ఎంత మంచిదో తెలుసా? బరువు తగ్గడానికి, జీర్ణశక్తి పెరగడానికి ఇది ఎలా ఉపయోగపడుతుంది? అరటిపండ్లు అత్యంత పోషక విలువలున్న పండ్లలో ఒకటి. వీటిలో ఉండే ఖనిజాలు, ఫైబర్, సహజ చక్కెరలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. అయితే ఉదయం ఖాళీ కడుపుతో అరటిపండు తినడం మంచిదా..? కాదా..? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఉదయం ఖాళీ కడుపుతో అరటి పండు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలుస్తోంది. పోషకాహార నిపుణురాలు డాక్టర్ శిల్పా అరోరా ప్రకారం.. అరటిపండ్లు పొటాషియం, ఫైబర్, మెగ్నీషియం యొక్క అద్భుతమైన మూలం. అందుకే ఇవి రోజువారీ శరీర అవసరాలకు తగిన పోషకాలను అందిస్తాయి. అరటి పండులో దాదాపు 98 కేలరీలు, 4 గ్రాముల ఫైబర్ ఉంటాయి. ఉదయం దీన్ని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. ముఖ్యంగా ఇందులో ఉండే ఫైబర్ ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అతిగా తినాలనే కోరికను తగ్గిస్తుంది. ఇది బరువు నియంత్రణకు కూడా దోహదపడుతుంది. అరటిపండ్లలో కరిగే ఫైబర్ పెక్టిన్ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఉబ్బరం, అసిడిటీ వంటి కడుపు సమస్యలను తగ్గిస్తాయి. అరటిపండుతో పాటు గుప్పెడు నట్స్ కలిపి తినడం మంచిది. అరటిపండులోని ఫైబర్, చక్కెర రక్తంలో కలిసే ప్రక్రియను నెమ్మదిస్తుంది. దీని ద్వారా ఆరోగ్యకరమైన రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. అరటిపండ్లలో పొటాషియం, మెగ్నీషియం అనే రెండు ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. 2023 పరిశోధన ప్రకారం.. పొటాషియం శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది రక్తపోటును తగ్గిస్తుంది. దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే ఉదయం ఖాళీ కడుపుతో అరటిపండును తీసుకోవడం అనేది కండరాలు, నరాల పని తీరును మెరుగుపరచడంతో పాటు మీ పేగు ఆరోగ్యాన్ని, జీవక్రియను పెంచేందుకు ఒక మంచి మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

## ఈ పానియం తాగితే.. ఆరోగ్యానికి రక్షణ ఉన్నట్లే!

ఆరోగ్యకరమైన జీవితాన్ని కోరుకోని వారుండరంటే అతిశయోక్తి కాదు. అయితే అందుకు జీవనశైలిలో కొన్ని ముఖ్యమైన మార్పులు చేర్చుకోవల్సి ఉంటుంది. వీటితోపాటు చిటికెడు పసుపు కలిపిన పాలు కూడా చేర్చుకోవాలి. ఆరోగ్యకరమైన జీవితానికి ఈ పాలు తాగడం చాలా అవసరం. పసుపు కలిపిన పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి.పాలల్లో కాల్షియం సమ ద్ధిగా ఉంటుంది. రోజూ పాలు తాగడం వల్ల శరీరంలో కాల్షియం లోపాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే పాలలో పెద్ద మొత్తంలో పొటాషియం కూడా ఉంటుంది. పొటాషియం ఆరోగ్యానికి మేలు చేసే ఒక ముఖ్యమైన పోషకం. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి పాలను రోజువారీ ఆహారంలో తప్పక చేర్చుకోవాలి.



పాలు అనేక ఆరోగ్య సమస్యలను నయం చేయడంలో సహాయపడతాయి. ఇది మాత్రమే కాదు పసుపు కలిపిన పాలు తాగడం వల్ల మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. మీరు రాత్రిపూట నిద్ర పట్టడంలో ఇబ్బంది పడుతుంటే, ప్రతి రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు కలిపి తాగడం మంచిది. ఇది అనేక ఆరోగ్య సమస్యల నుంచి బయటపడటానికి సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో పసుపు ప్రయోజనకరంగా ఉంటుంది. పసుపు కలిపిన పాలు రోజూ తీసుకుంటే మీరు అనారోగ్యానికి గురికారు. అనారోగ్యం సమయంలో దీనిని తాగడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

## ఒకే ఒక్క ఆకుతో ఆ సమస్యలకు చరమగీతమే..

భారతదేశంలో తమలపాకులను శతాబ్దాలుగా ఉపయోగిస్తున్నారు. చాలామంది భోజనం తర్వాత వీటిని నములుతారు.. అయితే.. తమలపాకులకు ఆరోగ్యం – మతపరమైన ప్రాముఖ్యత కూడా ఉంది. పూజ నుండి ఆహారం వరకు ప్రతి దానిలోనూ తమలపాకులను చేర్చుతారు. ఈ ఆకులలోని యాంటీ బాక్టీరియల్ – యాంటీ ఫంగల్ లక్షణాలు శరీరాన్ని ఆరోగ్యంగా మారుస్తాయి. భారతదేశంలో తమలపాకులను శతాబ్దాలుగా ఉపయోగిస్తున్నారు. చాలా మంది భోజనం తర్వాత వీటిని నమిలి తింటారు. అయితే.. తమలపాకులకు ఆరోగ్యం – మతపరమైన ప్రాముఖ్యత కూడా ఉంది. పూజ నుండి ఆహారం వరకు ప్రతిదానిలోనూ తమలపాకులను చేర్చుతారు. ఆకుపచ్చగా మెరుస్తూ ఉండే సువాసనగల తమలపాకు నోటి పరిశుభ్రతకు మాత్రమే కాకుండా శరీర ఆరోగ్యానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.. కానీ చాలా సార్లు మనం దీనిని సంప్రదాయంలో ఒక భాగంగా మాత్రమే పరిగణిస్తాము. నిజానికి, ఈ చిన్న ఆకులో శరీరాన్ని ఫిట్‌గా ఉంచే అనేక లక్షణాలు దాగున్నాయి. తమలపాకులలో విటమిన్ సి, థయామిన్, నియాసిన్, రిబోఫ్లేవిన్, కెరోటిన్, కాల్షియం, ఫైబర్, ప్రోటీన్లు, యాంటీఆక్సిడెంట్లు సమ ద్ధిగా ఉంటాయి. వీటిలో క్యాంపియోన్, బీటెల్ ఫినాల్ వంటి రసాయన భాగాలు కూడా ఉన్నాయి.. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పూర్వ కాలంలో తమలపాకు తినడం ప్రాముఖ్యత కేవలం సంప్రదాయం మాత్రమే కాదు.. దానికి వైద్యపరమైన కారణాలు కూడా ఉన్నాయంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. తమలపాకును సరైన పరిమాణంలో, సరైన పద్ధతిలో తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. మనం ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉండగలము. భోజనం తర్వాత తమలపాకు తినడం కొత్త సంప్రదాయం కాదు. తమలపాకులోని సహజ పదార్థాలు జీర్ణవ్యవస్థ సజావుగా పనిచేయడానికి సహాయపడతాయి. కాబట్టి పురాతన కాలం నుండి తమలపాకును వినియోగిస్తున్నారు. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. ఉబ్బరం, ఆమ్లత్వం –గ్యాస్ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. మారుతున్న వాతావరణం అనేక ఆరోగ్య సమస్యలను తెస్తుంది. తమలపాకులోని యాంటీఆక్సిడెంట్ –యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శ్వాసకోశంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. వేడి నీటిలో ఆకులను మరిగించి ఆవిరి పీల్చడం వల్ల కఫం సడలుతుంది.. దీంతో శ్వాస తీసుకోవడం సులభం అవుతుంది. మీరు అలసిపోయినట్లు, చిరాకుగా లేదా నిరాశగా అనిపిస్తే, తమలపాకు తినడం వల్ల మీ మనస్సు ప్రశాంతంగా, రిఫ్రెష్ గా ఉంటుంది. ఆకులలోని కొన్ని సహజ రసాయనాలు మెదడులోని ఎసిటైల్కోలిన్ అనే పదార్థాన్ని సమతుల్యం చేస్తాయి. మీ మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఈ ఆకులలోని యాంటీ బాక్టీరియల్ – యాంటీ ఫంగల్ లక్షణాలు శరీరంలోని క్రిములను చంపుతాయి. ఇది దుర్వాసన, చిగుళ్ల వాపును తగ్గిస్తుంది. ఇంకా, ఇది క్రిమిసంహారక మందుగా పనిచేస్తుంది.. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది.



# పవర్‌ఫుల్ బ్రహ్మాస్త్రం బీట్‌రూట్

ఈ శీతాకాలంలో మీరు ఆరోగ్యంగా.. ఉల్లాసంగా ఉండాలనుకుంటే, మీ ఆహారంలో బీట్‌రూట్‌ను చేర్చుకోండి. ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది.. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది.. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఇది కొన్ని తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. శీతాకాలం ప్రారంభమైంది. ప్రజలు తమ ఆరోగ్యం – రోగనిరోధక శక్తిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం మంచిది.. అయితే.. చలి కాలంలో శరీరాన్ని వెచ్చగా – ఆరోగ్యంగా ఉంచడానికి ఆహార మార్పులు చాలా అవసరమని నిపుణులు అంటున్నారు. ఈ సమయంలో, శరీరాన్ని చలి నుండి రక్షించడమే కాకుండా రోగనిరోధక శక్తిని బలోపేతం చేసే ఆహారాన్ని తినాలని సిఫార్సు చేస్తున్నారు. ఇలాంటివాటిలో బీట్‌రూట్ ఒకటి.. దుంప జాతికి చెందిన బీట్‌రూట్‌ను శీతాకాలపు సూపర్‌ఫుడ్‌గా పరిగణిస్తారు. చాలా మంది దీనిని రక్తాన్ని పెంచడానికి తింటారు.. కానీ దాని ప్రయోజనాలు అంతకు మించి ఉంటాయి. దీనిలోని ఐరన్, ఫైబర్, విటమిన్ సి – యాంటీఆక్సిడెంట్లు.. శీతాకాలంలో చాలా ప్రయోజనకరంగా మారుస్తాయి.. ఏ వ్యక్తులు దీనికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటారు..? బీట్‌రూట్‌లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. హెల్త్‌లైన్ ప్రకారం, దుంపలలో ఫైబర్, ఫోలేట్, మాంగనీస్, పొటాషియం, ఐరన్ – విటమిన్ సి వంటి పోషకాలు ఉంటాయి. వాటిలో నైట్రేట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో, వ్యాయామ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. రెగ్యులర్‌గా వాటిని తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. జీర్ణ సమస్యలు లేదా మలబద్ధకంతో బాధపడేవారికి బీట్‌రూట్ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. శీతాకాలంలో దీన్ని తినడం వల్ల కడుపు సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. హెల్త్‌లైన్ ప్రకారం, ఈ పండు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఒక కప్పు బీట్‌రూట్‌లో దాదాపు 3.4 గ్రాముల ఫైబర్ ఉంటుంది.. ఇది ఫైబర్ కు మంచి మూలంగా మారుతుంది. ఫైబర్ మన శరీరంలో పూర్తిగా జీర్ణం కాదు. ఇది పెద్దప్రేగుకు చేరుకుంటుంది.. మంచి బ్యాక్టీరియాను పోషిస్తుంది.. మలాన్ని స్థూలంగా, మ దువుగా చేస్తుంది.. మలబద్ధకాన్ని నివారిస్తుంది.. అలాగే ప్రేగును శుభ్రంగా ఉంచుతుంది.



## ఈ పండు రోజూ ఒక్కటి తిన్నారంటే..

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అవకాడోలు భారీగా మార్కెట్ చేయడాన్ని మీరు చూసి ఉండవచ్చు. ఫిట్‌నెస్ ప్రియుల నుండి సెలబ్రిటీల వరకు, ప్రతి ఒక్కరూ దానితో కొత్త వంటకాలను తయారు చేసి తినడం కనిపిస్తుంది. ఆవకాడోను సూపర్‌ఫుడ్ అని పిలుస్తారు. అయితే, దాని అధిక ధర కారణంగా, సాధారణ ప్రజలు ఈ పండును చాలా అరుదుగా కొనుగోలు చేయగలుగుతారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అవకాడోలు భారీగా మార్కెట్ చేయడాన్ని మీరు చూసి ఉండవచ్చు. ఫిట్‌నెస్ ప్రియుల నుండి సెలబ్రిటీల వరకు, ప్రతి ఒక్కరూ దానితో కొత్త వంటకాలను తయారు చేసి తినడం కనిపిస్తుంది. ఆవకాడోను సూపర్‌ఫుడ్ అని పిలుస్తారు. అయితే, దాని అధిక ధర కారణంగా, సాధారణ ప్రజలు ఈ పండును చాలా అరుదుగా కొనుగోలు చేయగలుగుతారు. ధర ఎక్కువ కారణంగా చాలా మంది దీనికి దూరంగా ఉంటారు. మీరు కూడా ఈ పండు ప్రయోజనాలను కోల్పోతూ, ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నట్లయితే.. ఈ వార్త మీకు ఉపయోగకరంగా ఉంటుంది. నిజానికి, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శుభం వాత్స్య ఈ పండుకు ప్రత్యామ్నాయాన్ని వెల్లడించారు.. ఇది కొంచెం ఖరీదైనది కావొచ్చు.. కానీ.. చౌకైనది మాత్రమే కాదు, ఆవకాడో కంటే.. అనేక రెట్లు మెరుగైన పోషక, ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది.అవకాడోకు బదులుగా ఒక చిన్న భారతీయ గూస్బెర్రీ – ఆమ్లాను (ఉసిరికాయ) తినవచ్చని డాక్టర్ శుభం వివరించారు. దీన్ని తినడం వల్ల శరీరానికి అనేక ముఖ్యమైన ప్రయోజనాలు లభిస్తాయి. ఇందులో ఉండే పోషకాలు –యాంటీఆక్సిడెంట్లు అనేక శరీర సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. ఉసరికాయలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు దాగున్నాయి.. ప్రతిరోజూ ఒక ఉసిరి తీసుకోవడం వల్ల శరీరానికి విటమిన్ సి అవసరం తీరుతుందని డాక్టర్ శుభం వివరించారు. విటమిన్ సి లోపం ఉన్న ఎవరైనా ఉసిరిని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఉసిరి తినడం వల్ల శరీరం రోగనిరోధక శక్తి పెరుగుతుంది, కాలానుగుణ ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. జలుబు – ఫ్లూ వంటి కాలానుగుణ వ్యాధులతో తరచుగా బాధపడేవారు ఖచ్చితంగా ఉసిరిని వారి ఆహారంలో చేర్చుకోవాలి.





## బ్రౌన్ రైస్ ప్రయోజనాలు..

సాధారణంగా ప్రతి ఒక్కరు తినేది తెల్లబియ్యం. అయితే బ్రౌన్ రైస్‌ను కూడా తినేవారు చాలా మంది ఉంటారు. ఈ బ్రౌన్ రైస్ వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. వైట్ రైస్ కంటే బ్రౌన్ రైస్ తినడం చాలా మంచిది. బియ్యం తింటే లావు అవుతారనే ఆలోచన చాలా మందికి ఉంటుంది. అందుకే చాలా మంది తెల్ల బియ్యం కాకుండా బ్రౌన్ రైస్ తింటారు. బ్రౌన్ రైస్ తినడం వల్ల మీకు ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో, తెల్ల బియ్యానికి బదులుగా బ్రౌన్ రైస్ తినడం వల్ల వాస్తవానికి ఏవైనా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయా అని తెలుసుకోవడం విలువైనది. బ్రౌన్ రైస్‌లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ బియ్యం తినడం వల్ల జీర్ణం కావడం సులభం. డైటరీ ఫైబర్ తో బ్రౌన్ రైస్ తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది అజీర్ణ సమస్యను తొలగిస్తుంది. బ్రౌన్ రైస్ మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో కూడా ఉపయోగపడుతుంది. అందుకే మలబద్ధకం సమస్యలు ఉన్నవారు బ్రౌన్ రైస్‌ను తీసుకోవచ్చు. ఈ రైస్ మధుమేహం ఉన్నవారికి ఎంతో మంచిదంటున్నారు నిపుణులు. బ్రౌన్ రైస్ తో తయారు చేసిన బియ్యం తినడం కూడా గుండె ఆరోగ్యానికి మంచిది. బ్రౌన్ రైస్ రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రక్తపోటు స్థాయి తక్కువగా ఉండి, చెడు కొలెస్ట్రాల్ స్థాయి తక్కువగా ఉంటే, గుండె ఆరోగ్యానికి అంత మంచిది. బ్రౌన్ రైస్‌లో విటమిన్ బి, మెగ్నీషియం, భాస్వరం, సెలీనియం, మాంగనీస్ వంటి బహుళ పోషకాలు ఉంటాయి. తెల్ల బియ్యం తయారుచేసేటప్పుడు పైన పేర్కొన్న పదార్థాలను తరచుగా వదిలివేస్తారు. బ్రౌన్ రైస్‌లో కూడా చాలా యాంటీఆక్సిడెంట్లు ఉంటాయని చెబుతున్నారు నిపుణులు.



# నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్ భారీ డీల్..




ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో సంచలనం చోటుచేసుకుంది. ప్రపంచ వినోద రంగంలో భారీ డీల్ కుదిరింది. స్ట్రీమింగ్ జెయింట్ నెట్‌ఫ్లిక్స్ , హాలీవుడ్‌లో అత్యంత పురాతన, దిగ్గజ స్టూడియోల్లో ఒకటైన వార్నర్ బ్రదర్స్ డిస్కవరీకు చెందిన సినిమా, టీవీ స్టూడియోలు, స్ట్రీమింగ్ యూనిట్‌ను కొనుగోలు చేసేందుకు అంగీకరించింది. ఈ డీల్ విలువ సుమారు 72 బిలియన్ డాలర్లు. ఈ హక్కుల కోసం కామ్‌కాస్ట్, పారామౌంట్ స్కైడాన్స్ వంటి దిగ్గజ సంస్థలు కూడా పోటీ పడ్డాయి. అయితే వాటిని మించిపోయి నెట్‌ఫ్లిక్స్ ఈ భారీ కొనుగోలును ఫైనలైజ్ చేయడం విశేషం. ఇప్పటికే హ్యారీ పోటర్, గేమ్ ఆఫ్ థ్రోన్స్ సహా అనేక హెచ్‌బిఒ మ్యాక్స్ ఫ్రాంచైజీల స్ట్రీమింగ్ హక్కులు నెట్‌ఫ్లిక్స్ వద్ద ఉన్న విషయం తెలిసిందే. ఈ డీల్ విజయవంతం కావడంలో అమెరికా ఫెడరల్ నియంత్రణ సంస్థల ఆమోదం కీలకం కానుంది. ఈ అంశంపై బోకే క్యాపిటల్ పార్ట్నర్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ కిమ్ ఫారెస్ట్ మాట్లాడుతూ.. స్ట్రీమింగ్ రంగంలో ప్రధాన సంస్థ అయిన నెట్‌ఫ్లిక్స్ ఈ పోటీలో నెగ్గడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ఇక, ఈ భారీ కొనుగోలుతో నెట్‌ఫ్లిక్స్ షేర్ ధరను వెంటనే పెంచుతుందేమో అనేది చర్చనీయాంశంగా మారింది. 2022 నుంచి ఐదింతలు పెరిగిన నెట్‌ఫ్లిక్స్ స్టాక్ మళ్లీ ఎగబాకేందుకు ఇన్వెస్టర్లు మరింత బలమైన ట్రిగ్గర్ కోసం ఎదురు చూస్తున్నారని చర్చ జరుగుతోంది. ఈ డీల్ పూర్తి అయితే, వినోద రంగంలో శక్తి సమీకరణాలు మారే అవకాశమున్నాయని ఇండస్ట్రీ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఈ పత్రాలు ఉంటే... శాలరీ స్లిప్ లేకుండానే పర్సనల్ లోన్

వ్యక్తిగత రుణం తీసుకోవాలంటే బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలు మొట్ట మొదటిగా అడిగేది మీరు ఏ ఉద్యోగం చేస్తున్నారు, మీ శాలరీ స్లిప్ ఉందా? అని. వచ్చే వేతనం ఆధారంగానే ఏ గ్యారంటీ లేకుండా లోన్ ఇస్తారు. అయితే వ్యాపారం చేసే వారు, అద్దె ఆదాయం ఉన్నవారు, స్వయం ఉపాధి పొందుతున్న వారికి ఎలాంటి శాలరీ స్లిప్ ఉండదు. అయినా వాళ్లు కూడా పర్సనల్ లోన్ తీసుకోవచ్చు. మరి అది ఎలా అనే ప్రశ్న మీకు వచ్చే ఉంటుంది. కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లు సమర్పించి లోన్ ఈజీగా పొందవచ్చు.స్థిరమైన ఆదాయం ఉందని బ్యాంకులకు నమ్మకం కలిగించాలి. మంచి క్రెడిట్ స్కోరు ఉండాలి. గత 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్స్, రెగ్యులర్ క్రెడిట్స్ సహా బ్యాంక్ ఖాతాలో బ్యాలెన్స్ చూపించాలి. మీకు ప్రతి నెలా డబ్బు క్రమంగా పెద్ద మొత్తంలో వస్తుందని తెలియజేయాలి.




గత రెండేళ్లకు సంబంధించిన ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ చూపించాలి. ఐటీఆర్ ఫైల్ చేసేవారికి లోన్ త్వరగా అందుతుంది. ఒకవేళ ఫార్మ్ 16 ఉంటే ఇవ్వాలి. బిజినెస్ చేసే వారు జిఎస్‌టి రిటర్న్స్ చూపించాల్సి ఉంటుంది. రెంట్ ఇన్ కమ్, ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌కమ్ పత్రాలు చూపించాలి. ఈ డాక్యుమెంట్లు ఇస్తే బ్యాంక్ స్థిరమైన ఆదాయం ఉందని నమ్ముతుంది. అయితే, డాక్యుమెంట్లతో పాటు క్రెడిట్ ప్రొఫైల్ బలంగా ఉందని చూపించాలి. క్రెడిట్ స్కోర్ 750కి పైగా ఎక్కువగా ఉన్నట్లయితే లోన్ ఈజీగా వస్తుంది. అలాగే డెట్ టు ఇన్‌కమ్ రేషియో తక్కువగా ఉండాలి. డిజిటల్ లోన్స్ ఇచ్చే కంపెనీలు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, ప్రైవేట్ బ్యాంకులు ఈ రుణాలు ఇస్తుంటాయి. బ్యాంక్ స్టేట్‌మెంట్, క్రెడిట్ స్కోర్, క్యాష్ ఫ్లో చూసి రుణాలు ఇస్తాయి. లోన్ తీసుకునేముందు వడ్డీ రేటు, ఇఎంఐ టెన్యూర్ చెక్ చేసుకోవడం చాలా ముఖ్యం. అయితే పర్సనల్ లోన్‌లో 5 రిస్కులు ఉంటాయి. ఇందులో వడ్డీ ఎక్కువగా ఉంటుంది. నెలవారీ ఇఎంఐ మిస్ అయినట్లయితే క్రెడిట్ స్కోర్ భారీగా పడిపోతుంది. ముందుగానే లోన్ క్లోజ్ చేయాలంటే పెనాల్టీ పడుతుంది. దీన్ని ప్రీ-క్లోజర్ ఛార్జెస్ అని పిలుస్తారు. ఇఎంఐ లు మిస్ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

# ఆర్‌బిఐ వడ్డీ రేట్లు పావు శాతం తగ్గింపు




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు వడ్డీ రేట్లకు కోత పెట్టింది. రెపో రేటును పావు శాతం తగ్గించి 5.25 శాతానికి పరిమితం చేసింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) నిర్ణయాలను ఆయన శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ కాలంలో మూడు సార్లు వడ్డీ రేట్లను 100 బేసిస్ పాయింట్లు తగ్గించామని గుర్తు చేశారు. నాలుగో సారి కూడా 25 బేసిస్ పాయింట్లు తగ్గించామని చెప్పారు. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ఈ క్రమంలో గృహ, వాహన, రిటైల్, వ్యక్తిగత రుణాలపై భారం తగ్గుతోంది. రూపాయి పతనం కొనసాగుతున్న ప్పటికీ.. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి పడిపోవడంతో వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టామని మల్హోత్రా అన్నారు. బాహ్య వాతావరణం ప్రతికూల సవాళ్లతో కూడుకున్నప్పటికీ భారతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగైన ప్రగతిని ప్రదర్శించిందన్నారు. తగ్గిన ద్రవ్యోల్బణం మరింత వృద్ధికి మద్దతుగా నిలవడానికి వీలు కల్పించనుందని పేర్కొన్నారు.జిఎస్‌టి శ్లాబుల తగ్గింపునతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ జిడిపి అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ధరలు కూడా తగ్గుముఖం పట్టినందున 2025-26కు గాను ద్రవ్యోల్బణం అంచనాలను 2.6 శాతం నుంచి 2 శాతానికి అంచనా వేస్తున్నాము. విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి సరిపోతాయి. అని మల్హోత్రా తెలిపారు. ఆర్‌బిఐ వడ్డీ రేట్ల కోత వార్తలతో స్టాక్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడింగ్ అయ్యాయి. వారాంతం సెషన్‌లో బిఎస్‌ఇ సెన్సెక్స్ 447 పాయింట్ల లాభంతో 85,712కు చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 153 పాయింట్లు పెరిగి 26,186 వద్ద ముగిసింది.

## ఆ గ్లూకోజ్ మానిటర్ల వాడకం ఆపండి

అబాట్ డయాబెటిస్ కేర్ తయారుచేసిన గ్లూకోజ్ మానిటర్ సెన్సార్ల వల్ల ఏడుగురు మరణించడం, సుమారు ఏడు వందల మంది తీవ్ర అనారోగ్య ముప్పు బారిన పడటంతో.. కొన్ని ర కాల గ్లూకోజ్ మానిటర్ల వాడకాన్ని ఆపేయాలని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) హెచ్చరించింది. కొన్ని ఫ్రీస్టయిల్ లిబ్రే 3, ఫ్రీస్టయిల్ లిబ్రే 3 ప్లస్ సెన్సార్లు తప్పుడు గ్లూకోజ్ రీడింగ్‌లను చూపించొచ్చని ఎఫ్‌డీఏ అధికారులు తెలిపారు. 'తప్పు రీడింగ్ వల్ల మధుమేహ రోగులు.. వ్యాధి చికిత్స కోసం అవలంబించే జాగ్రత్తలను తగ్గించే అవకాశం ఉంటుంది. కార్బోహైడ్రేట్లను ఎక్కువగా తినడం, ఔషధాలు, ఇన్సులిన్ తీసుకోవడాన్ని తగ్గించడం లేదా మానేయడం లాంటివి చేయొచ్చు. ఇలా ఆరోగ్యం




విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడొచ్చు. కొన్ని సందర్భాల్లో రోగి మరణానికి దారితీయొచ్చ'ని ఎఫ్‌డీఏ హెచ్చరించింది. అమెరికాలోని ఒక ఉత్పత్తి కేంద్రంలో తయారైన సుమారు 30 లక్షల సెన్సార్స్‌లపై ఎఫ్‌డీఏ హెచ్చరికల ప్రభావం పడనుందని అబాట్ అధికారులు తెలిపారు.

వైద్య బీమా రంగంలో కీలక సంస్థగా ఉన్న స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు వినియోగదారుల కమిషన్ భారీ షాక్ ఇచ్చింది. బీమా సంస్థలు వైద్య చికిత్స పద్ధతులను నిర్దేశించలేవని సంచలన తీర్పునిచ్చింది. కోవిడ్‌కు సంబంధించిన క్లెయిమ్‌ను తిరస్కరించినందుకు స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్‌కు వడ్డీతో పాటు దాదాపు రూ. 50,000, వ్యాజ్య ఖర్చులను చెల్లించాలని ఘజియాబాద్ జిల్లా కన్స్యూమర్ ఫోరం ఆదేశించింది. బాధితురాలు ఇంట్లో

## చికిత్స నిర్ణయంపై బీమా సంస్థలకు అధికారం లేదు..!

ఐసోలేషన్‌లో ఉంటే సరిపోతుందని బీమా సంస్థ క్లెయిమ్‌ను తిరస్కరించింది. దీనిపై వినియోగదారుల ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది సేవలో లోపమని కమిషన్ స్పష్టం చేసినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనాన్ని వెల్లడించింది. వైద్య చికిత్స విధానాన్ని లేదా పద్ధతిని నిర్ణయించే అధికారం బీమా సంస్థకు లేదని తేల్చి చెప్పింది.




కోవిడ్ సంబంధిత క్లెయిమ్‌ను తిరస్కరించిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదుపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. బీమా సంస్థ ఇప్పుడు దాదాపు రూ.50,000 మొత్తాన్ని సహా 6 శాతం వార్షిక వడ్డీతో పాటు రూ.2,000 వ్యాజ్య ఖర్చులను చెల్లించాలని స్టార్ హెల్త్‌ను కమిషన్ ఆదేశించింది. ఈ మొత్తాన్ని 30 రోజులలోపు చెల్లించాలని స్పష్టం చేసింది. రోగికి కరోనా లక్షణాలు లేని కారణంగా రోగికి ఇంట్లోనే చికిత్స అందించాల్సిందని.. కాబట్టి ఆసుపత్రిలో చేరడం అవసరం లేదని స్టార్ హెల్త్ క్లెయిమ్ తిరస్కరించింది. దాద్రీ నివాసి అయిన నీతూ నగర్ 2022 సెప్టెంబర్ 1న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (డిసిడిఆర్)కి ఫిర్యాదు చేశారు. నీతూనగర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె భర్త అజరు నగర్ 2018 నుండి స్టార్ హెల్త్ 'ఫ్యామిలీ హెల్త్ ఆప్టిమా ఇన్సూరెన్స్ పాలసీ' కింద కవరేజ్ కలిగి ఉన్నారు. ప్రతి సంవత్సరం ఎటువంటి అంతరాయం లేకుండా చెల్లింపులు చేశారు. 2022 జనవరిలో పాలసీ నాలుగో సంవత్సరం నడుస్తున్నప్పుడు నీతూ నగర్‌కు తీవ్ర జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడంతో గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆసుపత్రిలో చేరారు. ఆయనకు హాస్పిటల్‌లోనే సేవలు అవసరమని కుటుంబ సభ్యులు భావించారు. పాలసీ నిబంధనల ప్రకారం.. ఆసుపత్రిలో చేరడానికి ముందే బీమా సంస్థకు సమాచారం ఇచ్చారు. కొన్ని రోజుల్లో క్యాష్‌లెస్ క్లెయిమ్ ఆమోదించబడుతుందని కుటుంబానికి చెప్పారు. ఆసుపత్రి డిశ్చార్జ్ తర్వాత బిల్లులను చెల్లించడానికి స్టార్ హెల్త్ నిరాకరించింది. మొత్తం ఖర్చు రూ.49,423 కావడంతో కుటుంబం ఆ మొత్తాన్ని తమ సొంత డబ్బుతో చెల్లించి, రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసింది. దీంతో వారు కమిషన్‌ను ఆశ్రయించగా బీమా సంస్థ వాదనను కమిషన్ అధ్యక్షులు అనిల్ కుమార్ పుండిర్, సభ్యురాలు అంజు శర్మ తిరస్కరించారు. వైద్యుల నిర్ణయాన్ని బీమా సంస్థ ఎలా కొట్టిపారేస్తుందని స్పష్టం చేశారు. ''వైద్య నిపుణులు ఆసుపత్రిలో చేరడం అవసరమని సూచించినప్పుడు.. చికిత్సను ఇంట్లోనే చేయాలని బీమా సంస్థ పట్టుబట్టకూడదు. రోగి ఇంట్లో ఐసోలేషన్‌లో చికిత్స పొందాల్సిందనే కారణంతో క్లెయిమ్‌ను తిరస్కరించడం సేవల్లో లోపమే.'' అని తేల్చారు. ఆసుపత్రి ఖర్చులతో పాటు వడ్డీ, కేసు ఖర్చులను రీయింబర్స్ చేయాలని స్టార్ హెల్త్‌ను ఆదేశించారు.

## ఆ బ్యాటర్‌ను జట్టులో కొనసాగించాలి

టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాలకు గురవడంతో రుతురాజ్ గైక్వాడ్‌కు అనూహ్యంగా తుదిజట్టులో చోటు దక్కింది. అయితే అతడు రాంచీ వన్డేలో విఫలమయ్యాడు. 14 బంతులు ఎదుర్కొని కేవలం 8 పరుగులు మాత్రమే చేశాడు. కానీ అతడు క్రీజులో ఉన్నంతవరకు సౌకర్యవంతంగానే కనిపించాడు. దురదృష్టవశాత్తూ డెవాల్డ్ బ్రెవిస్ అద్భుతమైన క్యాచ్ పట్టడం వల్ల పెవిలియన్‌కు చేరాల్సి వచ్చింది. రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో మాత్రం రుతురాజ్ తన సత్తా చాటాడు. సెంచరీతో (105బీ 83 బంతుల్లో, 12 ఫోర్లు, 2 సిక్సులు) చెలరేగిపోయాడు. అలాగే అతడి షాట్ సెలక్షన్, వికెట్ల మధ్య పరుగు, విరాట్‌కోహ్లీతో భాగస్వామ్యం విషయంలో చక్కటి సమన్వయం, పరిణితి ప్రదర్శించాడు. అందుకే శ్రేయస్ అయ్యర్ గాయం నుంచి కోలుకొని తిరిగి జట్టులోకి వచ్చినా.. రుతురాజ్ గైక్వాడ్‌కు జట్టులో చోటు కల్పించాలని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ సూచించాడు. 'కొంత మంది క్రికెటర్లకు చాలా అదృష్టం ఉంటుంది. వారికి వెంటనే గుర్తింపు దక్కుతుంది. జట్టులోనూ ఎక్కువ కాలం కొనసాగుతారు. కానీ రుతురాజ్ మాత్రం.. చక్కటి ప్రదర్శనలు చేసినా అతడు దీర్ఘకాలం జట్టులో కొనసాగలేకపోతున్నాడు. దురదృష్టవశాత్తూ కొన్నిసార్లు గాయాల వల్ల కూడా రుతు రాజ్ టీమ్ లో స్థానం కోల్పోతున్నాడు' అని రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ లో అన్నాడు.



'రుతురాజ్ గైక్వాడ్ నాలుగో స్థానంలో సరిగ్గా సరిపోతాడు. అతడు సీమర్లను చక్కగా ఆడగలడు. ఒకవేళ బాల్ స్వింగ్ అయితే తప్ప వారు రుతురాజ్‌ను ఔట్ చేయలేరు. ఇక స్పిన్ విషయానికొస్తే.. ప్రస్తుతం టీమ్‌ఇండియాలో అతడికంటే ఇంకెవరూ అంత బాగా ఆడలేరు. అలాగే వికెట్ల మధ్య పరుగులు చాలా వేగంగా తీయగలడు. అతడి అమ్ముల పొదిలో అన్ని క్రికెటింగ్ షాట్లూ ఉన్నాయి. నాలుగో స్థానం కోసం ఒక బ్యాటర్ ఇంతకంటే తనను తాను నిరూపించుకోవడానికి ఇంకేమీ లేదు' అని అశ్విన్.. రుతురాజ్ గైక్వాడ్‌కు మద్దతుగా నిలిచాడు.

## న్యూజిలాండ్‌తో టెస్టు మ్యాచ్‌లో హోప్ సెంచరీ

క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్ - వెస్టిండీస్ మధ్య జరుగుతున్న మొదటి టెస్టులో న్యూజిలాండ్ భారీ ఆధిక్యంలో ఉన్నప్పటికీ షై హోప్ అద్భుత శతకం క్రికెట్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. కంటి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నా డగౌట్‌కి పరిమితం కాకుండా సన్‌గ్లాసెస్ పెట్టుకుని మరీ బ్యాటింగ్ చేయడమే కాకుండా సెంచరీతో రాణించాడు. దాంతో నాలుగో రోజే ఆలౌట్ అవుతుంది అనుకున్న విండీస్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. న్యూజిలాండ్ భారీ స్కోర్ చేయడంతో రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్‌కు 531 పరుగుల లక్ష్యం ఎదురైంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి



విండీస్ 4 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. షై హోప్ 116 పరుగులు, జస్టిన్ గ్రీవ్స్ 55 పరుగులతో క్రీజులో కొనసాగుతున్నారు. ఈ టెస్టులో విజయం సాధించాలంటే విండీస్‌కు ఆఖరి రోజు 319 పరుగులు కావాల్సి ఉంది. హోప్, గ్రీవ్స్ ఆఖరి రోజు కూడా నిలబడితే మ్యాచ్ డ్రా అయ్యే అవకాశం ఉంది. ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న హోప్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ సన్ గ్లాసెస్‌తో బ్యాటింగ్ చేశాడు. హోప్‌కి కొన్ని రోజులుగా తీవ్రమైన కంటి ఇన్ఫెక్షన్ ఉండటంతో మ్యాచ్ మొత్తం యాంటీబయాటిక్ డ్రాప్స్ ఉపయోగించాడు. దాంతో ఫీల్డింగ్ కూడా చేయలేకపోయాడు. అయినా మొదటి ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో అదరగొట్టాడు. సన్‌గ్లాసెస్‌తో ఆడుతూ కూడా కివీస్ బౌలర్లను ఎదుర్కొని నిలబడటంతో హోప్ డెడికేషన్‌కు క్రికెట్ లోకం సలాం కొట్టింది. ఈ ఏడాది ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో షై హోప్ రెండో స్థానంలో నిలిచాడు. టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ 39 ఇన్నింగ్స్‌లలో 1732 పరుగులు చేస్తే, షై హోప్ 46 ఇన్నింగ్స్‌లలో 1677 పరుగులు చేశాడు. కివీస్‌పై రెండో ఇన్నింగ్స్‌లో హోప్ అవుట్ కాలేదు కాబట్టి ఆఖరి రోజు మరో 56 పరుగులు చేస్తే ఈ ఏడాది అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే ఈ టెస్టులో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు మొదట ఇన్నింగ్స్‌లో 231 పరుగులకు ఆలౌట్ కాగా, విండీస్ 167 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ టామ్ లాథమ్ 145, రచిన్ రవీంద్ర 176 పరుగులు చేయడంతో 466/8 పరుగుల వద్ద కివీస్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో వచ్చిన ఆధిక్యంతో కలిపి న్యూజిలాండ్ మొత్తం 530 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 212/4 పరుగులు చేసింది.

## తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన ఆస్ట్రేలియా



యాషెస్ సిరీస్ రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఆధిక్యంలో కొనసాగుతోంది. గబ్బా వేదికగా జరుగుతున్న డే అండ్ నైట్ పింక్ బాల్ టెస్టులో ఆస్ట్రేలియా బ్యాటర్లు పట్టు సాధించారు.టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 334 పరుగులు చేయగా.. రెండో రోజు ఆట ప్రారంభించిన ఆస్ట్రేలియా జట్టు ఆ రోజే లీడింగ్‌లోకి రావడం విశేషం. తొలి రోజు తొమ్మిది వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు రెండో రోజు ప్రారంభమైన కొద్దిసేపటికే జోఫ్రా ఆర్చర్ వికెట్ కోల్పోయి ఆలౌట్ అయింది. ఆ వెంటనే మొదటి సెషన్‌లో ఇన్నింగ్స్‌కి వచ్చిన ఆస్ట్రేలియా జట్టుకు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, జేక్ వెధరాల్డ్ శుభారంభం అందించారు. పెర్త్ టెస్టు సెంచరీ హీరో హెడ్ ఈ టెస్టులో 33 పరుగులు చేసి అవుటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన మార్నస్ లబుషేన్ - జేక్ వెధరాల్డ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. కెప్టెన్ స్టీవ్ స్మిత్, కామెరూన్ గ్రీన్ ఇలా అందరూ అద్భుతంగా రాణించడంతో ఇంగ్లండ్ చేసిన భారీ స్కోర్‌ను ఆస్ట్రేలియా అధిగమించింది. వరుసగా ముగ్గురు బ్యాటర్లు హాఫ్ సెంచరీ చేయడం విశేషం. కామెరూన్ గ్రీన్, అలెక్స్ క్యారీ కూడా రాణించడంతో భారీ స్కోర్ దిశగా ముందుకు వెళ్తోంది.ట్రావిస్ హెడ్ 33, జేక్ వెధరాల్డ్ 72, మార్నస్ లబుషేన్ 65, స్టీవ్ స్మిత్ 61, కామెరూన్ గ్రీన్ 45, జోష్ ఇంగ్లిస్ 23 పరుగులు చేశారు. అలెక్స్ క్యారీ 46, మైకేల్ నేసర్ 15 పరుగులతో క్రీజులో కొనసాగుతున్నారు. దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 378/6 పరుగులు చేసి 44 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇంగ్లండ్ బౌలర్లు బ్రైడన్ కార్స్ మూడు వికెట్లు తీయగా.. కెప్టెన్ బెన్ స్టోక్స్ రెండు, ఆర్చర్‌కి ఒక వికెట్ దక్కాయి. అంతకు ముందు తొలి రోజు ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ సెంచరీతో మెరిశాడు. ఓపెనర్ జాక్ క్రాలీ 76 పరుగులు చేయగా, జోఫ్రా ఆర్చర్ 38, హ్యారీ బ్రూక్ 31 పరుగులతో రాణించడంతో ఇంగ్లండ్ 334 పరుగులు చేయగలిగింది. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ ఆరు వికెట్లు పడగొట్టగా.. నేసర్, బోలాండ్, బ్రెండన్ డాగెట్ తలో వికెట్ దక్కించుకున్నారు.

## రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్సీ రేసులో పరాగ్ స్పష్టమైన సిద్ధతలు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు రాజస్థాన్ రాయల్స్ టీమ్ కెప్టెన్సీ విషయంలో ఆసక్తికర చర్చలు జరుగుతున్నాయి. మాజీ కెప్టెన్ సంజూ శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్‌కి ట్రేడ్ అవడంతో, టీమ్‌లో కొత్త నాయకత్వం ఎవరు చేపట్టాలనే ప్రశ్న లేవనెత్తింది. ఈ మార్పు టీమ్ డైనమిక్స్‌ను పూర్తిగా మార్చిపోయే అవకాశం ఉంది. శాంసన్ లాంటి ప్రతిష్ఠాత్మక నాయకుడు వదిలిపెట్టడంతో, యువతకు అవకాశాలు తలెత్తాయి. ఇప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్ మెగా ఆక్షన్ తర్వాత చివరి నిర్ణయం తీసుకోనుంది. రాజస్థాన్ రాయల్స్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ పరాగ్ తన ఇంటర్వ్యూలో కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నానని స్పష్టంగా తెలిపారు. ఐపిఎల్ 2026లో ఈ బాధ్యత ఇస్తే, తనకు దాని పట్ల ఎటువంటి ఆక్షేపణలు లేవని అతను పేర్కొన్నారు. ఈ ప్రకటన టీమ్ ఫ్యాన్స్‌లో ఆసక్తిని రేకెత్తించింది. పరాగ్ యొక్క ఈ వ్యాఖ్యలు, టీమ్‌లోని ఇతర యువ క్రీడాకారులకు కూడా ప్రేరణగా మారతాయి. అతను తన అభిప్రాయాన్ని ధైర్యంగా వ్యక్తీకరించడం వల్ల, కెప్టెన్సీ రేసులో అతని అవకాశాలు మరింత పెరిగాయి. పరాగ్ తన గత అనుభవాలను ప్రస్తావిస్తూ, మునుపటి సీజన్‌లలో 7-8 మ్యాచ్‌లకు కెప్టెన్సీ చేసినట్టు చెప్పారు. ఆ సమయంలో తాను తీసుకున్న నిర్ణయాల్లో 80-85 శాతం సరైనవి అని, అవి టీమ్ విజయానికి దోహదపడ్డాయని అతను గుర్తుచేశారు. ఈ అనుభవం అతన్ని మరింత ఆత్మవిశ్వాసంగా మార్చింది. మ్యాచ్ పరిస్థితులు, బౌలర్ల ఎంపికలు, బ్యాటింగ్ ఆర్డర్ మార్పుల్లాంటి అంశాల్లో అతని తీరు ప్రశంసనీయమైంది. ఇలాంటి పాస్ట్ పెర్ఫార్మెన్స్‌లు, అతన్ని ఐపిఎల్ 2026 కెప్టెన్సీకి బలమైన కాండిడేట్‌గా నిలబెడుతున్నాయి. కెప్టెన్సీరేసులో పరాగ్‌తోపాటు యశస్వి జైస్వాల్, దినేష్ జురెల్ వంటి యువ క్రీడాకారులు కూడా పోటీపడుతున్నారు. జైస్వాల్ తన ఆకర్షణీయ ఓపెనింగ్ బ్యాటింగ్‌తో, జురెల్ తన వికెట్ కీపింగ్ స్కిల్స్‌తో ఈ రేసులో బలంగా ఉన్నారు.




# సైకో హంతకుడిగా నటించిన స్టార్ హీరో



మలయాళం మెగాస్టార్ గా అభిమానులు పిలుచుకునే మమ్ముట్టి కొత్త సినిమా కలం కవల్ ఇవాళ ప్రేక్షకుల ముందుకొచ్చింది. అఖండ 2 వాయిదా పడటంతో చాలా చోట్ల అవసరమైన దానికన్నా ఎక్కువ షోలు మల్టీప్లెక్సుల్లో దీనికి కేటాయిస్తున్నారు. రివ్యూలు, పబ్లిక్ టాక్ చూసిన ఆడియన్స్ ఇదేదో బాగుందంటూ వెళ్తున్న వైనం సోషల్ మీడియాలో కనిపిస్తోంది. అంతగా ఏముందంటే మమ్ముట్టి పూర్తిగా ఒక నెగటివ్ పాత్ర చేయడం హైలైట్ గా చెప్పొచ్చు. పైకి సౌమ్యుడిగా కనిపించే స్త్రీలోలుడు సైకో పాత్ కిల్లర్ గా హత్యలు చేయడం, దాన్ని కనిపెట్టే క్రమంలో ఒక పోలీస్ ఆఫీసర్ కనుక్కున్న విస్తుపోయే నిజాలు ఇందులో ప్రధాన కథాంశం.గతంలో స్వలింగ సంపర్కుడిగా ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేసిన మమ్ముట్టి ఈసారి ఏకంగా సైకో కిల్లర్ గా నటించడం షాకే, నాలుగు వందలకు పైగా సినిమాలు చేసిన అనుభవంతో కొత్త జానర్ల కోసం ప్రయత్నిస్తున్న ఈ విలక్షణ నటుడు వయసును సైతం లెక్క చేయకుండా ఎనర్జిటిక్ గా కలం కవల్ లో నటించడం విశేషం. ఒకప్పుడు దేశంలో సంచలనం సృష్టించిన సైనేడ్ మోహన్ ని కొంచెం స్ఫూర్తిగా తీసుకున్న దర్శకుడు జితిన్ కె జోస్ స్క్రీన్ ప్లే నడిపించిన విధానం ఆకట్టుకుంటుంది. సెకండాఫ్ లో కొంచెం ల్యాగ్ ఉన్నప్పటికీ క్లైమాక్స్ అయ్యేలోగా ప్రేక్షకులను సంతృప్తి పర్చడంలో టీమ్ సక్సెస్ అయ్యింది. ఇది తెలుగులో డబ్ అవుతుందో లేదో చెప్పలేం కానీ ఓటిటిలో వచ్చాక మాత్రం మనోళ్లు ఎగబడి చూడటం ఖాయం. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే జైలర్ విలన్ వినాయకన్ ఇందులో పాజిటివ్ గా పోలీస్ వేషంలో కనిపించడం. మమ్ముట్టితో కాంబినేషన్ సీన్లు బాగా పండాయి. ఇంటెన్స్ గా డిజైన్ చేసిన విధానం ప్రశంసలు అందుకుంటుంది. అలాని కథనం పరుగులు పెడుతుందని కాదు. మలయాళం సినిమాలు రెగ్యులర్ గా చూసేవాళ్లకు ఇది కొత్తగానే ఉంటుంది కానీ లేదంటే కొంచెం ల్యాగ్ ఫీలవ్వడం ఖాయం. ఇలాంటివి మన హీరోలు చేస్తే జనాలు అంత సులభంగా అంగీకరించరు కాబట్టి అనువాదంతో సరిపెట్టుకోవాల్సిందే.

# ఐదుగురికి కమిట్మెంట్ అడిగారు

సినీ రంగంలో మహిళలకు లైంగిక వేధింపులు ఎదురవడం గురించి దశాబ్దాలుగా ఎన్నో అనుభవాలు వింటూనే ఉన్నాం. ఐతే ఒక ప్పటితో పోలిస్తే ఇప్పుడు ఈ విషయంలో మహిళలు బాగా ఓపెన్ అవుతున్నారు. సోషల్ మీడియా ఊపందుకోవడం.. 'మీ టూ' ఉద్యమం ధైర్యాన్నివ్వడంతో తమకు ఎదురైన చేదు అనుభవాల గురించి బయటపెడుతున్నారు. ఐతే పేరున్న హీరోయిన్లు ఇలాంటి వాటి గురించి చెబితే.. మీడియాలో హెడ్ లైన్స్‌గా మారిపోతాయి. కానీ అంతగా ఫేమస్ కాని మహిళా ఆర్టిస్టులకు ఎదురయ్యే వేధింపుల గురించి పెద్దగా చర్చ జరగదు. తెలుగులో ఎన్నో సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్ రోల్స్ చేసిన మిర్చి మాధవి.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తనకు ఎదురైన లైంగిక వేధింపుల అనుభవం గురించి వెల్లడించింది. ఒక సినిమా టీం తనను సంప్రదించి.. ఐదుగురికి ఒకేసారి కమిట్మెంట్ ఇవ్వాలని అడిగినట్లు ఆమె చెప్పింది. '100 పర్సంట్ లవ్' సహా పలు చిత్రాల్లో నటించిన మిర్చి మాధవికి చాలా ఏళ్ల ముందు ఒక సినిమాలో అవకాశం వచ్చిందట. ఆ సినిమా నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేసి.. '100 పర్సంట్ లవ్'లో తన నటన చూసి సినిమాలో ఛాన్స్ ఇస్తున్నట్లు చెప్పారట. ఐతే ఈ ఛాన్స్ ఇవ్వాలంటే కమిట్మెంట్ ఇవ్వాలని.. తాము ఐదుగురు ఉంటామని ఓపెన్‌గా చెప్పాడట ఆ వ్యక్తి. ఐతే ఇలాంటి వ్యక్తులతో గొడవ పడి లాభం లేదని.. తాను వాళ్లకు సింపుల్‌గా నో చెప్పి ఊరుకున్నట్లు మిర్చి మాధవి వెల్ల



డించింది. ఇలాంటి కమిట్మెంట్ ఇవ్వడం ద్వారా డబ్బులు సంపాదించాలి అంటే.. సినిమాలు వదిలేసి అదే పని చేసుకుంటూ ఉండేదాన్ని.. నటన మీద ఇష్టంతో సినిమాల్లో కొనసాగుతున్నానని ఆ వ్యక్తికి చెప్పి తన పని తాను చేసుకున్నట్లు మిర్చి మాధవి వెల్ల డించింది. తర్వాత ఎప్పుడూ తనకు అలాంటి అనుభవాలు ఎదురు కాలేదని ఆమె తెలిపింది

# మోసపోయిన నటి అంజలి

ఈ మధ్య కాలంలో చాలా మంది ఆన్లైన్ లో అన్ని వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. చిన్న పిల్లల వస్తువుల నుంచి ఇంట్లో పెద్దవాళ్లు వాడే వస్తువుల వరకు అన్నిటిని ఆన్లైన్ లో కొనుగోలు చేస్తున్నారు.ఆన్లైన్ లో మంచి ఆఫర్లు రావడంతో ఎలక్ట్రిక్ వస్తువులు కూడా కొనేస్తున్నారు. అయితే, ఇలా ఆన్లైన్ ఆర్డర్ చేసే క్రమంలో కొత్త స్కాంలు జరుగుతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. తాజాగా బుల్లితెర నటి అంజలికి ఇలాంటి పరిణామం ఎదురైంది. ఆమె బుక్ చేసిన ఐటెం కాకుండా మరో వస్తువును



పంపించారట. దాదాపు రూ.2000 విలువైన వస్తువును బుక్ చేసుకుంటే, 200 రూపాయల చీర వచ్చినట్లు నటి అంజలి ఎమోషనల్ వీడియో పంచుకున్నారు. అమెజాన్ పేరుతో డెలివరీ బాయ్ ఈ వస్తువుని ఇచ్చి వెళ్ళాడట. రెగ్యులర్ గా వస్తువులు బుక్ చేసుకునే వాళ్లను టార్గెట్ చేసి, కొత్త తరహా స్కామ్ లకు పాల్పడుతున్నారట. చీప్ వస్తువులను పెట్టి ఎక్కువ ధర ఉన్నట్లుగా డెలివరీ చేసి మోసాలకు పాల్పడుతున్నారట. అయితే ఈ మోసాలు ఎక్కువగా క్యాష్ ఆన్ డెలివరీ చేసేవారికి ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. వాళ్లను టార్గెట్ చేసి ఈ కొత్త తరహా స్కాంలకు పాల్పడుతున్నట్లు సమాచారం. అయితే ఇలాంటి స్కామ్స్ పట్ల ప్రజలు కాస్త జాగ్రత్తగా ఉండాలని బుల్లితెర నటి అంజలి పేర్కొన్నారు.

# 'శంబాల' నైజాం హక్కులు

## సొంతం చేసుకున్న మైత్రీ మూవీ మేకర్స్..



వర్సటైల్ హీరో ఆది సాయి కుమార్ లేటెస్ట్ సినిమా 'శంబాల'. ఈ సినిమాకు 'ఏ మిస్టికల్ వరల్డ్' అనేది ట్యాగ్ లైన్. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజశేఖర్ అన్న భీమోజు, మహీధర్ రెడ్డి కలిసి షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. డిసెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో శంబాలా జర్నీలో ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి భాగమైంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి ఈ చిత్రానికి సంబంధించిన నైజాం హక్కులను భారీ మొత్తం చెల్లించి సొంతం చేసుకుంది. 'శంబాల' యూనిట్‌లో మైత్రీ వారు కూడా జాయిన్ కావడంతో సినిమాపై మరింత హైప్ పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం శంబాలా ప్రమోషనల్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ డిఫరెంట్ టైప్ ప్రమోషన్స్ చేపడుతూ ఆడియన్స్‌కి ఈ సినిమాను మరింత చేరువ చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రంలో ఆది సాయికుమార్ సరసన అర్చన అయ్యర్ కథానాయికగా నటిస్తుండగా.. సూర్య 45వ చిత్రంలో భాగమైన శ్వాసిక కీలక పాత్ర పోషిస్తోంది. రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో ఈ మూవీ రిలీజ్‌కి సిద్ధమవుతోంది.

# ఆ హీరోతో టాలీవుడ్ హీరోయిన్ ఎఫైర్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలోకి వచ్చిన తక్కువ రోజుల్లోనే పాపులర్ హీరోయిన్ గా మారిపోయింది.పెద్ద పెద్ద హీరోల సరసన సినిమాలు చేస్తోంది ఈ అందాల తార మీనాక్షి చౌదరి. 2021 సంవత్సరంలో ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ సినిమా పెద్దగా సక్సెస్ కాకపోయినా ఖిలాడీ, హిట్ ది సెకండ్ కేస్ లాంటి సినిమాలతో బంపర్ హిట్ అందుకుంది.ఇక ఆ తర్వాత గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం లాంటి సినిమాలతో ఇండస్ట్రీని దున్నేశారు మీనాక్షి చౌదరి. అయితే అలాంటి మీనాక్షి చౌదరి, హీరో అనుమోలు సుశాంత్ తో ప్రేమలో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. వీళ్ళిద్దరూ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నట్లు వార్తలు కూడా వస్తున్నాయి. అయితే దీనిపై తాజాగా మీనాక్షి టీం క్లారిటీ ఇచ్చింది. ఈ ఇద్దరు రిలేషన్ లో ఉన్నట్లు చాలా రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి.. కానీ ఇందులో వాస్తవం లేదని మీనాక్షి చౌదరి టీం స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మకండి అంటూ పేర్కొంది. ఏదైనా సమాచారం ఉంటే అధికారికంగా తామే ప్రకటిస్తామని వివరణ ఇచ్చింది టీం.

# 'మోగ్లీ' ఆకట్టుకుంటుంది



'నేటి యువతను దృష్టిలో పెట్టుకుని వారి భావోద్వేగాలను అర్థం చేసుకుంటూ తీసిన సినిమా 'మోగ్లీ'. కుటుంబ సంబంధాలు, మానవీయ అనుబంధాలకు పెద్దపీట వేశారు. క్లాస్, మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమా ఇది. ఈ సినిమా అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం నాకుంది. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా కూడా ఉంటుంది. నా సినిమాను ఆదరించాలని తెలుగు రాష్ట్రాల ప్రజలను కోరుతున్నా. సమాజంలో అందరూ బాగుండాలనే ఇతివృత్తంతో ఈ సినిమా ఆద్యంతం సాగుతుంది' అని యువ నటుడు రోషన్ అన్నారు. విజయవాడ బెంజిసర్కిల్ వరుణ్ బజాజ్ స్ట్రీట్‌లోని ఐరా హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటుగా దర్శకుడు సందీప్‌రాజ్, కథానాయిక సాక్షి సాగర్ మదోల్కర్ చిత్ర విశేషాలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ ప్రతినిధులు పాల్గొన్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమాకు రోషన్ కథానాయకుడు కాగా, సందీప్ రాజ్ దర్శకుడు. ఈనెల 12న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాకు సాక్షి సాగర్ మదోల్కర్ కథానాయిక. వైవా హర్ష ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. కాలా భైరవ సంగీతం అందిస్తున్నారు.

# 'నారి నారి నడుమ మురారి' రిలీజ్ డేట్ ఫిక్స్..



చార్మింగ్ స్టార్ శర్వానంద్ ఫీల్-గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి' తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఉండబోతోంది. ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. ఇప్పటివరకు విడుదలైన ప్రతి ప్రమోషనల్ మెటీరియల్ ప్రేక్షకులలో బజ్ క్రియేట్ చేసింది. ఇప్పుడు మేకర్స్ ఎక్సైటింగ్ రిలీజ్ అప్డేట్ ఇచ్చారు. నారి నారి నడుమ మురారి 2026లో ప్రపంచవ్యాప్తంగా సంక్రాంతికి థియేటర్లలోకి రానుంది. ఇది తెలుగు సినిమా రిలీజెస్‌కి బిగ్గెస్ట్ సీజన్. ఈ సినిమా పూర్తి ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ కావడంతో సంక్రాంతి విడుదలకు పర్ఫెక్ట్. శర్వా ఈ పండుగ సమయంలో స్ట్రాంగ్ ట్రాక్ రికార్డ్‌ను కలిగి ఉన్నాడు, శతమానం భవతి, ఎక్స్‌ప్రెస్ రాజా వంటి చిత్రాలు సంక్రాంతి విడుదలై పెద్ద బ్లాక్‌బస్టర్‌లుగా నిలిచాయి. ఇదే జోరులో ఈ పండుగ సెలవులు చిత్రానికి గణనీయమైన ఉత్సాహాన్ని ఇస్తాయని టీం నమ్మకంగా ఉంది.

# 'గ్లోబల్ సమిట్'లో మహిళా శక్తికి జేజేలు








**మొదటి పేజీ తరవాత..**

పాలనలో మహిళా సాధికారతకు ఇస్తున్న ప్రాధాన్యత ఈ స్టాల్‌లో ప్రతిఫలిస్తోంది. వేల కోట్ల రూపాయల బ్యాంకింగ్ లింకేజ్ రుణాల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక బలాన్ని అందించడం, వందల కోట్ల రూపాయల వడ్డీ చెల్లింపులతో మహిళలపై రుణభారాన్ని తగ్గించడం, మహిళా సభ్యులకు రూ.10 లక్షల లోన్ బీమా, రూ.2 లక్షల ప్రమాద బీమా వంటి భద్రతా చర్యలు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలనలో, మంత్రి సీతక్క మార్గదర్శనంలో.. మహిళల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఇప్పటికే 20కు పైగా విభిన్న వ్యాపార రంగాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తూ, మహిళలను యజమానులుగా, నాయకులుగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళుతోంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్–2047లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్, మహిళ ఉన్నతి తెలంగాణ ప్రగతి అన్న ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలిచి, దేశం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది.



భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా.. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- వుదయం, హైదరాబాద్ ప్రతినిధి



### బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్‌ల

## రౌండ్ టేబుల్ సమావేశం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్ వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్, మల్లారెడ్డి, వినయ భాస్కర్, శ్రీనివాసగౌడ్, దేవి ప్రసాద్, రాంబాబు యాదవ్, మారయ్య, పలు కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు.

- వుదయం, హైదరాబాద్ ప్రతినిధి

# రోల్ మోడల్‌గా గ్లోబల్ సమ్మిట్




**మొదటి పేజీ తరవాత..**

ఈ రెండు సెక్టార్లకు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను ఈ సమ్మిట్‌లో వివరించబోతున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ రోజు సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందని, గడువులోగా పూర్తిస్థాయి ఏర్పాట్లకు ముమ్మర చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

తెలంగాణ ప్రగతి దేశంలో ఉన్న రాష్ట్రాలతో కాదు, ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే విధంగా.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది .తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. సమ్మిట్‌పై ఇండిగో విమానాల రద్దు ప్రభావం ఏమాత్రం చూపదని ముఖ్యమంత్రి దీనిపై ఎప్పటికప్పుడు వచ్చే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశీస్తున్నారని చెప్పారు.



# అంతర్జాతీయ విజన్

**మొదటి పేజీ తరవాత..**




నిర్వహణ ఏర్పాట్లతో పాటు సదస్సుకు తరలివచ్చే ప్రతినిధులను సమన్వయం చేస్తున్నారు. దావోస్‌లో ప్రతి ఏటా జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌ను తలపించేలా అంతర్జాతీయ స్థాయిలో ఈ సదస్సు జరగాలని ముఖ్యమంత్రి స్వయంగా ఈ సదస్సు ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తున్నారు. అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించారు.

ఈ సదస్సు వేదికలో రెండో రోజున డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తుంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను ఈ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో అన్ని రంగాల్లో భవిష్యత్తు తెలంగాణ అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు, టెక్నాలజీ భాగస్వామ్యాలు, నూతన ఆవిష్కరణల దిశగా సమగ్ర ప్రణాళికలను పొందుపరిచారు.

# గిరిజనులకు జీవనోపాధి మార్గాలు పెంచాలి

- గిరిజన ఉత్పత్తుల పెంపు, మార్కెటింగ్ అవసరం
- ఎకో టూరిజం మీద అవగాహన కల్పిస్తే ఆదాయ వృద్ధి
- యువతలో నిరుద్యోగం లేకుండా చేయాలి
- సినిమాలు, సీరియళ్ల షూటింగ్ జరిగేలా ప్రోత్సహించండి
- పకడ్బందీ ప్రణాళికను అమలు చేయాలి
- ఉపాధి హామీ పథకం ఉద్యాన పంటలకు అనుసంధానం ద్వారా మంచి ఫలితాలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్

**వుదయం, అమరావతి :**

అడవిని నమ్ముకొని బతికే గిరిజనుల జీవన ప్రమాణాలు పెరిగేలా యంత్రాంగం పనిచేయాలి. వారి ఆదాయ మార్గాలు పెంచాలి. దానికి తగినట్లుగా ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. అటవీ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ఎకో టూరిజం, పర్యాటకం పెంపు వంటి కీలకమైన అంశాలను ప్రతిపాదికగా తీసుకొని గిరిజన యువతలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలన్నారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్‌లతో ఉప ముఖ్య మంత్రి మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో గతంలో అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ గా పనిచేసి, ప్రస్తుతం చిత్తూరు కలెక్టర్ గా సేవలందిస్తున్న సుమిత్ కుమార్, గతంలో అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీగా పనిచేసి ప్రస్తుతం శ్రీసత్య సాయి జిల్లా



ఎస్పీగా పని చేస్తున్న సతీష్ కుమార్ లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా అటవీ ప్రాంతంలో గంజాయి నిర్మూలన అంశంపైనా చర్చించారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ప్రపంచం వేగంగా ముందుకు వెళుతోంది. దేశంలోనూ గణనీయమైన మార్పులు వస్తు న్నాయి. దీన్ని అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని వారి శక్తిని, శ్రమను ఉపయోగించుకొని వారి జీవన ప్రమాణాలను పెంచాలి. అటవీ ఉత్పత్తులు, ఆర్గానిక్ ప్రొడక్ట్స్ కి ఎంతో డిమాండ్ ఉంది. కాఫీ తోటలతోపాటు అడవిలో విరివిగా దొరికే ఉత్పత్తులను సాగు చేసేలా ప్రోత్సహించాలి. మార్కెట్ డిమాండు అనుసారం అటవీ ఉత్పత్తులను విరివిగా పెంచేలా చూడాలి. నిత్యం గిరిజనులతో మమేకం కావడం, వారి ఆలోచనలను వినడం, వారికి సహాయం చేయడం మర్చిపోవద్దు. వారిలో నూతన ఉత్తేజం నింపేలా కొత్త కార్యక్రమాలతో ఎప్పటికప్పుడు ముందుకు సాగాలి. గిరిజనుల ఆదాయం పెరగాలి. వారికి అన్ని సదుపాయాలు, సౌకర్యాలు అందాలి. విభిన్న మార్గాల్లో ఎలా ఆదాయం పొందాలో యువతలో స్ఫూర్తి నింపి, వారిని ఎంటర్ ప్రెన్యూర్స్ గా తీర్చిదిద్దాలి. వారిలో ఆత్మవిశ్వాసం పెంచేలా చేయాలి. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వారికి అందుబాటులోకి తీసుకురావాలి.

**ఉద్యాన పంటలకు ఉపాధి పనులకు అనుసంధానం..**

ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యాన పంటలకు అనువుగా ఉంటుంది. దీన్ని ఉపాధి హామీతో అనుసంధానం చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. దీనిపై మరింతగా దృష్టి సారించి, వివిధ రకాల పనులకు ఉపాధి హామీ అనుసంధానం అయ్యేలా అధికారులు పరిశీలన చేయాలి. ఏజెన్సీలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపుదలతో పాటు దానికి తగిన అనుసంధాన పనులు ఉపాధి పనుల్లో భాగంగా చేసుకునేందుకు వీలు కలుగుతుంది. ఇది గిరిజనులకు ఉపాధి కల్పనతో పాటు గిరిజన ప్రాంతాల్లో అటవీ ఉత్పత్తుల పెంపుదలకు ఎంతో తోడ్పాటునిస్తుంది. కాఫీ పంటలతో పాటు ఏజెన్సీలో అనువుగా ఉండే పంటలను పండించేలా కృషి చేయాలి.

**ప్రకృతిని రక్షిస్తూ పర్యాటకం పెంపుదల చేయాలి..**

ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యాటకం పెంపుదల ప్రధానం. ప్రతి ఒక్కరిరీ నే డు పర్యాటకం మీద ఆసక్తి పెరుగుతోంది. ఎకో టూరిజం అనేది ప్ర పంచంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రంగం. దీన్ని అందింపుచ్చుకోవాలి. సహజమైన ప్రకృతి సంపదకు ఏ మాత్రం నష్టం వాటిల్లకుండా ఎకో టూరిజం పెంపుదలపైన గిరిజనులకు తగిన అవగాహ న కల్పించాలి. యువతకు టూరిజం వల్ల వచ్చే లాభాలు, పర్యాటకులకు వసతి కల్పించడం ద్వారా అందే ఆదాయం మీద చైతన్యం కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అతి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సంపాదించే మార్గాలను వారికి చెప్పాల్సిన అవసరం ఉంది.

సినిమాలు, సీరియళ్లతో పాటు ఓటీటీలో వచ్చే వివిధ రకాల కంటెంట్ లను ఏజెన్సీ ప్రాంతాల్లో షూట్ చేసుకునేలా ప్రోత్సహించాలి. దీని వల్ల గిరిజనులకు ఆదాయం పెరగడంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుంది. గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, వారి జీవన ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు చర్చిద్దాం. నిరంతర అనుశీలన చేసి, నెలవారీ రిపోర్టులతో ముందుకు సాగుదాం. సమన్వయంతో యంత్రాంగం ముందుకు సాగితే కచ్చితంగా గిరిజనుల బతుకు చిత్రాలు మారుతాయి. దీనికి అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికను సిద్ధం కావాలి. దీనికి ఎల్లప్పుడూ ప్రభుత్వ సహకారం ఉంటుంది" అని హామీ ఇచ్చారు.




# స్థానిక 'సేవ'లో..

**మొదటి పేజీ తరవాత..**

స్పష్టంగా ప్రతిబింబించాయి. ఆదాయ సర్టిఫికేట్ దరఖాస్తులు పీక్ రోజుల్లో 19 వేలకు చేరుకోగా, కుల సర్టిఫికేట్ దరఖాస్తులు 28 వేల మార్క్‌ను దాటాయి. రీయిష్యూ దరఖాస్తులు కూడా అసాధారణంగా అధికంగా నమోదైనట్టు డేటా సూచిస్తోంది. మీసేవ సేవలను నిలకడగా కొనసాగించేందుకు నిరంతర పర్యవేక్షణ, వేగవంతమైన సాంకేతిక స్పందనను వ్యవస్థలు కొనసాగించాయని అధికారులు తెలిపారు. ఫీల్డ్ నుంచి వచ్చిన సమస్యలకు వెంటనే స్పందించి సేవలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని వారు పేర్కొన్నారు. ఎన్నికల ప్రభావం వంటి ప్రత్యేక పరిస్థితుల్లో కూడా ప్రజలకు పారదర్శకంగా, సమయపాలనతో, సౌహార్దంగా సేవలు అందించే సామర్థ్యం మీసేవకు ఉందని విభాగం భరోసా ఇచ్చింది.

# ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించండి

### కేంద్రానికి తెదేపా ఎంపీ లావు డిమాండ్



**న్యూ ఢిల్లీ :** ఇన్‌సర్వీస్‌లో ఉండే టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ విద్యాహక్కు చట్టం, ఎన్‌సీటీఈ చట్టాలను సవరించాలని తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం లోక్‌సభ జీరో అవర్‌లో దీనిపై మాట్లాడారు. "మా కుటుంబం విద్యాసంస్థలు నడుపుతుంది. నేను చిన్నప్పుడు టీచర్ ఇంట్లో పెరిగాను. దేశ నిర్మాణం కోసం టీచర్లు పడే కష్టం గురించి నాకు బాగా తెలుసు. అయితే 2010 ఆగస్టు 23 ముందు నియమితులైన టీచర్లంతా రెండేళ్లలోపు టీచర్ అర్హత పరీక్ష పాస్ కావాలని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా లక్షల మంది ఉపాధ్యాయుల్లో భయాందోళనలు రేపింది. విద్యాహక్కు చట్టం నిబంధనల్లో ఈ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇందులో చాలామంది ఇప్పటివరకు 15–30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకొని గ్రామీణ, గిరిజన ప్రాంత పాఠశాల వ్యవస్థకు వెన్నెముకగా నిలిచారు. ఎప్పుడో ముగిసిపోయిన ఈ సమస్యను సుప్రీంకోర్టు ఇప్పుడు మళ్లీ తెరవడం వల్ల సర్వీసులో ఉన్న టీచర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగ జీవితం చివరిదశలో ఉన్నవారిని మళ్లీ ప్రవేశపరీక్ష రాయాలని చెప్పడం వారికి బాధాకరంగా ఉంది. గడువులోగా వారు పరీక్ష పాసవ్వకపోతే ఉద్యోగాలు కోల్పోతారు. దీనివల్ల గ్రామీణప్రాంత పాఠశాలలు ఖాళీ అవుతాయి. అందువల్ల కేంద్రం ఆర్‌టీఈ చట్టానికి, ఎన్‌సీటీఈ చట్టానికి సవరణలు చేసి 2010 ఆగస్టుకు ముందు నియమితులైన టీచర్ల ప్రయోజనాలు కాపాడాలి. ఉపాధ్యాయులకు గౌరవం, స్థిరత్వం, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే" అని చెప్పారు.

# పరిశ్రమ అవసరాలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

- మ్యానుఫాక్చరింగ్ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- నరసరావుపేట ఎంపీ లావు కృష్ణ దేవరాయలు
- గ్లోబల్ టీపీఓ & హెచ్ఆర్ లీడర్షిప్ ఎక్సలెన్స్ సమిట్ 2025

**వుదయం, హైదరాబాద్ ప్రతినిధి :**

పరిశ్రమ అవసరాలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంపీ లావు కృష్ణ దేవరాయలు తెలిపారు. తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్‌తో కలిసి గ్లోబల్ టీపీఓ & హెచ్ఆర్ లీడర్షిప్ ఎక్సలెన్స్ సమిట్ 2025ను మాధాపూర్‌లోని టీ–హబ్లో రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాస్కామ్ 2000, 2002, 2004 రిపోర్టులు విడుదల చేసినప్పుడు మీ విద్యార్థులు ఈ ఉద్యోగాలను నిర్వహించడానికి ఇంకా పూర్తి సిద్ధంగా లేరని చెప్పిందన్నారు. అందుకే మార్పు చాలా వేగంగా జరగాలన్నారు. నాలుగైదేళ్ల తర్వాత మన విద్యార్థులు సిద్ధం కావచ్చు, కానీ వచ్చే ఏడాది పరిస్థితి ఏమిటి?, మరో ఒకట్రెండు ఏళ్లలో ఆ మార్పునకు తగినట్లు తయారవుతారా? లేదా? అన్నదే మన ముందున్న ప్రధాన సవాలు అన్నారు. ఐదారేళ్ల తర్వాత విద్యార్థులకు గానీ, పరిశ్రమలకు గానీ చెప్పాల్సిన అవసరం ఉండదన్నారు. అప్పటికి వారంతట వారే సిద్ధమవుతారన్నారు.

ఈ మార్పు జరుగుతున్న సమయం ఎంతో కీలకమన్నారు. అందుకనే హెచ్ఆర్ వైపు నుంచి ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్లకు సహకారం ఇవ్వాలన్నారు. ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు విద్యార్థులతో, మేనేజ్‌మెంట్‌తో, పరిశ్రమలతో నిజాయితీగా ఉండాలన్నారు. అప్పుడు మాత్రమే విశ్వసనీయత పెరుగుతుందన్నారు. అందరూ



ఐటీ గురించే ఎక్కువగా మాట్లాడుతారన్నారు. దానిపైనే అందరి దృష్టి ఉంటుందన్నారు. కానీ మన ముందున్న మరో కీలక అవకాశం మ్యానుఫాక్చరింగ్ రంగం అన్నారు. మ్యానుఫాక్చరింగ్ రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఎలాంటి పరిశ్రమలు బాగా పని చేస్తున్నాయో? అవన్నీ మరింత విస్తరించడానికి, ఎక్కువగా పెట్టుబడులు పెట్టడానికి, ఇంకా ఎక్కువ ఉద్యోగాలు సృష్టించడానికి అదనపు ప్రయోజనాలు అందిస్తోందన్నారు. విద్యార్థులను మ్యానుఫాక్చరింగ్ వైపు ప్రోత్సహించడంలో ఉన్న సమస్య ఏమిటంటే, ప్రారంభ స్థాయి జీతం ఐటీ రంగంతో పోలిస్తే కొంచెం తక్కువగా ఉంటుందన్నారు.

ఈ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి వచ్చారన్నారు.

రెండు రోజుల ఈ అంతర్జాతీయ సదస్సు ఈరోజు ముగిసింది. ఈ సమ్మిట్‌లో దేశ నలుమూలల నుంచి వచ్చిన 24 రాష్ట్రాల ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ ఛాప్టర్లు, హెచ్ఆర్ నాయకులు, పాలసీ మేకర్లు, అకాడమిషియన్లు ఒకే వేదికపై సమావేశం అయ్యారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్, హ్యూమన్ రిసోర్స్ అభివృద్ధి రంగాల్లో సంభాషణ, సహకారం, వినూత్నతకు ఇది ఒక విశేషమైన వేదిక అయింది. ఈ సమ్మిట్లో జాతీయ, అంతర్జాతీయ హెచ్ఆర్ నాయకుల కీలక ప్రసంగాలు, ప్యానల్ చర్చలు, టీపీఓలు, హెచ్ఆర్ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులకు ప్రత్యేక నెట్‌వర్కింగ్ అవకాశాలు, 24 రాష్ట్ర ఛాప్టర్ల మధ్య సహకార కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు, ఇండస్ట్రీ, అకాడమియా భాగస్వామ్యాల బలోపేతంపై దృష్టి సారించారు. ఈ సమ్మిట్ భారతదేశంలో ప్రతిభ అభివృద్ధి, ప్లేస్‌మెంట్ వ్యూహాలకు కొత్త దిశను చూపుతుంది. విద్య, ఉపాధి రంగాల్లో ఇన్నోవేషన్, లీడర్షిప్‌కు కేంద్రంగా హైదరాబాద్ స్థాయిని మరింత బలోపేతం చేస్తుంది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA**, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. Editor : SIRIKONDA AUGUSTIN. **RNI No.: TELTEL/2000/00272**. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.